thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 77 | జగిత్యాల | శుక్రవారం | 12 జూన్, 2026 | ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్ | పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

ఆఫ్గన్ ముందు భారత్ భారీ స్కోరు



11

# దేశాభివృద్ధికి విద్యే పునాది!

## చదువుతోనే వెనుకబాటుకు చెక్!

నీతి ఆయోగ్ భేటీలో ముఖ్యమంత్రి రేవంత్



### ఆరు నగరాల కోసం ఎం-6 టాస్క్‌ఫోర్స్ ప్రతిపాదన

- ఒక్కో నగరానికి ఆరు లక్షల కోట్లు ఇవ్వాలన్న రేవంత్
- కేంద్రం ముందు తెలంగాణ అభివృద్ధి నమూనా
- మూసీ, ఫ్యూచర్ సిటీలకు సహకరించాలని విజ్ఞప్తి
- సమావేశం అనంతరం ప్రధాని మోదీతో భేటీ
- ప్రాజెక్టుల అనుమతులపై చర్చ

2

దేశ ఆర్థిక ప్రగతికి చోదక శక్తులుగా ఉన్న ఆరు ప్రధాన నగరాల అభివృద్ధికి తలా ఆరు లక్షల కోట్ల రూపాయలతో 'ఎం-6 టాస్క్‌ఫోర్స్' ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వికసిత్ భారత్ లక్ష్యం నెరవేరాలంటే నాణ్యమైన విద్య, మెరుగైన వైద్యం అందించడమే ఏకైక మార్గమని స్పష్టం చేశారు. గురువారం న్యూఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన నీతి ఆయోగ్ సమావేశంలో పాల్గొన్న ఆయన.. తెలంగాణ అభివృద్ధి నమూనాను దేశం ముందుంచారు. సామాజిక వెనుకబాటును పారద్రోలేందుకు రాష్ట్రంలో చేపట్టిన 'యంగ్ ఇండియా' పాఠశాలలను పరిశీలించేందుకు రావాలని దేశవ్యాప్త నేతలకు బహిరంగ ఆహ్వానం పలికారు. సమావేశం అనంతరం ప్రధానితో ప్రత్యేకంగా భేటీ అయి రాష్ట్ర ప్రాజెక్టులకు నిధులు, అనుమతులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.

- న్యూఢిల్లీ, జూన్ 11




# 2047 నాటికి నవభారత నిర్మాణం

- 'వికసిత్ భారత్'పై నీతి ఆయోగ్ చారిత్రాత్మక మంథనం!
- ప్రతి పౌరుడి జీవన ప్రమాణాల మెరుగుదలే లక్ష్యం
- ప్రధాని అధ్యక్షతన గవర్నింగ్ కౌన్సిల్ 11వ సమావేశం
- సమగ్ర మానవాభివృద్ధి, నైపుణ్యాలు, ఉపాధి, ఆరోగ్య రంగాలపై చర్చ

4

దేశాన్ని 2047 నాటికి సంపూర్ణ అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దే చారిత్రాత్మక లక్ష్యంతో 'నీతి ఆయోగ్' గవర్నింగ్ కౌన్సిల్ 11వ సమావేశం గురువారం ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్ సాంస్కృతిక కేంద్రంలో అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన ఈ ఉన్నత స్థాయి భేటీలో సమగ్ర మానవాభివృద్ధి, ఉపాధి కల్పన, నైపుణ్యాభివృద్ధి, ప్రజల సంక్షేమ కార్యక్రమాలే అజెండాగా విస్తృతంగా మంథనం చేశారు. ఈ ఏడాది సదస్సుకు "వికసిత్ భారత్-2047 కోసం సమగ్ర మానవాభివృద్ధి" అనే ప్రధానాంశాన్ని ఎంచుకున్నారు. వయస్సు, ప్రాంతం, లింగం, సామాజిక, ఆర్థిక పరిస్థితియోంలతో సంబంధం లేకుండా దేశంలోని ప్రతి పౌరుడి జీవన ప్రమాణాలను మెరుగుపర్చే విప్లవాత్మక విధానాలపై ఈ సందర్భంగా ప్రత్యేక దృష్టి సారించారు.

- న్యూఢిల్లీ, జూన్ 11

# సీబీఐ విచారణ జరపాలి!

ఇసుక దందాపై శ్వేతపత్రం విడుదల చేయాలి

ఆదివాసీల రాజ్యాంగ హక్కులను రక్షించాలి

గవర్నర్ శివప్రతాప్ శుక్లాకు నేతల వినతిపత్రం



భద్రాద్రి కొత్తగూడెం, ములుగు జిల్లాల పరిధిలోని గోదావరి నదీ పరివాహక ప్రాంతాల్లో జరుగుతున్న ఇసుక తవ్వకాలపై సీబీఐతో సమగ్ర విచారణ జరిపించాలని ఆదివాసీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఐదో షెడ్యూల్ ప్రాంతాల్లో ఆదివాసీల రాజ్యాంగ హక్కులు, భూములను కాపాడేందుకు ప్రత్యేకంగా జోక్యం చేసుకోవాలని గవర్నర్‌ను కోరారు.

2



# ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

- అందుబాటులో మార్కుల మెమోలు
- పరీక్ష రాసిన నాలుగు లక్షల మంది
- వేగంగా ముగిసిన మూల్యాంకనం
- ఏమాత్రం జాప్యం లేకుండా ప్రకటన
- హాల్‌టికెట్‌తో పూర్తి వివరాలు

వివరాలు 2వ పేజీలో




# ఒమన్ తీరంలో భారతీయ నౌకపై దాడి

కాల్పుల్లో ముగ్గురు నావికుల మృతి

ధ్రువీకరించిన మంత్రి

4

# స్వదేశీ రక్షణ రంగానికి చారిత్రాత్మక మైలురాయి

### భారత్‌లో తయారైన తొలి సీ295 విమానం విజయవంతం



భారత రక్షణ, విమానయాన రంగాల్లో గురువారం చారిత్రాత్మక ఘట్టం నమోదైంది. దేశంలోనే తయారైన తొలి 'మేడ్ ఇన్ ఇండియా' సీ295 సైనిక రవాణా విమానం విజయవంతంగా తొలి పరీక్షా ప్రయాణాన్ని పూర్తి చేసింది. గుజరాత్‌లోని వడోదరలో ఏర్పాటు చేసిన తుది అసెంబ్లీ కేంద్రం నుంచి ఈ విమానం గాల్లోకి ఎగరడంతో స్వదేశీ రక్షణ తయారీ రంగం మరో కీలక మైలురాయిని అధిగమించింది.

4



# బిడ్డలతో తల్లి అదృశ్యం!

- కామారెడ్డిలో మిస్సింగ్ కలకలం
- రెండు రోజుల క్రితం ఘటన
- దారితీసిన కుటుంబ కలహాలు
- ఆందోళనలో బంధువులు

2

# ఫ్యూచర్ సిటీ వంద శాతం రద్దు చేస్తాం

- మీనాక్షి నటరాజన్‌కు వెన్నుపోటు పొడిచారు
- పదుల కోట్లతో ముఖ్యమంత్రి విలాసవంతమైన భవనం
- కాంగ్రెస్ ప్రభుత్వంపై హరీష్ రావు ఫైర్

ఫ్యూచర్ సిటీని తాము వంద శాతం రద్దు చేస్తామని మాజీ మంత్రి హరీష్ రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఫార్మా సిటీ కోసం సేకరించిన భూములతో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తే ఊరుకోబోమని హెచ్చరించారు.



2

# 'దోపిడీ సర్కార్!'

- తరుగు, రవాణా పేరుతో రైతుల నుంచి భారీ లూటీ
- ఉచిత విద్యుత్‌కు ఎసరు పెడుతున్న రేవంత్ ప్రభుత్వం
- ప్రభుత్వ తీరుపై నిప్పులు చెరిగిన కవిత



2

# 'దొంగ ఓట్లు తీసేస్తే భయమా?'

- విపక్షాల తీరుపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు ఫైర్
- ఎస్ఈఆర్ ప్రక్రియపై బురదజల్లడం సరికాదని హితవు



చురకలు

శుక్రవారం 12 జూన్ 2026

# ఫ్యూచర్ సిటీ వంద శాతం రద్దు చేస్తాం

**ఫార్మా భూముల్లో రియల్ వ్యాపారమా?**

**ప్రత్యామ్నాయ స్థలాలు జర్నలిస్టులకు ఇవ్వాలి**

**కాంగ్రెస్ ప్రభుత్వంపై హరీష్ రావు ఫైర్**



**హైదరాబాద్:** ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ఫ్యూచర్ సిటీని బీఆర్ఎస్ వంద శాతం రద్దు చేస్తుందని మాజీ మంత్రి హరీష్ రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. ఫార్మా సిటీ పేరుతో సేకరించిన భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం వాడితే చట్టం ఊరుకోదని హెచ్చరించారు. ఫ్యూచర్ సిటీలో వివాదాస్పద భూములు కాకుండా జర్నలిస్టులకు ప్రత్యామ్నాయ స్థలాలు ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయాల వల్ల డెబ్బై వేల కోట్ల ఫార్మా పెట్టుబడులు వెనక్కి పోయాయని హరీష్ రావు విమర్శించారు. ఫార్మా సిటీని రద్దు చేసి భూములను రైతులకు తిరిగిస్తామని గతంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీని గుర్తుచేశారు. ఫార్మా సిటీ కోసం తాను కూడా పదిహేడు ఎకరాల భూమి ఇచ్చానని, ఆ భూములను రియల్ ఎస్టేట్ వ్యాపారానికి వాడితే చూస్తూ ఊరుకోబోమని స్పష్టం చేశారు. ఫ్యూచర్ సిటీలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇస్తే తాము వ్యతిరేకించబోమని, అయితే వివాదాలు లేని ప్రత్యామ్నాయ భూములు ఇవ్వాలని కోరారు. కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణ వెనుక సొంత పార్టీ నేతల హస్తం ఉందని హరీష్ రావు ఆరోపించారు. ఆమెపై ఉన్న కేసు వివరాలను తెలంగాణకు చెందిన ఓ వ్యక్తే మధ్యప్రదేశ్ బీజేపీ మంత్రులకు లీక్ చేశారని విమర్శించారు. ముఖ్యమంత్రి సూచించిన వ్యక్తికి వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి ఇవ్వకపోవడం వల్లే ఆయన అనుచరుడే ఈ పని చేశాడని ఆరోపించారు. ఈ కుట్రపై ముఖ్యమంత్రి సిట్ లేదా జ్యుడీషియల్ విచారణ వేస్తారా అని సవాల్ విసిరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన నివాసం సమీపంలో వంద కోట్ల ప్రజాధనంతో 'బోధి పెవిలియన్' పేరిట విలాసవంతమైన ఇల్లు నిర్మించుకుంటున్నారని హరీష్ రావు ఆరోపించారు. ఇనుప కంచెలకే పదిహేడు కోట్లు, ఫుట్‌బాల్ ఆడేందుకు పది కోట్లు వెచ్చిస్తున్నారని మండిపడ్డారు. పని చేయని ముఖ్యమంత్రికి ఇన్ని క్యాంపు కార్యాలయాలు ఎందుకని ప్రశ్నించారు. ఏడు కోట్లతో జీవో ఇచ్చి ఇప్పటికే డెబ్బై కోట్ల పైగా ప్రజాధనం వృథా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు నిధులు లేవంటున్న ప్రభుత్వం ముఖ్యమంత్రి సోకుల కోసం వందల కోట్లు ఖర్చు చేయడంపై ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# బదిలీల ప్రక్రియ పూర్తి!

**వైద్య ఆరోగ్యశాఖలో ముగిసిన బదిలీలు**

**157 కేడర్లలో 4,869 మందికి స్థానచలనం**



**హైదరాబాద్:** రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖలో బారీ స్థాయిలో చేపట్టిన బదిలీల ప్రక్రియ విజయవంతంగా పూర్తయింది. ఆస్పత్రుల్లో రోగులకు అందే సేవలకు ఎలాంటి ఆటంకం కలగకుండా, వైద్య సంస్థల్లో మానవ వనరుల సమతుల్యత దెబ్బతినకుండా ప్రభుత్వం వంద యాభై ఏడు కేడర్లకు చెందిన నాలుగు వేల ఎనిమిది వందల అరవై తొమ్మిది మందికి స్థానచలనం కల్పించింది. బదిలీ అయినవారిలో పబ్లిక్ హెల్త్ డైరెక్టరేట్ పరిధిలో అత్యధికంగా చచచచమంది ఉన్నారు. త్వరలో రాష్ట్రంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీలు, అనుబంధ టీచింగ్ ఆస్పత్రుల్లో నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) తనిఖీలు ప్రారంభం కానున్నాయి. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఆయా ఆస్పత్రుల్లో అవసరమైన మేరకు వైద్యులు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది, అధ్యాపకులు అందుబాటులో ఉండేలా బదిలీలు నిర్వహించారు. ఒకే ఆస్పత్రి నుంచి పెద్ద సంఖ్యలో సిబ్బందిని ఒకేసారి మారిస్తే రోగుల సేవలకు ఇబ్బంది కలుగుతుందని భావించి.. ఒకే స్టేషన్‌లో నాలుగు లేదా అంతకంటే ఎక్కువ ఏళ్లు పనిచేసిన వారికి మాత్రమే బదిలీ అవకాశం కల్పించారు. ప్రజలకు అవసరమైన తొంభై శాతం వైద్య సేవలను జిల్లా స్థాయిలోనే అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం జిల్లా, ఏరియా ఆస్పత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లను బలోపేతం చేస్తోంది. కొత్తగా నియామకాలు పొందుతున్న వైద్య సిబ్బందికి గ్రామీణ, జిల్లా స్థాయి సంస్థల్లోనే పోస్టింగులు ఇస్తోంది. ఈ తాజా బదిలీలతో ఏళ్ల తరబడి జిల్లాల్లో పనిచేసిన సిబ్బందికి, వైద్యులకు హైదరాబాద్ వచ్చే అవకాశం దక్కింది. దీంతో వారంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు. బదిలీలు పారదర్శకంగా జరగడంతో ఆరోగ్య వ్యవస్థ మరింత బలోపేతం అవుతుందని అధికారులు భావిస్తున్నారు.

# ప్రవేశాలు పెరగాలి!

**డీఈవోలకు విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశాలు**

**హైదరాబాద్:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు భారీగా పెంచేలా పటిష్ఠ చర్యలు చేపట్టాలని తెలంగాణ విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ మిట్టల్ అధికారులను ఆదేశించారు. బడులు పునఃప్రారంభం నాటికి మౌలిక వసతులు సహా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని డీఈవోలకు కీలక దిశానిర్దేశం చేశారు. విద్యా నాణ్యత మెరుగుదలకు అన్ని పాఠశాలల్లో అకడమిక్ ప్యానెల్ తనిఖీలు నిర్వహించాలని నవీన్ మిట్టల్ సూచించారు. ఉపాధ్యాయుల సర్దుబాటు సమస్యలను వెంటనే పరిష్కరించి ఎక్కడా బోధనా సిబ్బంది కొరత లేకుండా చూడాలని ఆదేశించారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు పూర్తిస్థాయిలో పనిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థుల అభ్యాస ఫలితాల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ప్రాథమిక అక్షరాస్యత, సంఖ్యాజ్ఞానంతో పాటు ప్రీ ప్రైమరీ విద్యకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని నిర్దేశించారు. ఏకరీతి దుస్తులు, పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాల పంపిణీని సకాలంలో పూర్తి చేయాలన్నారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం నాణ్యత, తయారీ, వడ్డించే ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను డైరెక్టర్ ఆదేశించారు. బడుల్లో విద్యార్థుల నమోదును పెంచేందుకు నిర్వహించే కార్యక్రమాల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులను సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు. రెండు వేల ఇరవై ఆరు - ఇరవై ఏడు విద్యా సంవత్సరాన్ని అభ్యాస ఫలితాల మెరుగుదల సంవత్సరంగా మార్చేందుకు అధికారులంతా సమిష్టి కృషితో, అంకితభావంతో పనిచేయాలని నవీన్ మిట్టల్ కోరారు.

# దేశాభివృద్ధికి విద్యే పునాది!

- చదువుతోనే వెనుకబాటుకు చెక్!
- నీతి ఆయోగ్ భేటీలో ముఖ్యమంత్రి రేవంత్
- ఆరు నగరాల కోసం ఎం-6 టాస్క్‌ఫోర్స్ ప్రతిపాదన
- ఒక్కో నగరానికి ఆరు లక్షల కోట్లు ఇవ్వాలన్న రేవంత్
- ఐఐఎం మంజూరు చేయాలని వినతి
- మూసీ, ఫ్యూచర్ సిటీలకు సహకరించాలని విజ్ఞప్తి
- యంగ్ ఇండియా బడులను పరిశీలించాలని అధికారులకు ఆహ్వానం
- సమావేశం అనంతరం ప్రధాని మోదీతో ప్రత్యేక భేటీ



**న్యూఢిల్లీ:** దేశాభివృద్ధికి విద్య, వైద్యమే బలమైన పునాది అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉద్ఘాటించారు. వికసిత్ భారత్-2047 లక్ష్యం నెరవేరాలంటే ప్రతి పౌరుడికి నాణ్యమైన విద్య, మెరుగైన వైద్యం అందాలని ఆకాంక్షించారు. గురువారం న్యూఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన పదకొండో నీతి ఆయోగ్ పాలక మండలి సమావేశంలో ఆయన పాల్గొని తెలంగాణ అభివృద్ధి నమూనాను వివరించారు. డబ్బు, భూమి కంటే విద్య లేకపోవడమే సామాజిక వెనుకబాటుకు ప్రధాన కారణమని కులగణన సర్వేలో తేలిందని రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఈ వెనుకబాటును నిర్మూలించేందుకే రాష్ట్రంలో యంగ్ ఇండియా స్కూల్స్ నిర్మిస్తున్నామన్నారు. దేశంలో ఏ రాష్ట్ర ముఖ్యమంత్రి అయినా, అధికారులైనా వచ్చి తాము నిర్మిస్తున్న ఈ పాఠశాలలను స్వయంగా పరిశీలించవచ్చని ఆహ్వానించారు. యువతకు ప్రపంచస్థాయి నైపుణ్యాలు అందించేందుకే ఆనంద్ మహీంద్రా, శ్రీనివాసరాజు లాంటి కార్పొరేట్ దిగ్గజాల భాగస్వామ్యంతో యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని వివరించారు. టాటా గ్రూప్ సహకారంతో రెండు వేల వందల కోట్ల రూపాయల పెట్టుబడితో రాష్ట్రంలోని ఐటీఐలను ఆధునిక శిక్షణా కేంద్రాలుగా మారుస్తున్నట్లు సీఎం స్పష్టం చేశారు. రెండు వేల ముప్పై నాలుగు నాటికి ఒక ట్రిలియన్ డాలర్లు, రెండు వేల నలభై ఏడు నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని ముఖ్యమంత్రి ప్రకటించారు. హైదరాబాద్‌కు ఐఐఎం (ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్) మంజూరు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తెలంగాణకు అంతర్జాతీయ వర్సిటీలను రప్పించే క్రమంలో హైదరాబాద్‌లో యూనివర్సిటీ ఆఫ్ లండన్ ఆఫ్ షోర్ క్యాంపస్ ఏర్పాటు చేయడం తమ తొలి విజయమని గుర్తుచేశారు. దేశ ఆర్థికాభివృద్ధికి ఇంజిన్లుగా ఉన్న న్యూఢిల్లీ, ముంబై, కోల్‌కతా, చెన్నై, హైదరాబాద్, బెంగళూరు నగరాల అభివృద్ధికి ఎం-6 టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలని రేవంత్ రెడ్డి ప్రతిపాదించారు. ఈ ఆరు నగరాల్లో మౌలిక వసతుల కోసం ఒక్కో నగరానికి ఆరు లక్షల కోట్ల రూపాయల చొప్పున ప్రత్యేక నిధిని కేంద్రం కేటాయించాలని కోరారు. అలాగే రీజినల్ రింగ్ రోడ్, మెట్రో రెండో దశ, మూసీ పునరుజ్జీవం, ఫ్యూచర్ సిటీ నిర్మాణాలకు కేంద్రం సహకరించాలని సూచించారు. పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకం అనుమతులు, సెమీ కండక్టర్ పరిశ్రమల ఏర్పాటుకు కేంద్రం మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. నీతి ఆయోగ్ సమావేశం ముగిసిన అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రధానమంత్రి మోదీతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. తెలంగాణకు సంబంధించిన పలు కీలక ప్రాజెక్టుల అనుమతులు, నిధుల కేటాయింపులపై చర్చించారు. ప్రధానంగా మూసీ రివర్ ఫ్రంట్, ఫ్యూచర్ సిటీ, మెట్రో రెండో దశ పనులకు కేంద్రం నుంచి దక్కాల్సిన తోడ్పాటుపై ఆయనతో సుదీర్ఘంగా మాట్లాడారు.

# తోడ్పాటు అందించండి!

- ప్రధాని మోదీతో ముఖ్యమంత్రి రేవంత్ భేటీ
- మెట్రో రెండో దశ, ట్రిపుల్ ఆర్‌కు ఆమోదం తెలపాలి
- రాష్ట్రానికి ఐఐఎం మంజూరు చేయాలని వినతి


**న్యూఢిల్లీ:** తెలంగాణకు సంబంధించిన పలు మౌలిక వసతుల ప్రాజెక్టులకు సహకారం అందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కోరారు. సాగు, తాగునీటి అవసరాల కోసం గోదావరి జలాలను సమర్థంగా వినియోగించుకునేలా మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చలకు కేంద్రం చొరవ చూపాలని ఆయన విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ మెట్రో రైలు రెండో దశ విస్తరణ ప్రతిపాదనలను ఆమోదించాలని ప్రధానిని సీఎం కోరారు. 7 కారిడార్లలో 122.9 కిలోమీటర్ల మేర 38,595 కోట్లతో చేపట్టే ఈ ప్రాజెక్టును కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఉమ్మడి సంస్థగా మంజూరు చేయాలన్నారు. రీజనల్ రింగ్ రోడ్ పనులకు వెంటనే ఆమోదం తెలపాలని కోరారు. ఉత్తర భాగంలో భూసేకరణ ఖర్చులో 50 శాతం భరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించిందని, జాతీయ రహదారుల ప్రాధికార సంస్థకు 626 కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు. చౌటుప్పల్ నుంచి సంగారెడ్డి వరకు నిర్మించే దక్షిణ భాగం అలైన్‌మెంట్ మ్యాపులను ఇప్పటికే కేంద్ర రహదారుల శాఖకు అందించామని, ఈ రెండు భాగాలను ఒకేసారి ఆమోదించి అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ నుంచి అమరావతి మీదుగా బందరు పోర్టును కలిపే 12 లేన్ల ఎక్స్‌ప్రెస్‌వేకు అనుమతి ఇవ్వాలని ముఖ్యమంత్రి కోరారు. 120 మీటర్ల వెడల్పుతో ప్రతిపాదించిన ఈ రహదారి ద్వారా సముద్ర తీరం లేని తెలంగాణకు పోర్టు కనెక్టివిటీ లభిస్తుందని వివరించారు. ఫార్మా, ఇతర రంగాల ఎగుమతులకు ఇది కీలక మార్గంగా నిలుస్తుందని తెలిపారు. వరంగల్ విమానాశ్రయ పనులను వెంటనే ప్రారంభించాలని కోరారు. ఇప్పటికే భూసేకరణ పూర్తి చేసి అథారిటీకి అప్పగించినట్లు తెలిపారు. హైదరాబాద్‌లో ఐఐఎం ఏర్పాటు చేయాలని, ఇందుకు అవసరమైన 200 ఎకరాల స్థలం కేటాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రధానికి వివరించారు. రాష్ట్రంలో ఇప్పటికే పలు ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలు ఉన్నాయని, ఐఐఎం ఏర్పాటు చేస్తే నూతన విద్యావిధానం లక్ష్యం కూడా నెరవేరుతుందని ఆయన ప్రస్తావించారు.

# దోపిడీ సర్కార్!

**ప్రభుత్వ తీరుపై నిప్పులు చెరిగిన కవిత**



**నల్గొండ:** ధాన్యం కొనుగోళ్లలో తరుగు, రవాణా పేరుతో రైతుల నుంచి ఏకంగా పన్నెండు వందల కోట్లు దోచుకున్న సిగ్గులేని ప్రభుత్వం రాష్ట్రంలో నడుస్తోందని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రైతు డిస్కం పేరుతో ఉచిత విద్యుత్‌ను ఎత్తివేసేందుకు సర్కారు కుట్ర చేస్తోందని ఆమె ఆరోపించారు. రైతు సమస్యలపై గురువారం నల్గొండలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో కవిత మాట్లాడారు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వ్యవసాయ శాఖపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కనీసం ఒక్క సమీక్ష కూడా నిర్వహించకపోవడం రైతుల పట్ల ఉన్న నిర్లక్ష్యానికి అద్దం పడుతోందని విమర్శించారు. మృగశిర కార్తె ప్రారంభమైనా నేటికీ రైతు భరోసా నిధులు విడుదల కాలేదని, రుణమాఫీ అమలు పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. క్వింటాకు ఆరు కిలోల తరుగు పేరిట రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. అసైన్డ్ భూములకు హక్కులు కల్పిస్తామన్న హామీ గాలికొదిలేసి కొందరు నేతలు అక్రమాలకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నల్గొండ జిల్లా ప్రాజెక్టుల పట్ల ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ చూపిస్తోందని, పాలమూరు ఎత్తిపోతల ద్వారా నల్గొండకు కూడా సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయాన్ని ఒక పరిశ్రమగా గుర్తించి పారిశ్రామికవేత్తలకు ఇస్తున్న సౌకర్యాలన్నీ రైతులకూ కల్పించాలని కవిత ప్రభుత్వానికి సూచించారు. రైతుల పక్షాన పోరాడేందుకు తెలంగాణ రక్షణ సేనకు ప్రజలు మద్దతుగా నిలవాలని కోరారు. అనంతరం ఈ సమావేశంలో పలు కీలక తీర్మానాలను ఆమోదించారు. రైతు డిస్కం ఆలోచన విరమించుకోవడం, యూరియా యాప్ రద్దు చేయడం, బకాయి పడిన రైతు భరోసా తక్షణమే అందించడం, కౌలు రైతులను గుర్తించి ఆర్థిక సాయం ఇవ్వడం, వ్యవసాయ కూలీలకు పన్నెండు వేల రూపాయల చెల్లింపు, మూసీ కాలుష్య నివారణ, నిమ్మ, బత్తాయి, పత్తి రైతుల సమస్యల పరిష్కారం లాంటి మొత్తం పది తీర్మానాలకు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. భవిష్యత్తులో ఉమ్మడి కార్యాచరణతో బలమైన ఉద్యమాలు నిర్మిస్తామని కవిత ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అనంతరం నల్గొండలో పర్యటించి, వివిధ పంటలను పరిశీలించి రైతులసమస్యలను అడిగి తెలుసుకున్నారు.



# దొంగ ఓట్లు తీసేస్తే భయమా?

**విపక్షాల తీరుపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు ఫైర్**

**ఎస్ఈఆర్ ప్రక్రియపై బురదజల్లడం సరికాదని హితవు**

**సిద్దిపేట:** ఓటర్ల జాబితా ప్రక్షాళన కోసం చేపట్టిన 'ఎస్ఈఆర్' ప్రక్రియపై విపక్షాలు ఉద్దేశపూర్వకంగా బురదజల్లుతున్నాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు తీవ్ర స్థాయిలో విమర్శించారు. దొంగ ఓట్లను తొలగిస్తుంటే ప్రతిపక్షాలకు ఎందుకంత భయమని ఆయన సూటిగా ప్రశ్నించారు. సిద్దిపేట జిల్లా కుకునూరుపల్లి మండలం మాతృపల్లిలో నిర్వహిస్తున్న బీజేపీ జిల్లా స్థాయి శిక్షణా తరగతుల్లో రామచంద్రరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దొంగ ఓట్లను ఏరివేయడం ఎన్నికల సంఘం ప్రాథమిక విధి అని స్పష్టం చేశారు. గతంలో ఈ ప్రక్రియ నిర్వహించినప్పుడు తాము సంపూర్ణ మద్దతు ఇచ్చామని, ఇప్పుడు మాత్రం రాజకీయ ప్రయోజనాల కోసం ప్రతిపక్షాలు తమపై ఆరోపణలు చేస్తున్నాయని మండిపడ్డారు. కేరళ, కర్ణాటక, తెలంగాణ సహా పలు రాష్ట్రాల్లో ఎస్ఈఆర్ ప్రక్రియ సాఫీగా కొనసాగుతోందన్నారు. ఓటు హక్కు ఉన్న ప్రాంతంలోనే దానిని వినియోగించుకునేలా చేయడమే దీని ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు రైతులు, విద్యార్థులు, ఉద్యోగులతో పాటు అన్ని వర్గాలను మోసం చేశాయని ఆరోపించారు. రాష్ట్రంలో ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా ఎదగుతున్న బీజేపీని మాత్రమే ప్రజలు విశ్వసిస్తున్నారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఓటర్ల జాబితా ప్రక్షాళన కోసమే ఎస్ఈఆర్ ప్రక్రియను నిర్వహిస్తున్నట్లు మెదక్ ఎంపీ రఘునందన్‌రావు తెలిపారు. ఈ ప్రక్రియను కేవలం రాజకీయ కోణంలో చూడకుండా ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించేందుకు కృషి చేయాలని ఆయన సూచించారు. ఎస్ఈఆర్ అమలులో ప్రభుత్వం పూర్తిస్థాయి పారదర్శకత పాటించాలని ఆయన డిమాండ్ చేశారు.

# గాంధీభవన్ చేరుకున్న కామారెడ్డి పంచాయితీ

**క్రమశిక్షణ కమిటీ ముందు హాజరైన చంద్రశేఖర్**

**హైదరాబాద్, జూన్ 11:** కామారెడ్డి పంచాయితీ మరోసారి గాంధీభవన్‌కు చేరింది. గురువారం పార్టీ నేత చంద్రశేఖర్ రెడ్డి.. క్రమశిక్షణ కమిటీ ముందు హాజరై వివరణ ఇచ్చారు. సీనియర్ నేత షబ్బీర్ అలీ వల్లనే కామారెడ్డిలో 20 ఏళ్లుగా పార్టీ గెలవడం లేదని చెప్పారు. గత 20 రోజులుగా కామారెడ్డి పంచాయితీ.. కాంగ్రెస్ పార్టీలో హైటెన్షన్ వాతావరణాన్ని నెలకొల్పింది. సీనియర్ నేత షబ్బీర్ అలీ, జనరల్ సెక్రటరీ చంద్రశేఖర్ రెడ్డి మధ్య వివాదం చెలరేగింది. వీరిద్దరూ రెండు గ్రూప్‌లుగా విడిపోయి ఒకరిపై ఒకరు ఫిర్యాదులు చేసుకున్నారు. పార్టీకి నష్టం చేస్తున్నారంటూ షబ్బీర్ అలీపై చంద్రశేఖర్ ఫిర్యాదు చేశారు. అలాగే చంద్రశేఖర్ తనను తిట్టారంటూ షబ్బీర్ అలీ ఆరోపించారు. షబ్బీర్ అలీ ఫిర్యాదు మేరకు చంద్రశేఖర్ రెడ్డికి క్రమశిక్షణ కమిటీ నోటీసులు జారీ చేసింది. దీంతో ఈరోజు క్రమశిక్షణ కమిటీ ముందు చంద్రశేఖర్ హాజరయ్యారు. తనపై వచ్చిన ఆరోపణలన్నింటిపైనా లిఖితపూర్వకంగా క్రమశిక్షణ కమిటీకి వివరించారు. షబ్బీర్ ఆలీ తీరుతో కామారెడ్డిలో కాంగ్రెస్ పార్టీకి నష్టం జరుగుతోందని, ఆయన్ను పార్టీ బాధ్యతల నుంచి పూర్తిగా తప్పించాలని చంద్రశేఖర్ రెడ్డి చెప్పారు. రెండు రోజుల క్రితం పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్, పార్టీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన షబ్బీర్ అలీ ఆడియో వైరల్ అవుతోంది. దీనిపై కూడా క్రమశిక్షణ కమిటీకి చంద్రశేఖర్ రెడ్డి వివరణ ఇచ్చినట్లు సమాచారం.

చురకలు

శుక్రవారం 12 జూన్ 2026

# సీబీఐ విచారణ జరపాలి!

- గోదావరి ఇసుక దందాపై శ్వేతపత్రం విడుదల చేయాలి
- ఆదివాసీల రాజ్యాంగ హక్కులను రక్షించాలి
- గవర్నర్ శివప్రతాప్ శుక్లాకు నేతల వినతిపత్రం



**హైదరాబాద్:** భద్రాద్రి కొత్తగూడెం, ములుగు జిల్లాల పరిధిలోని గోదావరి నదీ పరివాహక ప్రాంతాల్లో జరుగుతున్న ఇసుక తవ్వకాలపై సీబీఐతో సమగ్ర విచారణ జరిపించాలని ఆదివాసీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఐదో షెడ్యూల్ ప్రాంతాల్లో ఆదివాసీల రాజ్యాంగ హక్కులు, భూములను కాపాడేందుకు ప్రత్యేకంగా జోక్యం చేసుకోవాలని గవర్నర్‌ను కోరారు. ఆల్ ఇండియా ఆదివాసీ రాజ్యాంగ హక్కులు, సంస్కృతి పరిరక్షణ సమన్వయ సమితి నాయకులు చందా లింగయ్య దొర, పూర్ణచంద్రరావు, రమేష్, రాజారావు తదితరులు గురువారం లోక్‌భవన్‌లో గవర్నర్ శివప్రతాప్ శుక్లాను కలిశారు. ఈ మేరకు ఆయనకు ఒక వినతిపత్రం సమర్పించారు. రెండు వేల పద్నాలుగు నుంచి ఇప్పటివరకు తవ్విన ఇసుక, దాని ద్వారా వచ్చిన ఆదాయం, గిరిజనాభివృద్ధికి వెచ్చించిన నిధులపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇసుక తవ్వకాల వ్యవహారంపై తక్షణమే ప్రత్యేక ఆడిట్ నిర్వహించాలని కోరారు.

### గిరిజన సెల్ ఏర్పాటు చేయాలి..

పెసా, అటవీ హక్కుల చట్టం, 1/70 భూ బదలాయింపు చట్టాలున్నా ఆదివాసీలు నిరుద్యోగం, నిర్వాసితత్వంతో ఇబ్బందులు పడుతున్నారని గవర్నర్‌కు వివరించారు. జీవో నంబర్ 3 రద్దు నేపథ్యంలో స్థానిక గిరిజన యువత ఉపాధికి ప్రత్యేక రక్షణలు కల్పించాలన్నారు. పోలవరం ప్రాజెక్టు ప్రభావిత కుటుంబాలకు పూర్తి పునరావాసం, నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. కోయ భాషను రాజ్యాంగంలోని ఎనిమిదో షెడ్యూల్‌లో చేర్చాలని, ఆదివాసీలకు ప్రత్యేక మత కోడ్ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అటవీ సంపద, ఇసుక, నీటి వనరుల ద్వారా వచ్చే ఆదాయంలో ఎక్కువ వాటాను స్థానిక అభివృద్ధికి కేటాయించాలన్నారు. రాజ్ భవన్‌లో ప్రత్యేక గిరిజన సెల్ ఏర్పాటు చేసి పంచమ షెడ్యూల్ అమలును పర్యవేక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పరంజ్యోతి, సూర్యారావు, సత్యనారాయణ, నర్సింగరావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# వంద ప్రాణాలకు పునర్జన్మ!

- నల్లగొండ ఐకాన్ ఆసుపత్రి అరుదైన ఘనత
- వంద బ్రెయిన్ ట్యూమర్ ఆపరేషన్లు సక్సెస్
- మహా నగరాలకు వెళ్లే తిప్పలు, తప్పిన ఖర్చు
- పొరుగు జిల్లాల నుంచి పోటెత్తుతున్న రోగులు
- పేదల ప్రాణాలు కాపాడటమే లక్ష్యమన్న డాక్టర్ శశాంక్




**నల్లగొండ:** మెదడులో కణితి (బ్రెయిన్ ట్యూమర్) అనగానే లక్షల ఖర్చు.. మహా నగరాలకు పరుగులు.. ఇవన్నీ గతం. నల్లగొండ జిల్లా కేంద్రంలో ఉన్న ఐకాన్ ఆసుపత్రి అత్యాధునిక వైద్యంతో ఏకంగా వంద బ్రెయిన్ ట్యూమర్ శస్త్రచికిత్సలను విజయవంతంగా పూర్తి చేసి జిల్లా వైద్య చరిత్రలో సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది. ఒకప్పుడు మెదడు సంబంధిత వ్యాధులకు చికిత్స పొందాలంటే హైదరాబాద్, చెన్నై, బెంగళూరు లాంటి నగరాలకు వెళ్లాల్సి వచ్చేది. శస్త్రచికిత్స, ఐసీయూ, మందులు ఇతర ఖర్చుల కోసం పది నుంచి ఇరవై లక్షల రూపాయల వరకు వ్యయం అయ్యేది. దీంతో ఎందరో అప్పులపాలై ఆర్థికంగా కుదేలయ్యేవారు. సరైన సమయంలో వైద్యం అందక ప్రాణాలు కోల్పోయేవారు. ఇలాంటి పరిస్థితులను మారుస్తూ నల్లగొండలోని ఐకాన్ ఆసుపత్రి అత్యుత్తమ న్యూరో సర్జరీ సేవలను అందుబాటులోకి తెచ్చింది. ప్రాణాపాయ స్థితిలో ఉన్న అత్యంత క్లిష్టమైన వంద కేసుల్లో మెదడులోని కణితులను అత్యంత జాగ్రత్తగా తొలగించి రోగులకు పునర్జన్మ ప్రసాదించింది. అత్యాధునిక ఆపరేషన్ థియేటర్లు, హైటెక్ పరికరాలతో పాటు ప్రముఖ న్యూరో సర్జన్ ప్రొఫెసర్ రాజేష్, డాక్టర్ కోడె శశాంక్, డాక్టర్ సాయి మౌనిక చెరుకూరి, డాక్టర్ సాయి లావణ్య కడిమి నేతృత్వంలోని వైద్య బృందం, సిబ్బంది కృషితోనే ఈ విజయాలు సాధ్యమయ్యాయి. ఇక్కడి నాణ్యమైన వైద్య సేవలతో యాదాద్రి భువనగిరి, సూర్యాపేట, ఖమ్మం, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్ జిల్లాలతో పాటు పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్ ప్రాంతాల నుంచి కూడా రోగులు ఐకాన్ ఆసుపత్రికి వస్తున్నారు. ఆర్థిక స్థోమత లేని కారణంగా ఎవరూ ప్రాణాలు కోల్పోకూడదన్నదే తమ ప్రధాన లక్ష్యమని న్యూరో సర్జన్ డాక్టర్ కోడె శశాంక్ స్పష్టం చేశారు. పెద్ద నగరాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా జిల్లా ప్రజలకు ఇక్కడే అత్యుత్తమ వైద్యం అందించడమే తమ సంకల్పం అని తెలిపారు. భవిష్యత్తులో మరింత అధునాతన న్యూరో సర్జరీలు, అత్యవసర మెదడు, వెన్నుపూస చికిత్సలతో పాటు సూపర్ స్పెషాలిటీ సేవలను అందరికీ అందుబాటులోకి తెస్తామని ఆయన వెల్లడించారు. వంద శస్త్రచికిత్సలు విజయవంతం కావడం తమ బాధ్యతను మరింత పెంచిందని వైద్య బృందం ఆనందం వ్యక్తం చేసింది.

# వినాశకర రాజకీయం!

**మోదీ పాలనలో సామాన్యుల బతుకు దుర్భరం**

**మీనాక్షి నటరాజన్‌పై తెలంగాణలో కేసులు లేవు**

**కేంద్రం తీరుపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ ఫైర్**



**న్యూఢిల్లీ:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పాలనలో నిత్యావసరాల ధరలు ఆకాశాన్ని తాకుతుండటంతో సామాన్యుల బతుకు దుర్భరంగా మారిందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ వెనుక బీజేపీ కక్షపూరిత రాజకీయ కుట్ర దాగి ఉందని ఆయన ఆరోపించారు. దేశంలో పెట్రోల్, డీజిల్ సహా నిత్యావసర సరుకుల ధరలు రోజురోజుకూ విపరీతంగా పెరిగిపోతున్నాయని మహేశ్ కుమార్ గౌడ్ మండిపడ్డారు. గృహిణులను ఇబ్బంది పెడుతూ వంట గ్యాస్ ధరలను పెంచుతున్నారని విమర్శించారు. గురువారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై జాతీయ స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు చేపట్టాల్సిన ఉద్యమ కార్యాచరణపై ఏఐసీసీ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించామని ఆయన వెల్లడించారు. తెలంగాణలో మీనాక్షి నటరాజన్‌పై ఎక్కడా ఎలాంటి కేసు నమోదు కాలేదని మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టంచేశారు. ఆమె మహిళ అని కూడా చూడకుండా రాజకీయ కక్షతో ఉద్దేశపూర్వకంగానే నామినేషన్ తిరస్కరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశ చరిత్రలో ఇలా ఎప్పుడూ జరగలేదని, ఇది ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు లాంటిదని విమర్శించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ పూర్తిగా వినాశకర రాజకీయాలకు పాల్పడుతోందని ఆయన తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.

# అద్దె భవనాలకు స్వస్తి!

**ప్రభుత్వ ఆఫీసులకు సొంత భవనాలు.. గృహ నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో నిర్మాణాలు**

**మెరుగైన పాలన అందించడమే లక్ష్యమన్న మంత్రి పొంగులేటి**



**హైదరాబాద్:** రాష్ట్రంలో ప్రజలకు మరింత పారదర్శకమైన, సౌకర్యవంతమైన పాలన అందించే దిశగా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అద్దె, శిథిలావస్థలో ఉన్న తహసీల్దార్, ఆర్డీవో, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు స్వస్తి పలికి.. అన్ని హంగులతో శాశ్వత భవనాలను నిర్మించనున్నట్లు రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. సచివాలయంలో గురువారం రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ ఉన్నతాధికారులతో మంత్రి పొంగులేటి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో ఎన్ని కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయో, శిథిలావస్థలో ఉన్నాయో అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు సేవలు అందించే కేంద్రాలు హుందాగా ఉండాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి స్పష్టం చేశారు. తొలి దశలో నూట ఇరవై ఐదు తహసీల్దార్, పదకొండు ఆర్డీవో కార్యాలయాలకు అత్యాధునిక వసతులతో శాశ్వత భవనాలు నిర్మించనున్నారు. ఇందుకోసం వెంటనే స్థలాలు గుర్తించి పనులు ప్రారంభించేలా తక్షణ కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. అన్ని భవనాలు ఒకే నమూనాలో, ప్రజలకు ఎంతో సౌకర్యవంతంగా ఉండేలా తీర్చిదిద్దనున్నారు. గత ప్రభుత్వం ఎటువంటి ముందుచూపు, ప్రణాళిక లేకుండా మండలాల పునర్విభజన చేసిందని, కనీస వసతులు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారని మంత్రి విమర్శించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొత్త మండలాలకు అవసరమైన పోస్టులు మంజూరు చేసి పరిపాలనను బలోపేతం చేసిందని తెలిపారు. రిజిస్ట్రేషన్ల శాఖలో ఇప్పటికే సమీకృత భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని, ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని ముప్పై తొమ్మిది సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను పన్నెండు క్లస్టర్లుగా విభజించి నిర్మిస్తున్నట్లు చెప్పారు. గచ్చిబౌలి, మేడ్చల్, పీర్జాదిగూడ, కోహెడ ప్రాంతాల్లో ఇప్పటికే శంకుస్థాపనలు చేసి పనులు ప్రారంభించామన్నారు. జిల్లాల్లో పత్రాల రిజిస్ట్రేషన్ల సంఖ్యకు అనుగుణంగా నాలుగు వేల నుంచి పది వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఒకే నమూనాలో ఆఫీసులు నిర్మిస్తామని మంత్రి పొంగులేటి వివరించారు. ఇందిరమ్మ ఇండ్ల స్థలాల గుర్తింపు ప్రక్రియ వేగంగా సాగుతోందని, త్వరలోనే కలెక్టర్లతో సమావేశం నిర్వహిస్తామని ఆయన వెల్లడించారు.



# ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల

**జనరల్, వృత్తివిద్యా కోర్సుల మార్కుల మెమోలు అందుబాటులో..**

**మే పదిమూడు నుంచి ఇరవై ఒకటి వరకు జరిగిన పరీక్షలు**

**రాష్ట్రవ్యాప్తంగా హాజరైన సుమారు నాలుగు లక్షల మంది విద్యార్థులు**

**పదిహేడు కేంద్రాల్లో వేగంగా ముగిసిన జవాబు పత్రాల మూల్యాంకనం**

**అధికారిక వెబ్‌సైట్ల ద్వారా స్కోర్ కార్డుల డౌన్‌లోడ్**

**హైదరాబాద్:** తెలంగాణ ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలు విడుదలయ్యాయి. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు చెందిన జనరల్, వృత్తి విద్యా (ఒకేషనల్) కోర్సుల విద్యార్థుల మార్కుల మెమోలను విద్యామండలి అందుబాటులోకి తెచ్చింది. హాల్ టికెట్ నంబర్ ద్వారా విద్యార్థులు తమ ఫలితాలను చూసుకోవచ్చు. రాష్ట్రవ్యాప్తంగా మే పదిమూడో తేదీ నుంచి ఇరవై ఒకటో తేదీ వరకు ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు జరిగాయి. ఈ పరీక్షలకు ఎనిమిది వందల ఎనభై తొమ్మిది కేంద్రాల్లో మూడు లక్షల తొంభై ఎనిమిది వేల నాలుగు వందల యాభై తొమ్మిది మంది విద్యార్థులు హాజరయ్యారు. పరీక్షలు ముగిసిన వెంటనే పదిహేడు ప్రత్యేక కేంద్రాల్లో జవాబు పత్రాల మూల్యాంకనాన్ని విద్యామండలి వేగంగా పూర్తి చేసింది. ఏమాత్రం జాప్యం లేకుండా గురువారం సకాలంలో ఫలితాలను ప్రకటించింది. విద్యార్థులు తమ హాల్ టికెట్ నంబర్‌ను ఉపయోగించి బోర్డు అధికారిక వెబ్‌సైట్ల నుంచి తమ స్కోర్ కార్డు (మార్కుల మెమో)ను సులభంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని అధికారులు ఒక ప్రకటనలో వెల్లడించారు.

# బిడ్డలతో తల్లి అదృశ్యం!

**కామారెడ్డిలో మిస్సింగ్ కలకలం..రెండు రోజుల క్రితం ఘటన**

**దారితీసిన కుటుంబ కలహాలు.. సీసీ కెమెరాల ఆధారంగా గాలింపు**



**కామారెడ్డి:** కామారెడ్డి జిల్లా కేంద్రంలో మిస్సింగ్ వ్యవహారం తీవ్ర కలకలం రేపుతోంది. కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ తల్లి తన ముగ్గురు పిల్లలతో సహా అదృశ్యమైంది. బంధువుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని గాంధీనగర్‌కు చెందిన లయ (31) అనే మహిళకు ఇద్దరు కుమార్తెలు బిందు (16), దివిజ (8), కుమారుడు శివ (13) ఉన్నారు. భార్యాభర్తల మధ్య చాలా కాలంగా వివాదాలు నడుస్తున్నాయి. పెద్దల సమక్షంలో పంచాయితీ పెట్టి సర్దిచెప్పడంతో కొంతకాలంగా వీరంతా గాంధీనగర్‌లోనే కలిసుంటున్నారు. ఇటీవల మళ్లీ గొడవలు మొదలుకావడంతో లయ తీవ్ర మనస్తాపం చెందింది. రెండు రోజుల క్రితం తన ముగ్గురు పిల్లలను తీసుకుని ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయింది. ఎంతకీ తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన భర్త, బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు.. సీసీ కెమెరాల దృశ్యాలు, ఫోన్ కాల్స్ ఆధారంగా వారి ఆచూకీ కోసం తీవ్రంగా గాలిస్తున్నారు.

# ఖమ్మం రైతులకు భరోసా!

**ప్రాజెక్టుల పూర్తి కోసం ప్రత్యేక కార్యాచరణ**

**మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టీకరణ**



**హైదరాబాద్:** ఖమ్మం జిల్లా రైతాంగానికి శాశ్వత సాగునీటి భద్రత కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని సాగునీటి ప్రాజెక్టుల పూర్తి కోసం ప్రత్యేక కార్యాచరణను రూపొందిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. హైదరాబాద్‌లోని జలసౌధలో గురువారం ఉమ్మడి ఖమ్మం జిల్లా సాగునీటి ప్రాజెక్టులపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీతమ్మసాగర్ సహా జిల్లాలోని అన్ని ప్రాజెక్టులను వేగవంతంగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఖమ్మం జిల్లాలో ప్రతి ఎకరానికీ సాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పునరుద్ఘాటించారు. భూసేకరణ, అటవీ అనుమతులు, నిధుల కొరత లాంటి సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరిస్తామని చెప్పారు. సీతారామ ప్రాజెక్టు ఖమ్మం జిల్లా భవిష్యత్తును మార్చే అత్యంత కీలక ప్రాజెక్టు అని మంత్రి ఉత్తమ్ తెలిపారు. పాలేరు లింక్ కెనాల్ ద్వారా కొత్త ఆయకట్టుకు నీరు అందిస్తూనే.. పాత ఆయకట్టు స్థిరీకరణ చేపడతామన్నారు. మున్నేరు-పాలేరు అనుసంధానం ద్వారా ఖమ్మం, సూర్యాపేట జిల్లాల రైతులకు ఎంతో మేలు జరుగుతుందని వివరించారు. విద్యుత్ ఖర్చు లేకుండా కేవలం గ్రావిటీ (గురుత్వాకర్షణ) ద్వారానే నీటిని మళ్లించాలన్నది ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. భద్రాచలం, ఖమ్మం వరద రక్షణ పనులకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నట్లు వెల్లడించారు. రైతు సంక్షేమమే తమ ధ్యేయమని, ప్రతి ప్రాజెక్టుకూ గడువు నిర్దేశించి నిరంతరం పర్యవేక్షిస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వాకిటి శ్రీహరి, ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

చురకలు




# ప్రజాస్వామ్య రక్షణకు 'మహా విలీనం' బ్రహ్మాస్త్రం!

దేశంలో ప్రాంతీయ పార్టీల మనుగడ రోజురోజుకూ ప్రశ్నార్థకంగా మారుతున్న తరుణమిది. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ తన దర్యాప్తు సంస్థలను ప్రయోగించి ప్రత్యర్థి పార్టీలను కబళిస్తున్న తీరు ప్రజాస్వామ్యానికే పెను ప్రమాదంగా పరిణమించింది. మహారాష్ట్రలో శివసేన, ఎన్సీపీలను నిలువునా చీల్చి తన ఖాతాలో వేసుకున్న కమలనాథులు.. ఇప్పుడు అదే వ్యూహాన్ని పశ్చిమ బెంగాల్‌లో అమలు చేస్తున్నారు. పదిహేనేళ్లుగా బెంగాల్ ప్రజల మద్దతుతో అజేయ శక్తిగా నిలిచిన మమతా బెనర్జీని నేరుగా రాజకీయంగా ఎదుర్కోలేక కేంద్ర ప్రభుత్వం అనైతిక చర్యలకు పాల్పడుతోంది. ఈడీ, సీబీఐ దాడుల భయంతో తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) నేతలు బీజేపీ వైపు చూసేలా తీవ్ర స్థాయి ఒత్తిడి తెస్తోంది. ఆపరేషన్ లోటస్ పేరుతో ఇతర పార్టీల నేతలను బెదిరించి, ప్రలోభపెట్టి లాక్కోవడం బీజేపీకి ఒక దినచర్యగా మారిపోయింది.

ప్రజానాయకురాలిగా సామాన్యుల పక్షాన నిలబడి ఏళ్ల తరబడి పోరాటాలు చేసిన మమతా బెనర్జీ అప్రతిహత విజయాలను చూసి ఓర్వలేకనే కమలం పార్టీ ఈ కుట్రలకు తెరతీసింది. రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తున్న ఆమెపై అసత్య ఆరోపణలు చేస్తూ, చొరబాటుదారులంటూ తప్పుడు ప్రచారం చేస్తూ రాజకీయ లబ్ధి పొందాలని బీజేపీ చూస్తోంది. అయితే విపక్ష నేతలపై కేంద్ర సంస్థలు సాగిస్తున్న ఉక్కుపాదం వల్లే నేడు బెంగాల్ లో అసమ్మతి సెగలు రగులుతున్నాయి. సువేందు అధికారి, కకోలి ఘోష్ దస్తిదార్ లాంటి సీనియర్లతో పాటు శతృఘ్న సిన్హా, యూసుఫ్ పఠాన్ లాంటి వారు పార్టీకి వ్యతిరేకంగా గళం విప్పారంటే.. వారి వెనుక కేంద్ర సంస్థల భయం, అధికార పార్టీ ప్రలోభాలు ఏ స్థాయిలో ఉన్నాయో సులభంగా అర్థం చేసుకోవచ్చు. జగదీష్ చంద్ర మసునియా, ఖలీలుర్ రెహమాన్, అబూ తాహెర్ ఖాన్, పార్థ భౌమిక్, బాపి హల్దార్, మాలా రాయ్, మితాలీ బాగ్, దీపక్ అధికారి, కాళీపాద సోరేన్, జూన్ మాలియా, అరూప్ చక్రబర్తి, షర్మిలా సర్కార్, అసిత్ కుమార్, శతాబ్ది రాయ్, రచనా బెనర్జీ తదితరులతో ఒక అసమ్మతి వర్గాన్ని బీజేపీ తెరవెనుక ఉండి నడిపిస్తోంది. ఏకంగా 64 మంది ఎమ్మెల్యేలు, 19 మంది ఎంపీలను చీల్చడం ద్వారా ఒక బలమైన ప్రాంతీయ పార్టీని దెబ్బతీయాలన్నది బీజేపీ కుటిల వ్యూహం.

ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో ఒంటరి పోరాటం కన్నా.. జాతీయ స్థాయిలో బలమైన వేదిక ఏర్పాటు చేసుకోవడమే ప్రస్తుత రాజకీయ సంక్షోభానికి ఏకైక పరిష్కారం. అందుకే టీఎంసీని కాంగ్రెస్ పార్టీలో విలీనం చేయాలన్న సోనియా గాంధీ ప్రతిపాదన అత్యంత చారిత్రక ప్రాధాన్యం సంతరించుకుంది. ఇది మమతా బెనర్జీ బలహీనతకు నిదర్శనం ఏమాత్రం కాదు.. ఇది ఒక ఫాసిస్టు వ్యవస్థను ఎదుర్కొనేందుకు తీసుకుంటున్న వ్యూహాత్మక అడుగు. 1998లో కాంగ్రెస్ నుంచి విడిపోయి టీఎంసీని స్థాపించిన మమత.. ఇప్పుడు దేశ ప్రయోజనాల కోసం తిరిగి సొంత గూటికి చేరితే అది భారతీయ రాజకీయాల్లోనే పెను సంచలనం అవుతుంది. దీనివల్ల కాంగ్రెస్ పార్టీ ప్రధాన ప్రతిపక్షంగా మరింత బలోపేతం అవుతుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

ప్రాంతీయ పార్టీలను విచ్ఛిన్నం చేసి వాళ్ల ఆస్తులను, పార్టీ గుర్తులను లాక్కోవాలని చూస్తున్న బీజేపీ వ్యూహాలకు ఈ విలీనం ద్వారా గట్టి చెక్ పెట్టవచ్చు. చీలిక వర్గాలకు ఎన్నికల సంఘం గుర్తింపు రాకుండా చేయాలంటే, పార్టీ ఉనికిని కాపాడుకోవాలంటే జాతీయ పార్టీ గొడుగు కిందకు రావడం అత్యంత ఆవశ్యకం. టీఎంసీ విలీనంతో కాంగ్రెస్ పార్టీకి బెంగాల్ లో తిరుగులేని బలం వస్తుంది. అలాగే జాతీయ స్థాయిలో బీజేపీకి ఎదురునిలబడే శక్తి రెట్టింపు అవుతుంది. మమత లాంటి పోరాటయోధురాలు కాంగ్రెస్ జాతీయ ఉపాధ్యక్షురాలిగా, యువ నేత అభిషేక్ బెనర్జీ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపడితే ప్రతిపక్ష కూటమికి కొత్త రక్తం వచ్చినట్లవుతుంది. ఇప్పటికే రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా సాగిస్తున్న సిద్ధాంతపరమైన పోరాటానికి.. మమతా బెనర్జీ మాస్ ఇమేజ్ తోడైతే బీజేపీని జాతీయ స్థాయిలో సమర్థవంతంగా ఢీకొట్టవచ్చు.



బెంగాల్‌లో సీనియర్ కాంగ్రెస్ నేతలు ఈ విలీనంపై తొలుత అసంతృప్తి వ్యక్తం చేసినప్పటికీ.. జాతీయ స్థాయిలో ప్రజాస్వామ్యాన్ని రక్షించుకోవాలంటే ఈ కలయిక అనివార్యం అని త్వరలోనే వారు గ్రహిస్తారు. అధికార మదంతో ప్రాంతీయ పార్టీల మనుగడ లేకుండా చేయాలని చూస్తున్న బీజేపీకి బుద్ధి చెప్పాలంటే విడివిడిగా కన్నా.. ఉమ్మడిగా పోరాడటమే శ్రేయస్కరం. ఢిల్లీలో సోనియా గాంధీతో మమత జరుపుతున్న చర్చలు ఫలిస్తే.. అది కేవలం ఒక పార్టీ భవితవ్యాన్ని మాత్రమే కాదు, మొత్తం దేశ రాజకీయ ముఖచిత్రాన్నే మారుస్తుంది. రాజ్యాంగ విలువల రక్షణ కోసం ఇరు పార్టీల అధినాయకత్వాలు పాత పగలు, విభేదాలు పక్కనపెట్టి ఒక్కటవ్వడం దేశ రాజకీయాలకు అత్యంత శుభపరిణామం. బీజేపీ కబళింపు రాజకీయాలకు, కేంద్ర సంస్థల దుర్వినియోగానికి కాలం చెల్లే రోజులు ఈ మహా విలీనంతోనే మొదలవుతాయి

# 2047 నాటికి నవభారత నిర్మాణం



- 'వికసిత్ భారత్'పై నీతి ఆయోగ్ చారిత్రాత్మక మంథనం!
- ప్రతి పౌరుడి జీవన ప్రమాణాల మెరుగుదలే లక్ష్యం
- ప్రధాని అధ్యక్షతన గవర్నింగ్ కౌన్సిల్ 11వ సమావేశం
- సమగ్ర మానవాభివృద్ధి, నైపుణ్యాలు, ఉపాధి, ఆరోగ్య రంగాలపై చర్చ

**న్యూఢిల్లీ, జూన్ 11:** దేశాన్ని 2047 నాటికి సంపూర్ణ అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దే చారిత్రాత్మక లక్ష్యంతో 'నీతి ఆయోగ్' గవర్నింగ్ కౌన్సిల్ 11వ సమావేశం గురువారం ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్ సాంస్కృతిక కేంద్రంలో అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన ఈ ఉన్నత స్థాయి భేటీలో సమగ్ర మానవాభివృద్ధి, ఉపాధి కల్పన, నైపుణ్యాభివృద్ధి, ప్రజల సంక్షేమ కార్యక్రమాలే అజెండాగా విస్తృతంగా మంథనం చేశారు. ఈ ఏడాది సదస్సుకు "వికసిత్ భారత్-2047 కోసం సమగ్ర మానవాభివృద్ధి" అనే ప్రధానాంశాన్ని ఎంచుకున్నారు. వయస్సు, ప్రాంతం, లింగం, సామాజిక, ఆర్థిక పరిస్థితులతో సంబంధం లేకుండా దేశంలోని ప్రతి పౌరుడి జీవన ప్రమాణాలను మెరుగుపర్చే విప్లవాత్మక విధానాలపై ఈ సందర్భంగా ప్రత్యేక దృష్టి సారించారు. దేశంలో యువతను ఉద్యోగాలు అడిగే వారిగా కాకుండా, ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి చేర్చేలా వ్యవస్థాపకతను (ఆంట్రప్రెన్యూర్‌షిప్) ప్రోత్సహించడం, నైపుణ్యాలను పెంపొందించడం, స్థిరమైన ఉపాధి అవకాశాలను విస్తరించడం వంటి అంశాలను ప్రధాని మోదీ ఈ సమావేశంలో ప్రస్తావించినట్లు నీతి ఆయోగ్ వెల్లడించింది.

## నాలుగు ప్రధాన రంగాలకు అగ్రతాంబూలం

సమగ్ర మానవాభివృద్ధి కోసం రూపొందించిన భవిష్యత్తు కార్యాచరణలో భాగంగా నాలుగు కీలక రంగాలపై ప్రధానంగా చర్చ సాగింది. భవిష్యత్ గ్లోబల్ అవసరాలకు అనుగుణంగా మానవ వనరుల అభివృద్ధి, నైపుణ్యాల పెంపు, ఉత్పాదక ఉపాధి అవకాశాల సృష్టి, వికేంద్రీకృత అభివృద్ధి, ఆరోగ్యం, పోషకాహారం, సంక్షేమం, ప్రతి పౌరుడికి సమాన అవకాశాలు కల్పించడం వంటి అంశాలకు అత్యున్నత ప్రాధాన్యం ఇచ్చారు. దేశవ్యాప్తంగా సాగుతున్న అభివృద్ధి ఫలాలు సమాజంలో చివరి వరుసలో ఉన్న వ్యక్తికి కూడా అందేలా పటిష్టమైన విధానాలను రూపొందించాల్సిన అవసరాన్ని సమావేశంలో నొక్కిచెప్పారు. వీటితో పాటు డిజిటల్ మౌలిక సదుపాయాల విస్తరణ, డేటా ఆధారిత విధానాల అమలు, పాలనలో సాంకేతికత వినియోగం వంటి అంశాలపై కూడా లోతుగా చర్చించారు. డిజిటల్ పబ్లిక్ మౌలిక వ్యవస్థను మరింత బలోపేతం చేయడంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయాన్ని పెంచేందుకు కార్యాచరణ రూపొందించారు. స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక లక్ష్యాల అమలును నిరంతరం పర్యవేక్షించేందుకు ఒక ప్రత్యేక వ్యవస్థ అవసరమనే అభిప్రాయం వ్యక్తమైంది.

## రాష్ట్రాల ప్రణాళికల అనుసంధానం

రాష్ట్ర ప్రభుత్వాల స్వల్పకాలిక, దీర్ఘకాలిక అభివృద్ధి కార్యక్రమాలను జాతీయ లక్ష్యాలతో పక్కాగా అనుసంధానం చేయడం, టీమ్ ఇండియా స్ఫూర్తితో కేంద్ర-రాష్ట్రాలు సమన్వయంతో ముందుకు సాగడమే ఈ సమావేశం ప్రధాన లక్ష్యంగా నిలిచింది. గతంలో నిర్వహించిన జాతీయ ప్రధాన కార్యదర్శుల సదస్సులో వచ్చిన అమూల్యమైన సూచనల అమలు తీరుపై కూడా ఈ సందర్భంగా సమీక్ష నిర్వహించారు. ప్రాథమిక విద్య నుంచి ఉన్నత విద్య వరకు విద్యా ప్రమాణాలు పెంచడం, నైపుణ్యాభివృద్ధి, క్రీడలు, పాఠ్యేతర కార్యక్రమాల విస్తరణ వంటి అంశాలపై రాష్ట్రాలతో కలిసి పనిచేసే మార్గాలపై చర్చించారు. ఈ ప్రతిష్టాత్మక సమావేశంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌లతో పాటు పలువురు కేంద్ర మంత్రులు పాల్గొన్నారు. అలాగే వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రతినిధులు, నీతి ఆయోగ్ ఉపాధ్యక్షుడు, సభ్యులు, ప్రధాన కార్యనిర్వాహక అధికారి (సీఈఓ) హాజరై దేశాభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై తమ అద్భుతమైన అభిప్రాయాలను వెల్లడించారు.

# ఒమన్ తీరంలో భారతీయ నౌకపై దాడి

## కాల్పుల్లో ముగ్గురు నావికుల మృతి: ధ్రువీకరించిన మంత్రి



**న్యూఢిల్లీ, జూన్ 11:** ఒమన్ తీరంలో భారతీయ సిబ్బందితో ప్రయాణిస్తున్న సెటెబె వాణిజ్య నౌకపై అమెరికా జరిపిన దాడి కలకలం సృష్టించింది. దాడి సమయంలో నౌకలో 24 మంది భారతీయ సిబ్బంది ఉండగా.. వారిలో ముగ్గురు నావికులు ప్రాణాలు కోల్పోయారు. ఈ విషయాన్ని షిప్పింగ్ మినిస్టర్ సర్బానంద సోనోవాల్ ధ్రువీకరించారు. ఇది విషాదకరమైన ఘటన అని, ఆ ముగ్గురి మృతదేహాలను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. మృతులను డెక్ క్యాడెట్ ఆదిత్య శర్మ, ఇంజిన్ ఫిట్టర్ శివానంద్ చౌరాసియా, చీఫ్ ఇంజినీర్ పట్నాల సురేశ్‌గా గుర్తించారు. సురేశ్ తెలుగు రాష్ట్రాలకు చెందిన వ్యక్తిగా తెలుస్తోంది. తమ దిగ్బంధనాన్ని ఉల్లంఘిస్తూ ఇరాన్ నుంచి చమురు రవాణా చేసేందుకు ప్రయత్నించినందుకే ట్యాంకర్‌పై కాల్పులు జరిపామని అమెరికా సైన్యం తెలిపింది. ఈ దాడిని భారత్ తీవ్రంగా ఖండించింది. అమెరికా చర్యపై ఆగ్రహం వ్యక్తంజేసింది. పశ్చిమాసియాలో వాణిజ్య నౌకలు, పౌర మౌలిక వసతులను లక్ష్యంగా చేసుకోవడాన్ని ఆపేయాలని... అంతర్జాతీయ జలమార్గాల్లో రవాణా స్వేచ్ఛగా జరగాలని పేర్కొంది. అంతేగాకుండా దిల్లీలో అమెరికా దౌత్యాధికారి జేసన్ మిక్స్‌ను పిలిపించి తీవ్ర నిరసన తెలిపింది. 24 మంది భారతీయులున్న మరో నౌకపై ఒమన్ తీరంలో అమెరికా నౌకాదళం మూడు రోజుల కిందట దాడి చేసిన సంగతి తెలిసిందే. ఇదిలా ఉండగా.. భారతీయ సిబ్బంది ఉన్న మరో నౌకపై తాజాగా దాడి జరిగింది. ఒమన్ తీరంలో ఆ నౌకపై అమెరికా మిలిటరీ దాడి చేసింది. వారంరోజుల వ్యవధిలో భారతీయ సిబ్బంది ఉన్న నౌకలపై అమెరికా దాడి చేయడం ఇది మూడోసారి కావడం గమనార్హం. తాజా ఘటనను ఒమన్‌లోని భారత ఎంబసీ వెల్లడించింది. ఈ రోజు ఉదయం ఒమన్‌లోని షినాస్ పోర్టు సమీపంలో నౌకపై దాడి జరిగింది. పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నాం. స్థానిక అధికారులతో సమన్వయం చేసుకుంటున్నాం అని పేర్కొంది. ఈ నౌక పేరు జలవిహార్‌గా తెలుస్తోంది.

# స్వదేశీ రక్షణ రంగానికి చారిత్రాత్మక మైలురాయి



- భారత్‌లో తయారైన తొలి సీ295 విమానం విజయవంతం
- వడోదర నుంచి గాల్లోకి ఎగిరిన 'మేడ్ ఇన్ ఇండియా' సైనిక విమానం
- టాటా-ఎయిర్‌బస్ భాగస్వామ్యంతో కొత్త చరిత్ర

**న్యూఢిల్లీ, జూన్ 11:** భారత రక్షణ, విమానయాన రంగాల్లో గురువారం చారిత్రాత్మక ఘట్టం నమోదైంది. దేశంలోనే తయారైన తొలి 'మేడ్ ఇన్ ఇండియా' సీ295 సైనిక రవాణా విమానం విజయవంతంగా తొలి పరీక్షా ప్రయాణాన్ని పూర్తి చేసింది. గుజరాత్‌లోని వడోదరలో ఏర్పాటు చేసిన తుది అసెంబ్లీ కేంద్రం నుంచి ఈ విమానం గాల్లోకి ఎగరడంతో స్వదేశీ రక్షణ తయారీ రంగం మరో కీలక మైలురాయిని అధిగమించింది. విమానం తయారీ పూర్తయిన అనంతరం నిర్వహించే పరీక్షల్లో తొలి ప్రయాణం అత్యంత కీలక దశగా భావిస్తారు. ఈ పరీక్ష విజయవంతం కావడంతో విమానం పనితీరు, భద్రతా ప్రమాణాలపై కీలక సమాచారం లభించనుంది. ఈ విజయాన్ని ఎయిర్‌బస్ సంస్థ అధికారికంగా ప్రకటిస్తూ 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమంలో ఇది ఒక ముఖ్యమైన ముందడుగుగా అభివర్ణించింది.

## భారత్‌లోనే 40 విమానాల తయారీ

భారత వైమానిక దళం కోసం మొత్తం 40 సీ295 విమానాలను దేశంలోనే తయారు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అందులో తొలి విమానం ఇప్పుడు పరీక్షా దశను విజయవంతంగా పూర్తి చేసింది. ఈ ఏడాది చివరి నాటికి మొదటి స్వదేశీ సీ295 విమానాన్ని భారత వైమానిక దళానికి అప్పగించే అవకాశం కనిపిస్తోంది. ఈ ప్రాజెక్టు ద్వారా దేశంలో విమాన తయారీ సామర్థ్యాలు మరింత బలోపేతం కావడంతో పాటు రక్షణ రంగంలో స్వావలంబనకు ఊతమిస్తుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. భారత రక్షణ తయారీ చరిత్రలో ప్రైవేట్ రంగ భాగస్వామ్యంతో సైనిక విమానం తయారు కావడం ఇదే తొలిసారి. ఎయిర్‌బస్ సంస్థతో కలిసి టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ ఈ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్తోంది. దేశవ్యాప్తంగా అనేక చిన్న, మధ్య తరహా పరిశ్రమలు కూడా విమాన విడిభాగాల తయారీలో భాగస్వాములయ్యాయి. ఈ భాగస్వామ్యం ద్వారా దేశీయ పరిశ్రమలకు కొత్త అవకాశాలు లభించడంతో పాటు అధునాతన సాంకేతిక పరిజ్ఞానం భారత్‌కు చేరువవుతోందని పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి.

## ఆత్మనిర్భర్ భారత్‌కు బలమైన ఊతం

ఈ విజయంపై భారత వైమానిక దళం హర్షం వ్యక్తం చేసింది. విమానం తొలి ప్రయాణాన్ని విజయవంతం చేసిన మొత్తం బృందాన్ని అభినందించింది. స్వదేశీ రక్షణ ఉత్పత్తుల తయారీలో భారత్ సాధిస్తున్న పురోగతికి ఇది నిదర్శనమని పేర్కొంది. ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యాలకు అనుగుణంగా రక్షణ రంగంలో స్వదేశీ తయారీని ప్రోత్సహించే దిశగా ఈ ప్రాజెక్టు కీలక పాత్ర పోషించనుంది. సీ295 విమానం విజయవంతమైన తొలి ప్రయాణం ప్రపంచ రక్షణ రంగంలో భారత్ సామర్థ్యాన్ని మరోసారి చాటిచెప్పిన ఘట్టంగా నిలిచింది.

# హుస్నాబాద్–కొత్తపల్లి ఫోర్ లేన్ పనులపై మంత్రి పొన్నం పరిశీలన

**కరీం నగర్ జూన్11:**



హుస్నాబాద్ నుంచి కరీంనగర్ వెళ్లే కొత్తపల్లి రాజీవ్ రహదారి వరకు నిర్మాణంలో ఉన్న ఫోర్ లేన్ రోడ్డు విస్తరణ పనులను రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. రోడ్డు విస్తరణలో భాగంగా రహదారి పక్కన ఉన్న విద్యుత్ స్తంభాల తొలగింపు, వాటి స్థానంలో ఏర్పాటు చేస్తున్న విద్యుత్ టవర్ల పనులను పరిశీలించి, పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కొండాపూర్ గ్రామ శివారులో నిర్మిస్తున్న కల్వర్టులను తనిఖీ చేసి, పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. హుస్నాబాద్–కొత్తపల్లి నాలుగు లైన్ల రహదారి నిర్మాణానికి ప్రభుత్వం రెండు ప్యాకేజీల కింద మొత్తం ₹163.20 కోట్లు మంజూరు చేసింది. ఇందులో కొత్తపల్లి–సుందరగిరి 10 కిలోమీటర్ల రహదారి విస్తరణకు ప్యాకేజీ–1 కింద ₹86 కోట్లు, సుందరగిరి–హుస్నాబాద్ మార్గానికి ప్యాకేజీ–2 కింద ₹77.20 కోట్లు కేటాయించింది.

# సింగరేణి కార్మికుల సమస్య పరిష్కారానికి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి వినతిపత్రం

**న్యూఢిల్లీ, జూన్ 11:**



సింగరేణి కార్మికులు ఎన్నో ఏళ్లుగా ఎదుర్కొంటున్న మారుపేర్ల (Alias Names) సమస్యను పరిష్కరించేందుకు బీజేపీ యువమోర్చా జిల్లా అధ్యక్షుడు బద్రి దేవేందర్ పటేల్ కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి కిషన్ రెడ్డిని గురువారం న్యూఢిల్లీలో కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సింగరేణి సంస్థ రికార్డుల్లో నమోదైన మారుపేర్ల కారణంగా కార్మికులు, వారి కుటుంబ సభ్యులు పలు సంక్షేమ పథకాలు, ఉద్యోగ సంబంధిత ప్రయోజనాల పొందడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని కేంద్ర మంత్రికి వివరించారు. ఈ సమస్య వల్ల కార్మికులకు దక్కాల్సిన హక్కులు ఆలస్యమవుతున్నాయని, వెంటనే జోక్యం చేసుకుని పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరారు. కార్మికుల సమస్యలను శ్రద్ధగా విన్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సానుకూలంగా స్పందించినట్లు బద్రి దేవేందర్ పటేల్ తెలిపారు. సంబంధిత అధికారులతో చర్చించి సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశిస్తానని మంత్రి హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా, తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మరియు గనుల శాఖ మంత్రి భట్టి విక్రమార్కతో సమన్వయం చేసుకుని ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించేలా కృషి చేస్తామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారు. సింగరేణి కార్మికుల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని ఆయన స్పష్టం చేశారు. సింగరేణి కార్మికుల న్యాయమైన డిమాండ్లు నెరవేరే వరకు తమ పోరాటం కొనసాగుతుందని బీజేపీ యువమోర్చా జిల్లా అధ్యక్షుడు బద్రి దేవేందర్ పటేల్ వెల్లడించారు. ఈ అంశంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు త్వరితగతిన చర్యలు తీసుకుని కార్మికులకు న్యాయం చేయాలని ఆయన కోరారు.

# పర్యావరణ పరిరక్షణలో విద్యార్థుల భాగస్వామ్యం ఎంతో అవసరం

- **ప్రాంతీయ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అసిస్టెంట్ సైంటిస్ట్ ఇ.కనక జ్యోతి**
- **సింగిల్ యూజ్ ప్లాస్టిక్ రహిత సమాజంపై విద్యార్థులకు అవగాహన కల్పించిన ప్రాంతీయ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అసిస్టెంట్ సైంటిస్ట్**

**రామగుండం, జూన్-11:**




99 రోజుల ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా, తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, ప్రాంతీయ కార్యాలయం, రామగుండం ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిర్మూలనపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ప్రాంతీయ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అసిస్టెంట్ సైంటిస్ట్ ఇ.కనక జ్యోతి తెలిపారు. గురువారం గోదావరిఖనిలోని జ్యోతినగర్ జెడ్.పి.హెచ్.ఎస్ పాఠశాల వేదికగా ఎన్.సి.సి విద్యార్థులకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల పర్యావరణానికి కలిగే హానికారక ప్రభావాలు, భూమి, నీరు, జీవ వ్యవస్థలకు వాటి వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ సైంటిస్ట్ ఇ.కనకజ్యోతి మాట్లాడుతూ,,, నిత్యజీవితంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడానికి పాటించాల్సిన నియమాలు, అనుసరించాల్సిన ప్రత్యామ్నాయ మార్గాలను విద్యార్థులకు వివరించారు, విద్యార్థులచే సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై ప్రతిజ్ఞ చేయించారు. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిలిపివేసి, బయో–డిగ్రేడబుల్ వస్తువులను వినియోగించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. విద్యార్థులు ఈ కార్యక్రమంపై తమ అభిప్రాయాలను పంచుకుంటూ, పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పేర్కొన్నారు.

# మెదక్ ఖిల్లాకు దేశస్థాయిలో గుర్తింపు తీసుకొస్తాం: కలెక్టర్ ప్రతిమా సింగ్

**మెదక్, జూన్ 11:**



మెదక్ ఖిల్లాను రాష్ట్ర, దేశ స్థాయిలో ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసి ప్రత్యేక గుర్తింపు తీసుకొస్తామని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. గురువారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా అదనపు కలెక్టర్ నగేష్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి మెదక్ ఖిల్లాను సందర్శించారు. ఖిల్లాలోని గజశాల, దర్వాజాలు, జైలు తదితర చారిత్రక నిర్మాణాలను పరిశీలించిన కలెక్టర్, దెబ్బతిన్న ప్రాంతాలను గుర్తించి పునరుద్ధరణకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఖిల్లాపై పెరిగిన చెట్లు, ముళ్లపొదలను తొలగించే పనులను ప్రారంభించారు. మెదక్ జిల్లా చరిత్రను ప్రతిబింబించేలా పురావస్తు విగ్రహాలు, శాసనాలతో మ్యూజియం ఏర్పాటు చేస్తామని, కేంద్ర ప్రభుత్వ ప్రసాద్ పథకం ద్వారా నిధులు సమీకరించి పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. ఖిల్లాపై అలంకార దీపాల ఏర్పాటు, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌కు సమీపంలో ఉన్న మెదక్ జిల్లాలో పర్యాటక రంగాభివృద్ధికి విస్తృత అవకాశాలు ఉన్నాయని అన్నారు.

# మైనారిటీ అభ్యర్థులకు ఐఈఎల్టీఎస్ ఉచిత కోచింగ్

**మహబూబాబాద్, జూన్ 11:**

విదేశాల్లో ఉన్నత విద్యాభ్యాసం చేయాలనుకునే మైనారిటీ వర్గాల అభ్యర్థుల కోసం ఐఈఎల్టీఎస్ పరీక్షకు ఉచిత కోచింగ్ అందిస్తున్నట్లు జిల్లా మైనారిటీల సంక్షేమ అధికారి టి.ఏ.వి. నాగలక్ష్మి తెలిపారు. ముస్లిం, క్రైస్తవ, సిక్కు, జైన, పార్సీ, బౌద్ధ మైనారిటీ వర్గాలకు చెందిన డిగ్రీ లేదా ప్రొఫెషనల్ డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తుల స్వీకరణకు జూన్ 15 చివరి తేదీ కాగా, ఈ బ్యాచ్‌కు 100 మంది అభ్యర్థులను మాత్రమే ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 040–23236112 నంబర్‌ను సంప్రదించవచ్చని సూచించారు.

# లే అవుట్ ఓపెన్ స్పేస్‌లలో నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు

**నిజామాబాద్, జూన్ 11:**



లే అవుట్‌లలో ప్రజా అవసరాల కోసం కేటాయించిన ఓపెన్ స్పేస్‌లు, పార్కులు, సామూహిక వినియోగ స్థలాలను పరిరక్షించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ఎం.పీ.ఓలతో నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడారు. ఓపెన్ స్పేస్‌లలో ఎలాంటి నిర్మాణాలకు అనుమతి లేదని, నిబంధనలు అతిక్రమిస్తే వెంటనే నోటీసులు జారీ చేసి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ విషయంలో నిర్లక్ష్యం వహించిన ఎం.పీ.ఓలు, పంచాయతీ కార్యదర్శులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు. పిచ్చి మొక్కలు, ముళ్లపొదలు తొలగించాలని, పాములు, తేళ్లు వంటి విషకీటకాల వల్ల విద్యార్థులకు ప్రమాదం జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. అలాగే పాడుబడిన నిరుపయోగ బావులను వెంటనే పూడ్చివేయించాలని సూచించారు. అపరిశుభ్ర పరిసరాల వల్ల ప్రమాదాలు జరిగితే సంబంధిత అధికారులను బాధ్యులుగా పరిగణిస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ రావు, అన్ని మండలాల ఎం.పీ.ఓలు పాల్గొన్నారు.

# పల్స్ పోలియో, డీవార్మింగ్ కార్యక్రమాలు విజయవంతం చేయాలి: కలెక్టర్




**ఆసిఫాబాద్ జూన్11:**

జిల్లాలో జూన్ 28న నిర్వహించే జాతీయ పల్స్ పోలియో కార్యక్రమం, జూలై 13న చేపట్టే జాతీయ నూలిపురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పల్స్ పోలియో కార్యక్రమంలో 0–5 సంవత్సరాల వయస్సు గల 46,516 మంది చిన్నారులకు వ్యాక్సిన్ అందించేందుకు 670 కేంద్రాలు, 18 మొబైల్ బూత్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. బూత్‌లలో చుక్కలు వేయించుకోని పిల్లలకు జూన్ 29, 30 తేదీల్లో ఇంటింటికీ వెళ్లి వ్యాక్సిన్ అందజేస్తామని చెప్పారు. జూలై 13న నిర్వహించే డీవార్మింగ్ కార్యక్రమంలో 1–19 సంవత్సరాల వయస్సు గల 1,67,702 మంది పిల్లలు, యువతకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. వైద్య, విద్య, మహిళా శిశు సంక్షేమ శాఖలు సమన్వయంతో పనిచేసి రెండు కార్యక్రమాలను వంద శాతం విజయవంతం చేయాలని సూచించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలని అధికారులకు ఆదేశించారు.

# మహిళా సంఘాల సమాఖ్య భవనాలకు మంత్రి సీతక్క భూమిపూజ



**గోవిందరావు పేట జూన్11:**

ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలోని లక్నవరం గ్రామంలో మహిళా సంఘాల సమాఖ్య భవనాల నిర్మాణానికి రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సీతక్క భూమిపూజ చేశారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద సుమాంజలి, కిరణాంజలి, ప్రేమాంజలి, కమలాంజలి, పుష్పాంజలి, గీతాంజలి గ్రామ సంఘాలకు చెందిన ఆరు సమాఖ్య భవనాల నిర్మాణ పనులను ప్రారంభించారు. మహిళల ఆర్థిక సాధికారత, మహిళా సంఘాల బలోపేతానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి సీతక్క తెలిపారు. ఈ భవనాలు మహిళా సంఘాల సమావేశాలు, శిక్షణా కార్యక్రమాలు, పొదుపు–రుణాల నిర్వహణ, జీవనోపాధి కార్యకలాపాలకు ఉపయోగపడతాయని పేర్కొన్నారు.

# ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్, రిజిస్ట్రేషన్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

**జనగామ, జూన్ 11:**

జిల్లాలోని ఆహార వ్యాపార నిర్వాహకుల కోసం జూన్ 12న ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్, రిజిస్ట్రేషన్ మేళా నిర్వహిస్తున్నట్లు ఆహార భద్రత అధికారి సీహెచ్. వినీల్ కుమార్ తెలిపారు. కలెక్టరేట్ ఐడీఓసీలోని రూమ్ నంబర్ జీ–2లో శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ మేళా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆహార పరిరక్షణ కమిషనర్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. ఆహార వ్యాపార నిర్వాహకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్, రిజిస్ట్రేషన్లు పొందాలని, ఇప్పటికే ఉన్నవారు రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం ఆహార భద్రత అధికారి 7306335795, గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ 9985820544 నంబర్లను సంప్రదించవచ్చు.

# ఎస్ఎల్బీసీ కాలువ లైనింగ్ పనులను పరిశీలించిన మంత్రి కోమటిరెడ్డి



**నల్గొండ జూన్11:**

నల్లగొండ మండలం గుండ్లపల్లి గ్రామ సమీపంలో కొనసాగుతున్న ఎస్ఎల్‌బీసీ కాలువ లైనింగ్ పనులను రాష్ట్ర రోడ్లు, భవనాలు మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పరిశీలించారు.పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో సమీక్షించిన మంత్రి, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎస్ఎల్‌బీసీ కాలువ ఆధునీకరణతో సాగునీటి పంపిణీ మరింత సమర్థవంతంగా జరిగి రైతులకు లాభం చేకూరుతుందని తెలిపారు. వ్యవసాయాభివృద్ధి, నీటి వనరుల సమర్థ వినియోగానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి స్పష్టం చేశారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పనులను నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

## ఆధునిక సాగుతో అధిక లాభాలు సాధించాలి: మంత్రి సీతక్క



**గోవిందరావు పేట జూన్11:**

ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలో నిర్వహించిన జిల్లా స్థాయి మెగా రైతు మేళాలో మంత్రి దనసరి అనసూయ సీతక్క పాల్గొన్నారు. రైతులు పంటల మార్పిడి, సేంద్రియ వ్యవసాయం, ఆధునిక వ్యవసాయ పద్ధతులను అవలంబించి అధిక దిగుబడులు, లాభాలు సాధించాలని సూచించారు. రసాయన ఎరువుల వినియోగాన్ని తగ్గించి సేంద్రియ సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలని, శాస్త్రవేత్తలు అందిస్తున్న సాంకేతిక సూచనలను రైతులు వినియోగించుకోవాలని కోరారు. రైతు సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని, రూ.21 వేల కోట్ల రుణమాఫీ, రైతు భరోసా, క్వింటాలుకు రూ.500 బోనస్ వంటి పథకాలను అమలు చేస్తున్నట్లు తెలిపారు. ములుగు జిల్లాలో ఆయిల్ పామ్ సాగు విస్తరణ సంతోషకరమని పేర్కొన్న మంత్రి, తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం అందించే వాణిజ్య పంటలను రైతులు సాగు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఉత్తమ రైతులను సన్మానించి, వ్యవసాయ శాఖ ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించారు. నూతన వరి నాటు యంత్రాన్ని స్వయంగా నడిపి పరిశీలించారు.

## బదిలీపై వెళ్తున్న అధికారులకు కలెక్టర్ శుభాకాంక్షలు



**భూపాల పల్లి జూన్ 11:**

భూపాలపల్లి జిల్లా నుంచి బదిలీపై వెళ్తున్న జిల్లా రవాణా శాఖ అధికారి మహమ్మద్ సంధాని, క్వాలిటీ కంట్రోల్ ఈఈ బసవ ప్రసాద్, పరకాల ఉద్యాన అధికారిగా నియమితులైన జిల్లా ఉద్యాన అధికారి సునీల్ కుమార్ గురువారం ఐడీఓసీ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో విధులు నిర్వహించిన కాలంలో అధికారులు అందించిన సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. భవిష్యత్తులోనూ తమ బాధ్యతల్లో ఉత్తమ సేవలు అందించాలని ఆకాంక్షిస్తూ శుభాకాంక్షలు తెలిపారు. అధికారులు కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

## లడాఖ్ బైక్ యాత్రకు భాంధవికి దత్తాత్రేయ శుభాకాంక్షలు



**హైదరాబాద్ జూన్11:**

హైదరాబాద్‌కు చెందిన ఎల్‌ఎల్‌బీ విద్యార్థిని మెట్టు భాంధవి హైదరాబాద్ నుంచి లడాఖ్ వరకు చేపట్టిన బైక్ యాత్రకు హరియాణా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ శుభాకాంక్షలు తెలిపారు. లడాఖ్ వంటి సవాళ్లతో కూడిన ప్రాంతానికి యాత్ర చేపట్టడం ఆమె ధైర్యసాహసాలకు నిదర్శనమని పేర్కొన్నారు. యువతులు అన్ని రంగాల్లో ముందుకు సాగేందుకు భాంధవి స్ఫూర్తిగా నిలవాలని, యాత్ర విజయవంతంగా పూర్తిచేసి సురక్షితంగా తిరిగి రావాలని ఆకాంక్షించారు.

## తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాలకు శాశ్వత భవనాలు



**హైదరాబాద్, జూన్ 1:**

రాష్ట్రవ్యాప్తంగా అద్దె భవనాలు, శిథిలావస్థలో ఉన్న 125 తహసీల్దార్ కార్యాలయాలు, 11 ఆర్డీవో కార్యాలయాలకు శాశ్వత భవనాలు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. హౌసింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఆధునిక సౌకర్యాలతో ఈ భవనాలు నిర్మించనున్నట్లు చెప్పారు. అలాగే హైదరాబాద్ పరిసర జిల్లాల్లోని 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను 12 క్లస్టర్లుగా విభజించి సమీకృత భవనాలు నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. ప్రజలకు గౌరవప్రదమైన, పారదర్శక సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు

# డీఎంహెచ్ఓ ఆకస్మిక తనిఖీ..

### సేవల మెరుగుదలపై కీలక సూచనలు

**హైదరాబాద్, ముషీరాబాద్, జూన్ 11:**



హైదరాబాద్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్ఓ) డా. పుట్ల శ్రీనివాస్ గురువారం ముషీరాబాద్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సీ)లో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఇటీవల బాధ్యతలు స్వీకరించిన అనంతరం నిర్వహించిన ఈ పర్యటనలో కేంద్రంలోని వైద్య సేవల పనితీరును సమీక్షించారు. ఈ సందర్భంగా అల్ట్రాసౌండ్ యూనిట్, ఎక్స్‌రే విభాగం, ప్రయోగశాల (ల్యాబ్), క్షయవ్యాధి (టీబీ) యూనిట్, ఔషధ పంపిణీ కేంద్రం తదితర విభాగాలను పరిశీలించి అందుతున్న సేవలపై ఆరా తీశారు. వైద్యాధికారులు, సిబ్బందితో సమావేశమైన డీఎంహెచ్ఓ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో మరింత చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. విధి నిర్వహణ సమయాలను కచ్చితంగా పాటిస్తూ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరిగేలా చర్యలు చేపట్టాలని, గర్భిణులకు సమగ్ర వైద్య సేవలు అందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అసంక్రమిత వ్యాధుల (ఎన్‌సీడీ) గుర్తింపు పరీక్షలు, టీకాల కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించి ప్రజల్లో ఆరోగ్య అవగాహన పెంచాలని పేర్కొన్నారు. ప్రజారోగ్య సేవల బలోపేతానికి ప్రతి సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అన్నారు. తనిఖీ సందర్భంగా కేంద్రంలో అందుతున్న వైద్య సేవలు, సౌకర్యాల నిర్వహణపై డా. పుట్ల శ్రీనివాస్ సంతృప్తి వ్యక్తం చేశారు. అదే సమయంలో సేవల నాణ్యతను మరింత మెరుగుపర్చేందుకు అవసరమైన సూచనలు అందించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డా. మనోజ్ రెడ్డి, వైద్య సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రాజెక్టులకు కేంద్రం సహకరించాలి

### ప్రధాని మోదీకి సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి

**న్యూ ఢిల్లీ జూన్11:**

తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి కీలకమైన మౌలిక వసతుల ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం సహకరించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ప్రధాని నరేంద్ర మోదీని కోరారు. గోదావరి జలాల సమర్థ వినియోగం కోసం మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చలకు కేంద్రం తోడ్పాటు అందించాలని విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ మెట్రో ఫేజ్–2లో 7 కారిడార్లలో 122.9 కిలోమీటర్ల విస్తరణకు ₹38,595 కోట్ల ప్రతిపాదనలు సమర్పించామని, దీనిని కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త భాగస్వామ్యంతో మంజూరు చేయాలని కోరారు. రీజినల్ రింగ్ రోడ్ ఉత్తర, దక్షిణ కారిడార్లను ఒకేసారి ఆమోదించాలని సీఎం విజ్ఞప్తి చేశారు. ఉత్తర భాగానికి సంబంధించి భూసేకరణ పురోగతిలో ఉందని, రాష్ట్ర ప్రభుత్వం ఎన్‌హెచ్ఏఐకి ₹626 కోట్లు విడుదల చేసిందని వివరించారు. చౌటుప్పల్ నుంచి సంగారెడ్డి వరకు దక్షిణ కారిడార్ నిర్మాణం పూర్తయితే హైదరాబాద్ చుట్టూ రవాణా వ్యవస్థ మరింత బలోపేతమవుతుందని తెలిపారు. హైదరాబాద్–అమరావతి–బందర్ పోర్ట్ 12 లేన్ ఎక్స్‌ప్రెస్‌వేకు అనుమతి ఇవ్వాలని కోరారు. ఈ మార్గం ద్వారా సముద్ర తీరం లేని తెలంగాణకు పోర్ట్ కనెక్టివిటీ




లభిస్తుందని, ఫార్మా, ఎలక్ట్రానిక్స్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల ఎగుమతులకు ఉపయోగపడుతుందని చెప్పారు. వరంగల్ ఎయిర్‌పోర్ట్ పనులు ప్రారంభించాలని సీఎం కోరారు. అవసరమైన భూమిని ఇప్పటికే ఎయిర్‌పోర్ట్ అథారిటీకి అప్పగించామని తెలిపారు. ఈ ఎయిర్‌పోర్ట్ అందుబాటులోకి వస్తే ఉత్తర తెలంగాణ పారిశ్రామిక, విద్యా, పర్యాటక రంగాలకు మేలు జరుగుతుందని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో ఐఐఎం ఏర్పాటు చేయాలని కూడా ప్రధానికి సీఎం విజ్ఞప్తి చేశారు. ఇందుకు అవసరమైన 200 ఎకరాల భూమి కేటాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు.

# జర్నలిస్టుల సంక్షేమ సంఘం జేఎస్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గా బందెల రాజశేఖర్

- **నియామక పత్రం అందజేసిన జాతీయ అధ్యక్షులు, మానసాని కృష్ణారెడ్డి, రాష్ట్ర అధ్యక్షులు తక్కెళ్ళపల్లి శ్రీనివాస్**
- **జర్నలిస్టుల సంక్షేమ సంఘం బలోపేతం కోసం కృషి చేయాలి**
- **మానసాని కృష్ణారెడ్డి**

**పెద్దపల్లి జూన్ 11:.**





జర్నలిస్టుల సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఎంపికైన బందెల రాజశేఖర్ కు జాతీయ అధ్యక్షులు మానసాని కృష్ణారెడ్డి రాష్ట్ర అధ్యక్షులు తక్కెళ్ళపల్లి శ్రీనివాస్ అధికారికంగా నియామక పత్రం అందజేశారు. బుధవారం హనుమకొండలోని కాకతీయ యూనివర్సిటీ క్రాస్ రోడ్డు జంక్షన్ వద్ద ఉన్న జెఎస్ఎస్ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు తక్కల్లపల్లి శ్రీనివాస్ అధ్యక్షతన ప్రత్యేకమైన రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. ఇటీవల హనుమకొండలో జరిగిన రాష్ట్ర ప్రథమ సదస్సులో ఎన్నికైన కొంతమంది రాష్ట్ర కమిటీ సభ్యులకు ఈ సమావేశం సందర్భంగా జాతీయ అధ్యక్షులు మానసాని కృష్ణారెడ్డి చేతుల మీదుగా అధికారికంగా నియామక పత్రాలు అందించారు. ఈ సందర్భంగా మానసాని కృష్ణారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో జర్నలిస్టుల సంక్షేమ సంఘం బలోపేతానికి రాష్ట్ర కమిటీ సభ్యులు కృషి చేయాలని సూచించారు. అదేవిధంగా జర్నలిస్టుల సంక్షేమం కోసం వారి హక్కుల కోసం, సమస్యల పరిష్కారం కోసం , పక్షాన పోరాటం చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శులు తొగరి పవన్, శాసనాల సురేష్ లకు నియామక పత్రాలు అందజేశారు.

**త్వరలోనే పెద్దపల్లిలో జెఎస్ఎస్ రాష్ట్రస్థాయి సమావేశం... బందెల రాజశేఖర్**

జర్నలిస్టుల సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఎంపిక చేసి నియామక పత్రం అందజేసిన జాతీయ అధ్యక్షులు మానసాని కృష్ణారెడ్డి, రాష్ట్ర అధ్యక్షులు తక్కలపల్లి శ్రీనివాసరావుకు నూతనంగా ఎన్నిక బడిన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బందెల రాజశేఖర్ కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర నాయకత్వం ఆదేశాల మేరకు రాష్ట్రంలో జర్నలిస్టుల సంక్షేమ సంఘం బలోపేతం కోసం కృషి చేస్తానని, జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తానని, త్వరలోనే ఉమ్మడి కరీంనగర్ జిల్లాలకు సంబంధించి పెద్దపల్లి జిల్లా కేంద్రంలో జె ఎస్ ఎస్ రాష్ట్రస్థాయి సమావేశం నిర్వహించనున్నట్లుగా ఈ సమావేశానికి రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు హాజరుకారున్నట్లుగా తెలిపారు.

# మారుమూల పల్లెలకూ ఆర్టీసీ సేవలను విస్తరించాలి

### కలెక్టర్ ఇలా త్రిపాఠి

**నిజామాబాద్, జూన్ 11 :**

విద్యార్థులకు, ప్రజలకు, రైతులకు రవాణా వసతి మెరుగుపర్చేందుకు వీలుగా మారుమూల ప్రాంతాలకు సైతం ఆర్టీసీ సేవలను విస్తరించాలని, ప్రజలు రాకపోకలు సాగించే రూట్లలో బస్సు సర్వీసులు నడపాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ అధికారులను ఆదేశించారు. ఆర్టీసీ బస్సులు అందుబాటులో ఉండడం లేదని పలువురు ప్రజావాణిలో ఫిర్యాదులు చేయడం, ఇటీవల నిర్వహించిన ప్రజా పాలన గ్రామ సభలలో ఆర్టీసీ బస్సు సర్వీసుల కోసం ప్రజల నుండి విజ్ఞప్తులు రావడాన్ని దృష్టిలో పెట్టుకుని కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం ఐ.డీ.ఓ.సీలో ఆర్టీసీ అధికారులు, మండల పరిషత్ అధికారుల(ఎం.పీ.ఓ)తో ఉమ్మడి సమావేశం నిర్వహించారు. ఆయా మండలాల పరిధిలో ఆర్టీసీ బస్సు సర్వీసులు అవసరమైన మారుమూల గ్రామాలు, తండాల వివరాలను ఎం.పీ.ఓల ద్వారా సేకరించి, ఆ జాబితాను ఆర్టీసీ అధికారులకు అందజేయించారు. ప్రజల రవాణా అవసరాలకు అనుగుణంగా ఆయా ప్రాంతాలకు ఆర్టీసీ బస్సులు నడిపించాలని కలెక్టర్ సూచించారు. ప్రజల రాకపోకలకు ఆస్కారం ఉన్న ప్రాంతాలకు బస్సు సర్వీసులు నడపడం వల్ల అటు ప్రజలకు రవాణా సౌలభ్యం ఏర్పడడంతో పాటు ఆర్టీసీ సంస్థకు కూడా తగిన ఆదాయం సమకూరుతుందని అన్నారు. ప్రస్తుతం పాఠశాలలు పునః ప్రారంభం కానున్నాయని, ఖరీఫ్ సీజన్ పంటలు విత్తుకునేందుకు రైతులు ఎరువులు, విత్తనాలు, క్రిమి సంహారక మందుల కోసం రాకపోకలు సాగిస్తారని, ప్రజలు తమ దైనందిన అవసరాల కోసం రవాణా వసతిపై ఆధారపడతారని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఆయా నివాస ప్రాంతాలు,




మారుమూల గ్రామాలకు కొత్తగా ఆర్టీసీ బస్సు సర్వీసులు నడిపించాలని, అవసరమైన చోట ప్రయాణికులు, ప్రజల రద్దీని బట్టి బస్సు ట్రిప్పుల సంఖ్యను పెంచాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆర్టీసీ అధికారులకు సూచించారు. ఎం.పీ.ఓలు ప్రతిపాదించిన జాబితాను పరిశీలించి, అవసరం ఉన్న అన్ని రూట్లలో ఆర్టీసీ బస్సు సర్వీసులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. కొత్తగా ఏర్పడిన నివాస ప్రాంతాల ప్రజలకు కూడా రవాణా వసతి ఉండాలన్నారు. ప్రతిపాదిత రూట్లలో వచ్చే సోమవారం నుండి ఆర్టీసీ బస్సులు నడిచేలా చర్యలు తీసుకోవాలని, పక్షం రోజుల తరువాత తాను మరోమారు సమీక్ష నిర్వహిస్తానని కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ రావు, ఆర్టీసీ ఆర్.ఎం మూర్తి, డిప్యూటి ఆర్.ఎం మధుసూదన్, డిపో–1 మేనేజర్ ఆనంద్, అన్ని మండలాల ఎం.పీ.ఓలు పాల్గొన్నారు.

# పరకాలలో అభివృద్ధి పనులపై క్షేత్రస్థాయి పరిశీలన

- మున్సిపల్ కార్యాలయం, దామెర చెరువు అభివృద్ధి పనులు, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవన సముదాయం సందర్శన

**పరకాల: జూన్ 11:**

హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ గురువారం పరకాల మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించి వివిధ అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్‌కు పరకాల మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్ కుమార్, మున్సిపల్ కమిషనర్ పోతరాజు పవన్, ఆర్డీవో డి.ఎస్. వెంకన్న, ఇతర అధికారులు మొక్కలు అందజేసి ఘన స్వాగతం పలికారు.



అనంతరం మున్సిపల్ చైర్మన్‌తో కలిసి కలెక్టర్ మున్సిపల్ కార్యాలయంలోని పలు విభాగాలను సందర్శించి వాటి పనితీరు, సేవల నిర్వహణను పరిశీలించారు. కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన మొక్కల నర్సరీని పరిశీలించి పచ్చదనం పెంపొందించే చర్యలను పరిశీలించారు. అదేవిధంగా అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ) కోసం ప్రతిపాదించిన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం నిర్మాణంలో ఉన్న దామెర చెరువు కట్ట బండ్, నాలా, కాలువ అభివృద్ధి పనులను మున్సిపల్ చైర్మన్, అధికారులతో కలిసి పరిశీలించి పనుల పురోగతిని సమీక్షించారు. తదుపరి అసంపూర్తిగా ఉన్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవన సముదాయాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్, నిర్మాణ పనుల స్థితిగతులను పరిశీలించి పనులను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేసే దిశగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ ఆరెపల్లి సుమన్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర పథకాలు అమలు చేసేలా.. రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించండి

**గవర్నర్ ను కోరిన ఎమ్మెల్సీ మల్క కొమరయ్య**
**22 కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రస్తావిస్తూ ప్రత్యేక విజ్ఞప్తి**

**హైదరాబాద్ జూన్11:**

కేంద్రంలోని ప్రధాని మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని పథకాలు తెలంగాణలో అమలు కావడం లేదని, వాటిని అమలు చేసేలా రాష్ట్ర సర్కారును ఆదేశించాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమరయ్య రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లాను కోరారు. ఈ మేరకు గురువారం ఎమ్మెల్సీ లోక్ భవన్ లో రాష్ట్ర గవర్నర్ ను కలిసి ప్రత్యేక విజ్ఞప్తి చేశారు. జల్ జీవన్ మిషన్, పీఎం సురక్షా బీమా



యోజన, ఫసల్ బీమా, సాయిల్ హెల్త్ కార్డు సహా కేంద్ర ప్రభుత్వం దేశ ప్రజల సంక్షేమం కోసం అమలు చేస్తున్న దాదాపు 22 పథకాలను సీఎం రేవంత్ సర్కారు రాష్ట్ర స్థాయిలో సరిగా అమలు చేయడం లేదని ఎమ్మెల్సీ మల్క కొమరయ్య గవర్నర్ దృష్టికి తీసుకువెళ్లారు. అతివృష్టి, అనావృష్టి సహా ప్రకృతి వైపరీత్యాలకు పంట నాశనమైతే.. రైతులకు పరిహారం అందేలా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఫసల్ బీమా యోజనను కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అమలు చేయడం లేదని, తద్వారా అన్నదాతలకు నష్టం జరుగుతోందని ఎమ్మెల్సీ గవర్నర్ కు వివరించారు. ఈ సందర్భంగా కేంద్రం అమలు చేస్తున్న పథకాలన్నీ రాష్ట్రంలో పకడ్బందీగా అమలు చేసేలా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని ఎమ్మెల్సీ గవర్నర్ కు రిప్రజెంటేషన్ ఇచ్చారు.

# బండ చెరువు అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

- ముంపు సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలి
- ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

**మల్కాజ్‌గిరి జూన్11:**

బండ చెరువు అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అధికారులను ఆదేశించారు గురువారం మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో చీఫ్ ఇంజనీర్ అశోక్ రెడ్డిని కలిసి ఈ సందర్భంగా. చెరువు పరిసర ప్రాంతాల్లోని లోతట్టు కాలనీలు ప్రతి వర్షాకాలంలో ముంపుకు గురవుతున్న నేపథ్యంలో, వరద నీటిని మళ్లించే డైవర్షన్ ప్రణాళికలను రూపొందించి శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. అలాగే బండ చెరువులో విస్తరించిన గుర్రపు డెక్క (వాటర్ హైసింథ్)ను పూర్తిస్థాయిలో తొలగించి, దోమల వ్యాప్తి నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. చెరువు పరిశుభ్రత, పరిసర ప్రాంతాల అభివృద్ధి, ప్రజారోగ్య పరిరక్షణ అంశాలపై కూడా అధికారులతో సమగ్రంగా చర్చించారు. ఈ సమస్యల పరిష్కారానికి ఇరిగేషన్ శాఖ అధికారులతో సమన్వయం చేసుకుని తక్షణ చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరగా, చీఫ్ ఇంజనీర్ అశోక్ రెడ్డి సానుకూలంగా స్పందించి అవసరమైన చర్యలకు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. నియోజకవర్గ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడం, ముంపు సమస్యలను శాశ్వతంగా పరిష్కరించడం, చెరువుల సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వడం తన లక్ష్యమని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు

# బడిబాట విజయవంతానికి కృషి చేయాలి: కలెక్టర్ ప్రియాంక ఆలా

**హైదరాబాద్, జూన్ 11:**

జిల్లాలో బడిబాట కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించి విద్యార్థుల నమోదు లక్ష్యాలను సాధించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆలా విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. జూన్ 15న పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో యూనిఫాంలు, పాఠ్యపుస్తకాలు, మౌలిక వసతుల ఏర్పాట్లు పూర్తిచేయాలని



సూచించారు. జిల్లాలో 10 శాతం అదనపు నమోదు లక్ష్యాన్ని సాధించేందుకు ఇంటింటి ప్రచారం నిర్వహించాలని ఆదేశించారు. బడిబాట కార్యక్రమం ద్వారా గుర్తించిన 600 మంది పిల్లల్లో ఇప్పటికే 334 మందిని తిరిగి పాఠశాలల్లో చేర్చినట్లు అధికారులు తెలిపారు. విద్యా ప్రమాణాల పెంపు, డిజిటల్ లెర్నింగ్, ప్రత్యేక అవసరాలున్న పిల్లలకు నాణ్యమైన సేవలందించడంపై సమావేశంలో సమీక్ష నిర్వహించారు.

# తెలంగాణ డీజీపీ సి.వి. ఆనంద్‌ను కలిసిన మందకృష్ణ మాదిగ

**హైదరాబాద్ జూన్11:**

.తెలంగాణ రాష్ట్ర నూతన డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ)గా బాధ్యతలు స్వీకరించిన సి.వి. ఆనంద్‌ను ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, పద్మశ్రీ మందకృష్ణ మాదిగ గురువారం హైదరాబాద్‌లోని డీజీపీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకుని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మందకృష్ణ మాదిగ సి.వి. ఆనంద్‌కు పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించారు. ఎమ్మార్పీఎస్ తొలి దశ ఉద్యమం సందర్భంగా బషీర్‌బాగ్ చౌరస్తాలో పోలీసు అధికారిగా విధులు నిర్వహించిన రోజుల్ని సి.వి. ఆనంద్ ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. పోలీసు శాఖలో విశేష అనుభవం కలిగిన సి.వి. ఆనంద్ తెలంగాణ రాష్ట్ర డీజీపీగా నియమితులు కావడం సంతోషకరమని మందకృష్ణ మాదిగ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు డా. గోవిందు నరేష్ మాదిగ, ఎంఎస్పీ జాతీయ నాయకుడు తిప్పారపు లక్ష్మణ్ మాదిగ, ప్రముఖ గేయరచయిత, నంది అవార్డు గ్రహీత మిట్టపల్లి సురేందర్, సినీ దర్శకుడు ప్రేమ్ రాజు, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బైరపోగు శివకుమార్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.



# ఏఎంఆర్పి హై లెవెల్ కెనాల్ లైనింగ్ పనులు వేగవంతం



## మంత్రి కోమటిరెడ్డి

**నల్లగొండ, జూన్ 11:**

సుమారు రూ.442 కోట్లతో చేపట్టిన ఏఎంఆర్పి హై లెవెల్ కెనాల్ లైనింగ్ పనులను వేగవంతం చేసి జూలై 31 నాటికి సాధ్యమైనంత మేర పూర్తి చేయాలని రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం నల్లగొండ మండలంలోని నర్సింగ్‌బట్ల, కుదవన్‌పూర్, గుండ్లపల్లి ప్రాంతాల్లో పనులను పరిశీలించిన మంత్రి, పనుల పురోగతిపై సంతృప్తి వ్యక్తం చేశారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని పేర్కొన్న ఆయన, సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తున్నామని తెలిపారు. అంగడిపేట నుంచి మూసీ వరకు 136 కిలోమీటర్ల మేర కాల్వ లైనింగ్ పనులు జరుగుతున్నాయని, ఇవి పూర్తయితే 2.20 లక్షల ఎకరాలకు సాగునీరు సమర్థంగా అందుతుందని చెప్పారు. కాల్వ చివరి భూముల వరకు నీరు చేరేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

మంత్రి వెంట ఇరిగేషన్ సీఈ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఈ భద్రు, ఈఈ నెహ్రూనాయక్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# విధి నిర్వహణలో నిర్లక్ష్యం సహించం: సీపీ సన్‌ప్రీత్ సింగ్




**వరంగల్, జూన్ 11:**

విధి నిర్వహణలో అలసత్వం ప్రదర్శించే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ హెచ్చరించారు. కిట్స్ కళాశాలలో నిర్వహించిన నెలవారీ నేర సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. సీసీటీఎన్ఎస్ 2.0 ద్వారా పెండింగ్ కేసులు, నిందితుల అరెస్టులు, దర్యాప్తు పురోగతి, నేర నియంత్రణ చర్యలను సమీక్షించిన సీపీ, పెండింగ్ కేసుల పరిష్కారంపై అధికారులకు సూచనలు చేశారు. రౌడీషీటర్లపై నిరంతర నిఘా, విద్యాసంస్థల 100 మీటర్ల పరిధిలో పొగాకు ఉత్పత్తుల విక్రయాల నియంత్రణ, పాఠశాల బస్సుల తనిఖీలు, నగరంలో నివసిస్తున్న నేపాల్ పౌరుల వివరాల సేకరణ చేపట్టాలని ఆదేశించారు. అలాగే లోక్ అదాలత్ ద్వారా అధిక సంఖ్యలో కేసుల పరిష్కారం, పెండింగ్ డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల త్వరితగతిన విచారణ పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో డీసీపీలు, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు పాల్గొన్నారు.

# కుటుంబ నియంత్రణ ఆపరేషన్‌పై నర్సింగ్ హోమ్‌లో తనిఖీలు



**గూడూరు జూన్ 11:**

గూడూరు మండలంలోని తిరుమల నర్సింగ్ హోమ్‌లో అనుమానాస్పద కుటుంబ నియంత్రణ (ట్యూబెక్టమీ) ఆపరేషన్ జరిగినట్లు సమాచారం రావడంతో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. రవి రాథోడ్ గురువారం తన బృందంతో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీల సందర్భంగా సంబంధిత కేసుకు సంబంధించిన రికార్డులు, కేసు షీట్లు, ఇతర పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసు వరంగల్ జిల్లా పరిధికి చెందినదిగా గుర్తించడంతో పూర్తి వివరాల కోసం వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులను సంప్రదించనున్నట్లు తెలిపారు. అదేవిధంగా, ఆసుపత్రిలోని ఆపరేషన్ థియేటర్‌ను సీజ్ చేశారు. తనిఖీలలో ఇన్‌చార్జి పీవో ఎంహెచ్ఎన్ డా. విరాజిత, డిప్యూటీ డెమో రాజ్‌కుమార్, లోక్య, ప్రశాంత్, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

# ఏఐతో ప్రభుత్వ పనితీరుకు మరింత వేగం, పారదర్శకత: కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్




**సూర్యాపేట, జూన్ 11:**

ప్రభుత్వ పనితీరులో వేగం, సామర్థ్యాన్ని పెంచడంలో కృత్రిమ మేధ (ఏఐ) కీలక పాత్ర పోషిస్తుందని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ఏఐ శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆధునిక సాంకేతికతను ప్రతి అధికారి, ఉద్యోగి అవలంబించి దైనందిన విధుల్లో అమలు చేయాలని సూచించారు. శిక్షణ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుని నేర్చుకున్న అంశాలను పనిలో ప్రతిఫలింపజేయాలని చెప్పారు. ప్రజలకు వేగవంతమైన, నాణ్యమైన సేవలు అందించేందుకు సాంకేతిక పరిజ్ఞానం దోహదపడుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వ సేవలను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా అందించే దిశగా అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, మాస్టర్ ట్రైనర్లు వాసుదేవన్ నటరాజన్ దేవరాజ్, రాహుల్, జిల్లా అధికారులు, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

# నిజామాబాద్‌లో అపోలో ఫార్మసీ ఉద్యోగ మేళా

**నిజామాబాద్, జూన్ 11**

జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 15న అపోలో ఫార్మసీ సంస్థలో వివిధ ఉద్యోగాల భర్తీ కోసం ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి విజేత తెలిపారు. జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో ఉదయం 10:30 గంటలకు ఇంటర్వ్యూలు జరుగుతాయని పేర్కొన్నారు.

ఫార్మసిస్ట్, ట్రైనీ ఫార్మసిస్ట్, ఫార్మసీ అసిస్టెంట్, ప్రొడక్ట్ అడ్వైజర్, రిటైల్ ట్రైనీ అసోసియేట్ (అప్రెంటిస్) పోస్టులను భర్తీ చేయనున్నారు. డి.ఫార్మసీ, బి.ఫార్మసీ, ఎం.ఫార్మసీ, ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, బీబీఏ, బీఎస్సీ (కెమిస్ట్రీ/న్యూట్రిషన్/ఫుడ్ సైన్స్) అర్హత కలిగిన అభ్యర్థులు పాల్గొనవచ్చని తెలిపారు.

ఎంపికైన వారికి నెలకు రూ.12,500 నుంచి రూ.25,000 వరకు వేతనం అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు విద్యార్హతల ధ్రువపత్రాలతో హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9959456793, 9948748428 నంబర్లను సంప్రదించవచ్చని విజేత తెలిపారు.

## బాధిత బాలికను పరామర్శించిన బాలల హక్కుల కమిషన్ సభ్యులు



**హైదరాబాద్, జూన్ 11:**

. తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు వందన గౌడ్, బండి అపర్ణ, చందన మారిపల్లి నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఖమ్మం జిల్లాకు చెందిన బాధిత బాలికను, ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా బాలిక ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్న కమిషన్ సభ్యులు, అవసరమైన వైద్య సేవలు నిరంతరం అందించాలని సూచించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ బాలికకు న్యాయం జరిగేలా పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. బాలిక కుటుంబం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో జీవనోపాధి, ప్రయాణం, ఆహారం తదితర అవసరాలకు ప్రత్యేక సహాయం అందించాలని సంబంధిత శాఖలకు ఆదేశించారు. పునరావాసం, కౌన్సెలింగ్, బాధిత సహాయ పథకాల సేవలను తక్షణమే అందించాలని సూచించారు. బాలిక త్వరగా కోలుకుని సాధారణ జీవితంలోకి రావడానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కమిషన్ పేర్కొంది.

## సేంద్రియ వ్యవసాయంతో అధిక లాభాలు: కలెక్టర్ ప్రతిమా సింగ్



**మెదక్ జూన్11:**

మెదక్ జిల్లా శివంపేట మండలం ఉసిరికపల్లి గ్రామంలో రైతు పోతరాజుల బాలేష్ సాగు చేస్తున్న సేంద్రియ వ్యవసాయ క్షేత్రాన్ని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ పరిశీలించారు. సేంద్రియ పద్ధతుల్లో సాగు చేస్తున్న వరి, కూరగాయలు, పండ్ల తోటలను సందర్శించి రైతులతో మాట్లాడారు. సేంద్రియ వ్యవసాయం వల్ల నేల సారవంతత పెరగడంతో పాటు పర్యావరణ పరిరక్షణ, ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తి సాధ్యమవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. సేంద్రియ పంటలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉండటంతో రైతులు అధిక ఆదాయం పొందే అవకాశం ఉందన్నారు. సేంద్రియ సాగు విస్తరణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి రైతులకు శిక్షణ, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు.

## నిజామాబాద్‌లో అపోలో ఫార్మసీ ఉద్యోగ మేళా

**నిజామాబాద్, జూన్ 11:**



జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 15న అపోలో ఫార్మసీ సంస్థలో వివిధ ఉద్యోగాల భర్తీ కోసం ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి విజేత తెలిపారు. జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో ఉదయం 10:30 గంటలకు ఇంటర్వ్యూలు జరుగుతాయని పేర్కొన్నారు.

ఫార్మసిస్ట్, ట్రైనీ ఫార్మసిస్ట్, ఫార్మసీ అసిస్టెంట్, ప్రొడక్ట్ అడ్వైజర్, రిటైల్ ట్రైనీ అసోసియేట్ (అప్రెంటిస్) పోస్టులను భర్తీ చేయనున్నారు. డి.ఫార్మసీ, బి.ఫార్మసీ, ఎం.ఫార్మసీ, ఎస్ఎస్సీ, ఇంటర్, డిగ్రీ, బీబీఏ, బీఎస్సీ (కెమిస్ట్రీ/న్యూట్రిషన్/ఫుడ్ సైన్స్) అర్హత కలిగిన అభ్యర్థులు పాల్గొనవచ్చని తెలిపారు. ఎంపికైన వారికి నెలకు రూ.12,500 నుంచి రూ.25,000 వరకు వేతనం అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు విద్యార్హతల ధ్రువపత్రాలతో హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9959456793, 9948748428 నంబర్లను సంప్రదించవచ్చని విజేత తెలిపారు.

## అక్రిడిటేషన్ జర్నలిస్టులకు రాయితీ బస్ పాసులు

### సమాచార పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ ముకుందా రెడ్డి

**హైదరాబాద్ జూన్11:**

2026–2028 సంవత్సరాలకు అక్రిడిటేషన్ పొందిన రాష్ట్ర, జిల్లా స్థాయి వర్కింగ్ జర్నలిస్టులకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) ద్వారా రాయితీ బస్ పాసులు జారీ చేయనున్నట్లు సమాచార మరియు ప్రజా సంబంధాల శాఖ తెలిపింది. ఇప్పటికే అక్రిడిటేషన్ కార్డులు పొందిన జర్నలిస్టులు టీజీఎస్ఆర్టీసీ వెబ్ పోర్టల్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునే సౌకర్యం కల్పించాలని సంస్థ అధికారులను కోరినట్లు పేర్కొంది. దరఖాస్తు చేసుకున్న అర్హులైన జర్నలిస్టులకు రాయితీ బస్ పాసులు జారీ చేయనున్నట్లు వెల్లడించింది. ఈ బస్ పాసులు 2026 జూన్ 17 నుంచి 2028 ఏప్రిల్ 30 వరకు చెల్లుబాటులో ఉంటాయి. కాగా, మరికొంతమంది జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డుల జారీ ప్రక్రియ కొనసాగుతోందని అధికారులు తెలిపారు. ఈ మేరకు సమాచార మరియు ప్రజా సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ జి. ముకుంద రెడ్డి తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్‌కు లేఖ రాశారు.

## బల్క్ భూములు, సాదా బైనామాల పరిష్కారాన్ని వేగవంతం చేయాలి

**భూపాలపల్లి, జూన్ 11:**



జిల్లాలో బల్క్ భూములు, సాదా బైనామా కేసులు, రెవెన్యూ సదస్సులు మరియు ప్రజావాణిలో అందిన దరఖాస్తుల పరిష్కారానికి రెవెన్యూ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశించారు. గురువారం ఐడీఓసీ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో బల్క్ భూ సమస్యలు, సాదా బైనామా దరఖాస్తులు, ప్రజావాణి వినతులు, మీ సేవా కేంద్రాల ద్వారా సర్టిఫికెట్ల జారీ పురోగతిపై రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వ భూములను సాగు చేస్తున్న రైతులకు భూ హక్కు పత్రాలు జారీ చేసేందుకు చేపడుతున్న బల్క్ భూముల సర్వే పనులను వేగవంతం చేసి నివేదికలు సమర్పించాలని సూచించారు. సాదా బైనామా, రెవెన్యూ సదస్సుల్లో అందిన దరఖాస్తులను నిబంధనల ప్రకారం త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా వ్యవహరించాలని, శాఖల మధ్య సమన్వయంతో సమస్యలను వేగంగా పరిష్కరించాలని సూచించారు. ప్రజావాణిలో అందిన వినతులను సత్వరమే పరిష్కరించడంతో పాటు, మీ సేవా కేంద్రాల ద్వారా జారీ చేసే సర్టిఫికెట్లను ఆలస్యం లేకుండా అందించాలని తెలిపారు. ముఖ్యంగా విద్యాసంస్థలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో విద్యార్థులకు అవసరమైన ధ్రువపత్రాల జారీలో జాప్యానికి తావు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, డీఆర్వో వసంతకుమారి, ఆర్డీఓలు హరికృష్ణ, రవీందర్, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

## నూతన ఏరియా ఆసుపత్రిని త్వరగా అందుబాటులోకి తీసుకురావాలి

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి
- ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ సమీక్ష.
- ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించడమే ప్రధాన లక్ష్యం

**పరకాల: జూన్ 11:**

పరకాలలో నూతనంగా నిర్మించిన 100 పడకల ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని అత్యాధునిక వైద్య పరికరాలు, మెరుగైన మౌలిక వసతులతో త్వరితగతిన ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం పరకాలలో నూతనంగా నిర్మిస్తున్న ఏరియా ఆసుపత్రిలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి అధ్యక్షతన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్పర్సన్, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, పరకాల మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునీల్ కుమార్, ఆర్డీవో డి.ఎస్. వెంకన్న, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ గౌతమ్ చౌహాన్, మున్సిపల్ కమిషనర్ పోతరాజు పవన్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. సమావేశంలో ఆసుపత్రి అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఆరోగ్యశ్రీ నిధుల ద్వారా రూ.79.18 లక్షల వ్యయంతో వైద్య పరికరాల కొనుగోలు, అత్యవసర మందుల నిల్వలు, శస్త్రచికిత్సలకు అవసరమైన పరికరాలు, మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై అధికారులు, కమిటీ సభ్యులతో చర్చించారు. ప్రస్తుతం ఆసుపత్రిలో పనిచేస్తున్న వైద్యుల సంఖ్య, ప్రతిరోజూ వైద్య సేవల కోసం వచ్చే రోగుల వివరాలు, నెలవారీ ప్రసవాలు, శస్త్రచికిత్సల సంఖ్య, మందుల నిల్వలు, నూతన ఆసుపత్రికి అవసరమైన అదనపు పరికరాలు, అవుట్ పేషెంట్లు, ఇన్ పేషెంట్ల గణాంకాలు, ఆసుపత్రి పరిధిలోని మండలాల వివరాలను ఎమ్మెల్యే సూపరింటెండెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆసుపత్రి నిర్వహణకు సంబంధించిన బిల్లులు, రికార్డులను పరిశీలించారు. బిల్లులు, రికార్డుల నిర్వహణ సక్రమంగా లేకపోవడంపై సూపరింటెండెంట్‌పై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ పరకాల ఏరియా ఆసుపత్రి ద్వారా ప్రజలకు 24 గంటల పాటు నాణ్యమైన వైద్య సేవలు అందించాలన్నారు. వైద్యులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి రోగులకు మెరుగైన



సేవలు అందించాలని సూచించారు. ముఖ్యంగా అనస్థీషియా వైద్యుడు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, అవసరమైన అన్ని మందులు ఆసుపత్రిలో నిల్వ ఉంచాలని ఆదేశించారు. గత నెలలో నూతన ఏరియా ఆసుపత్రిని సందర్శించి, అవసరమైన వైద్య పరికరాలు, మౌలిక వసతులు, అభివృద్ధి పనుల వివరాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఆసుపత్రి నిర్వహణకు సంబంధించిన ప్రతి రశీదు, బిల్లు, రికార్డును పారదర్శకంగా, సక్రమంగా నిర్వహించాలని సూచించారు. అభివృద్ధి పనులను సంబంధిత ఏజెన్సీలు వేగవంతంగా పూర్తి చేసి ఆసుపత్రిని త్వరగా వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. అదేవిధంగా పరకాలలో అసంపూర్తిగా ఉన్న మార్కెట్ భవన సముదాయం నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్‌కు ఎమ్మెల్యే సూచించారు. జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ ఆసుపత్రిలో ప్రత్యేక వైద్య నిపుణుల సంఖ్య, శస్త్రచికిత్సలు, ప్రసవాల గణాంకాలు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా ఆసుపత్రి నిర్వహణ, సేవల నాణ్యతను మరింత మెరుగుపర్చాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు డాక్టర్ బాలకృష్ణ, నాగరాణి, రాఘవరెడ్డి, పుష్పలత, టీజీఎంఐడీసీ ఈఈ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## నూనెగింజల రైతులకు వాట్సాప్‌లో ఏఐ సలహాలు

### ‘ఆయిల్‌సీడ్స్ కిసాన్ మిత్ర’ సేవ ప్రారంభం

**న్యూఢిల్లీ, జూన్ 11:**

నూనెగింజల పంటల సాగుపై రైతులకు ఉచితంగా, పరిశోధన ఆధారిత సలహాలు అందించేందుకు భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి (ICAR) ఆధ్వర్యంలో ‘ఆయిల్‌సీడ్స్ కిసాన్ మిత్ర’ పేరుతో దేశంలోనే తొలి వాట్సాప్ ఆధారిత కృత్రిమ మేధ (AI) సేవను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ సేవ ద్వారా రైతులు వేరుశెనగ, ఆవాలు, నువ్వులు, పొద్దుతిరుగుడు, సోయాబీన్ తదితర నూనెగింజల పంటల సాగు, విత్తనాల ఎంపిక, ఎరువుల వినియోగం, పురుగు–వ్యాధుల నివారణ, నీటి యాజమాన్యం, కోత అనంతర నిర్వహణ వంటి అంశాలపై 24 గంటలూ తమ భాషలో సలహాలు పొందవచ్చు. రైతులు +91 4024598180 నంబర్‌ను తమ ఫోన్‌లో ‘Oilseeds Kisaan Mitra’ పేరుతో సేవ్ చేసి వాట్సాప్‌లో సందేశం పంపితే వెంటనే సమాధానాలు అందుతాయి. ఎలాంటి ప్రత్యేక యాప్ అవసరం లేకుండా దేశంలోని అన్ని భారతీయ భాషల్లో ఈ సేవ అందుబాటులో ఉంటుందని ఐసీఏఆర్ వెల్లడించింది. ఈ సేవను ఫిబ్రవరి 6న జాతీయ నూనెగింజల సదస్సులో ప్రారంభించారు. రైతులకు శాస్త్రీయ పరిజ్ఞానాన్ని నేరుగా చేరవేయడంలో ఇది కీలక ముందడుగుగా అధికారులు పేర్కొన్నారు.

## నాణ్యతతో రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ పనులు పూర్తి చేయాలి

**సిద్దిపేట, జూన్ 11:**

కోహెడ మండలం తంగళ్లపల్లి గ్రామ శివారులో సుమారు 23 ఎకరాల విస్తీర్ణంలో రూ.200 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ పనులను జిల్లా కలెక్టర్ కె. హైమావతి గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణ ప్రాంతం మొత్తం కలియ తిరిగి పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలోనే నిర్మాణ పురోగతిలో ముందున్న ఈ భారీ విద్యాసంస్థ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను కచ్చితంగా పాటిస్తూ, నిర్ణీత గడువులోగా యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఈడబ్ల్యూఐడీసీ ఇంజనీరింగ్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. చుట్టూ కొండలు, పచ్చని చెట్ల మధ్య నిర్మితమవుతున్న ఈ ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ రాష్ట్రానికి రోల్ మోడల్‌గా నిలవాలని ఆమె పేర్కొన్నారు. పనులపై రెవెన్యూ అధికారులు తరచూ పర్యవేక్షణ చేయాలని సూచించారు.



## గర్భస్థ శిశువుల లింగ నిర్ధారణను పూర్తిగా అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు

### జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

**భూపాల పల్లి జూన్11 :**

గురువారం ఐడిఓసి కార్యాలయంలో వైద్య శాఖ ఆధ్వర్యంలో పీసీ పీఎన్‌డీటీ మరియు క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్టు అమలుపై వైద్య, పోలీస్, ఐఎంఏ, మాలి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పీసీ పీఎన్‌డీటీ చట్టం మరియు క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్టు నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అదేవిధంగా జిల్లాలోని అన్ని ప్రైవేట్ మరియు ప్రభుత్వ వైద్య సంస్థలు నమోదు ప్రక్రియను పూర్తి చేసి, చట్టపరమైన మార్గదర్శకాలను పాటించాలని ఆదేశించారు. వైద్య సేవలు ప్రజలకు నాణ్యంగా, పారదర్శకంగా అందించేందుకు చర్యలు చేపట్టాలని స్పష్టంచేశారు. ఈ సమావేశంలో జిల్లా వైద్యాధికారి డా. మధుసూదన్, ఐఎంఏ అధ్యక్షులు డా. కె.ఎస్. కిరణ్, మాలి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి సదానందం, డిప్యూటీ వైద్యాధికారి డా. శ్రీదేవి, డెమో శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

## ఏపీ లిక్కర్ కుంభకోణం

**అమరావతి, జూన్ 11:**

దేశంలోనే అతిపెద్ద లిక్కర్ కుంభకోణంగా ప్రచారం పొందుతున్న ఆంధ్రప్రదేశ్ లిక్కర్ స్కామ్ కేసులో దేవాదాయ శాఖ మాజీ మంత్రి, వైసీపీ నేత కారుమూరి వెంకట నాగేశ్వరరావును ఎన్ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు అరెస్ట్ చేసినట్లు సమాచారం. బుధవారం ఉదయం నుంచి స్కామ్ ప్రధాన నిందితు డిగా భావిస్తున్న రాజ్ కేసిరెడ్డి నివాసాలతో పాటు మాజీ మంత్రి కారుమూరికి చెందిన విజయవాడ, హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో ఈడీ అధికారులు సోదాలు నిర్వహించారు. సోదాల అనంతరం ముం దుగా రాజ్ కేసిరెడ్డిని, అనంతరం కారు మూరి వెంకట నాగేశ్వరరావును అదుపు లోకి తీసుకుని అరెస్ట్ చేసినట్లు తెలుస్తోంది.

చురకలు

శుక్రవారం 12 జూన్ 2026

# పెంబి మండలం గ్రామాల అభివృద్ధికి చర్యలు

**జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.**



**నిర్మల్, జూన్11:**

పెంబి మండలంలోని పలు గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ తో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించి తెలుసుకున్నారు. ఇటిక్యాల తండా, కోలం గూడా, చాకిరేవు, గమ్మెన ఎంగ్లాపూర్, ధూందారి, చేర్యాల కడెం మండలంలోని మిద్దెచింతల, అల్లంపల్లి, ఇస్లాంపూర్, అద్దాల తిమ్మాపూర్, తదితర గ్రామాల్లో పర్యటించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో ఉన్న అడ్డంకులు తొలగించేలా తగు చర్యలు తీసుకునేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. గ్రామాలకు కమ్యూనికేషన్ వ్యవస్థ మెరుగు పరిచేలా రెవెన్యూ భూమిలో సెల్ టవర్ ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ప్రజలకు సురక్షిత త్రాగునీరు అందించేలా చొరవ చూపుతామని చెప్పారు. నాణ్యమైన విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. మెరుగైన రోడ్డు రవాణా కల్పించేందుకు అవసరమైన చోట ఐరన్ బ్రిడ్జిలు ఏర్పాటు చేసి ప్రజలకు ఇబ్బందులు తొలిగించాలని చెప్పారు. ఆయా గ్రామాలలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వివరించారు. ఎఎన్ఎం, ఆశాలు స్థానిక ప్రజలకు అందుబాటులో ఉండాలని తెలిపారు. నిరంతరం పరిశుద్ధ్య పనులు కొనసాగించాలన్నారు. కోలం గూడాలో మొక్కలు నాటారు. అక్కడ నుంచి రోడ్డు సౌకర్యం లేని పలు గ్రామాలకు ఎమ్మెల్యే, కలెక్టర్ లు అధికారులతో కలిసి బైక్ పై పలు గ్రామాలు తిరిగారు. గమ్మెన ఎంగ్లాపూర్ గ్రామంలో బిఎస్ఎన్ఎల్ సెల్ టవర్ ఏర్పాటు చేయనున్న ప్రదేశాన్ని పరిశీలించారు. టవర్ ఏర్పాటుకు స్థలాన్ని ఇచ్చిన గ్రామ రైతు చిన్నయ్యను అభినందించారు. స్థలాన్ని వెంటనే బిఎస్ఎన్ఎల్ కు అప్పగించి, పనులు ప్రారంభం చేయించి, గ్రామస్తులకు మొబైల్ సిగ్నల్స్ సమస్యలు తీరుస్తామన్నారు. రాళ్ళవాగు పై ఐరన్ బ్రిడ్జి ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు.

**అధికారుల సమన్వయంతో ప్రజల సమస్యలు దూరం చేయాలి:**

**ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్.**

పెంబి, కడెం మండలాలలోని పలు గ్రామాలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు సమన్వయంతో వ్యవహరించి పరిష్కరించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. < పెంబి, కడెం మండలాలలో ఇందిరమ్మ ఇండ్లు, రోడ్లు, వంతెనలు, సెల్ టవర్లు, తదితర మౌలిక సదుపాయాల కల్పన పనుల్లో అటవీ నిబంధనల కారణంగా ఆలస్యం జరుగుతుందని అన్నారు. ఇప్పటికే పలుమార్లు సమస్యల పరిష్కారం పై అధికారులతో సమావేశాలు నిర్వహించడంతోపాటు, రెవెన్యూ శాఖ మంత్రి తో కూడా సమస్యల ప్రస్తావన జరిగిందని అన్నారు. త్వరలోనే మరోసారి మంత్రిని కలిసి, అటవీ అనుమతుల కారణంగా ఆగిపోయిన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల వివరాలు వెల్లడిస్తామని పేర్కొన్నారు. అటవీ అధికారులు తమ పరిధిలో ఉన్న అంశాల పరిష్కారంలో ఆలస్యం చేయకూడదని వివరించారు. అటవీ ప్రాంతాల్లో నివసించే ప్రజలందరికీ మెరుగైన సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు.

ఇస్లాంపూర్ గ్రామంలో గ్రామపంచాయితీ, అంగన్వాడి భవనాలు ప్రారంభించారు.

ఈ పర్యటనలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, అటవీ అధికారి సుశాంత్ సుఖదేవ్ బోబడే, డిఆర్డిఓ విజయలక్ష్మి ., డిపిఓ శ్రీనివాస్, డిఎంహెచ్ఓ రాజేందర్, వివిధ శాఖల అధికారులు స్థానిక గ్రామాల ప్రజాప్రతినిధులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# అధిక మాసంలో చేసే పూజలకు విశేష ఫలితాలు: సోమాయప్ప మహారాజ్

**పోతంగల్ జూన్ 11:**

అధిక మాసంలో చేసే పూజలు, దైవ కార్యక్రమాలకు అధిక ఫలితం ఉంటుందని బిచ్కుంద పీఠాధిపతి సోమాయప్ప మహారాజ్ పేర్కొన్నారు. నిజామాబాద్ జిల్లా బాన్సువాడ నియోజకవర్గం సుంకిని గ్రామంలో డిటిహెచ్ ఆపరేటర్ శేషు ఆధ్వర్యంలో జరిగిన గురుపూజోత్సవంలో ఆయన పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సోమాయప్ప మహారాజ్ మాట్లాడుతూ.. "అధిక మాసం అంటేనే భగవంతుడికి అత్యంత ప్రీతికరమైనది. ఈ సమయంలో పూజలు చేయకూడదనే ప్రచారాన్ని నమ్మవద్దు. తీర్థయాత్రలు, గురుపూజ, అన్నదానం వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేయడం వల్ల విశేష ఫలితాలు లభిస్తాయి" అని స్పష్టం చేశారు.మానవ జన్మ ఎంతో విలువైనదని, దైవ మార్గంలో పయనిస్తూ జన్మను సార్థకం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఎన్ని యాత్రలు చేసినా తల్లిదండ్రులు, గురువులకు మించిన దైవం లేదని, వారిని సేవించడం ద్వారానే సకల సంతోషాలు కలుగుతాయని ఆయన సూచించారు. అనంతరం శేషు దంపతులను ఆశీర్వదించి



భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ షాజీ పటేల్, సుంకిని మహారాజ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

# రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా అందజేసిన అక్బరుద్దీన్ ఒవైసీ

**హైదరాబాద్, జూన్ 11:**



బండ్లగూడలోని రాయల్ సీ హోటల్ సమీపంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా దురదృష్టవశాత్తు మృతి చెందిన ఇద్దరు యువకుల కుటుంబాలకు AIMIM శాసనసభ పక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించిన ఆయన, వారి పట్ల ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. కుటుంబాలకు పార్టీ తరపున అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఇలాంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా సంబంధిత అధికారులు తగిన భద్రతా చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# ₹300 కోట్లతో భారత్ లో విస్తరణకు EBG- యూనివర్సల్ ఫిట్ నెస్ భాగస్వామ్యం





**హైదరాబాద్, జూన్ 11 :**

EBG గ్రూప్ మరియు ఆస్ట్రేలియాకు చెందిన యూనివర్సల్ ఫిట్‌నెస్ గ్రూప్ కలిసి భారతదేశంలో ప్రీమియం వెల్‌నెస్, ఫిట్‌నెస్ మరియు పునరావాస కేంద్రాల ఏర్పాటుకు ఐదేళ్లలో ₹300 కోట్ల పెట్టుబడి ప్రణాళికను ప్రకటించాయి. ఈ భాగస్వామ్యం కింద 2030 నాటికి దేశవ్యాప్తంగా 30కి పైగా ప్రీమియం హెల్త్ అండ్ వెల్‌నెస్ కేంద్రాలు, రెండు డెస్టినేషన్ వెల్‌నెస్ రిట్రీట్స్ ఏర్పాటు చేయనున్నారు. తొలి దశలో హైదరాబాద్, బెంగళూరులో కేంద్రాలను ప్రారంభించి, అనంతరం ముంబై, ఢిల్లీ–ఎన్‌సీఆర్, పూణే తదితర నగరాలకు విస్తరించనున్నారు. ప్రతి కేంద్రం 40,000 నుంచి 45,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు కానుండగా, ఫిట్‌నెస్ ట్రైనింగ్, పైలేట్స్, స్విమ్మింగ్, ఫిజియోథెరపీ, స్పోర్ట్స్ రీహాబిలిటేషన్, ఏఐ ఆధారిత ఆరోగ్య విశ్లేషణ, కోల్డ్ ప్లంజ్ థెరపీ, మినరల్ పూల్స్ వంటి ఆధునిక సదుపాయాలు అందుబాటులో ఉంటాయి. ఈ ప్రాజెక్టు ద్వారా వేలాది ఉద్యోగ అవకాశాలు సృష్టించబడనున్నాయని సంస్థలు వెల్లడించాయి. భారత ఫిట్‌నెస్ మార్కెట్ 2030 నాటికి ₹37,700 కోట్లకు చేరుకునే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ విస్తరణ చేపడుతున్నట్లు ప్రతినిధులు తెలిపారు.

# నీతి ఆయోగ్‌లో తెలంగాణ అభివృద్ధి నమూనా వివరించిన సీఎం రేవంత్ రెడ్డి

## దేశ అభివృద్ధికి విద్య, వైద్యమే బలమైన పునాది

**న్యూఢిల్లీ, జూన్ 11:**

దేశ అభివృద్ధికి విద్య, వైద్యమే బలమైన పునాదులని తెలంగాణ ముఖ్యమంత్రి A. Revanth Reddy స్పష్టం చేశారు. రాష్ట్రపతి భవన్‌లో ప్రధానమంత్రి Narendra Modi అధ్యక్షతన జరిగిన 11వ నీతి ఆయోగ్ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న సీఎం, కులగణన అనంతరం తెలంగాణ అభివృద్ధి నమూనాను వివరించారు. వికసిత్ భారత్–2047 లక్ష్య సాధనకు ప్రతి పౌరుడికి నాణ్యమైన విద్య, మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. తెలంగాణలో నిర్వహించిన సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ, కుల సర్వేలో విద్యే సామాజిక వెనుకబాటుతనాన్ని ప్రభావితం చేసే ప్రధాన అంశమని తేలిందన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నామని, ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం, డిజిటల్ తరగతులు, ఉచిత అల్పాహారం, మధ్యాహ్న భోజనం, రవాణా, క్రీడా సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. దేశంలోని ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులు, అధికారులు యంగ్ ఇండియా స్కూల్స్‌ను సందర్శించాలనుకుంటే సంతోషంగా చూపిస్తామని చెప్పారు. ఏఐ యుగానికి అనుగుణంగా యువతకు నైపుణ్యాభివృద్ధి అవసరమని పేర్కొన్న సీఎం, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ద్వారా ప్రపంచ స్థాయి శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోని ఐటీఐలను ఆధునిక సాంకేతిక శిక్షణ కేంద్రాలుగా మార్చేందుకు తో భాగస్వామ్యం కుదుర్చుకున్నామని వెల్లడించారు. 'తెలంగాణ రైజింగ్' విజన్‌లో భాగంగా 2034 నాటికి తెలంగాణను ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు. హైదరాబాద్‌లో ఐఐఎం ఏర్పాటు, రీజినల్ రింగ్ రోడ్, మెట్రో రెండో దశ, మూసీ పునరుజ్జీవనం, పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు, సెమీకండక్టర్ పరిశ్రమల ఏర్పాటుకు కేంద్రం సహకరించాలని కోరారు. దేశ ప్రజల ఆరోగ్యం, విద్యపై ప్రత్యేక దృష్టి పెడితే భారత్ ప్రపంచంలోనే అత్యుత్తమ దేశంగా అవతరిస్తుందని సీఎం రేవంత్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

# హైదరాబాద్‌లో బొగ్గు, లిగ్నైట్ గ్యాసిఫికేషన్ ప్రాజెక్టులపై రోడ్‌షో విజయవంతం




**హైదరాబాద్, జూన్ 11:**

బొగ్గు, లిగ్నైట్ గ్యాసిఫికేషన్ ప్రాజెక్టులపై కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన రోడ్‌షో విజయవంతంగా ముగిసింది. పరిశ్రమల ప్రతినిధులు, పెట్టుబడిదారులు, సాంకేతిక సంస్థలు, ఆర్థిక సంస్థలు, కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ, దేశంలో దాదాపు 400 బిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయని తెలిపారు. బొగ్గును మరింత సమర్థవంతంగా వినియోగించి మెథనాల్, అమోనియా, ఎరువుల ముడి పదార్థాలు, పారిశ్రామిక రసాయనాల ఉత్పత్తికి గ్యాసిఫికేషన్ కీలక మార్గమని అన్నారు. బొగ్గు గ్యాసిఫికేషన్ ద్వారా దిగుమతులపై ఆధారాన్ని తగ్గించి, దేశీయ ఉత్పత్తిని పెంచవచ్చని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ఉపరితల బొగ్గు, లిగ్నైట్ గ్యాసిఫికేషన్ ప్రాజెక్టుల ప్రోత్సాహానికి కేంద్రం భారీ పథకాన్ని ఆమోదించిందని, పరిశ్రమల అభిప్రాయాల కోసం ముసాయిదా ఆర్ఎఫ్‌పీని ప్రజల ముందుంచినట్లు తెలిపారు. రాష్ట్ర మంత్రి సతీష్ చంద్ర దూబే మాట్లాడుతూ, స్వదేశీ వనరులతో ఇంధనాలు, ఎరువులు, రసాయనాలు తయారు చేసుకునే సామర్థ్యం దేశ ఆర్థిక భద్రతకు అవసరమని అన్నారు. బొగ్గు గ్యాసిఫికేషన్ పెట్టుబడులు, ఉపాధి, పారిశ్రామిక వృద్ధికి దోహదపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో బొగ్గు మంత్రిత్వ శాఖ కార్యదర్శి విక్రమ్ దేవ్ దత్, అదనపు కార్యదర్శి సనోజ్ కుమార్ ఝా తదితరులు పాల్గొన్నారు. బీహెచ్ఈఎల్, సీఐఎంఎఫ్ఆర్ స్వదేశీ గ్యాసిఫికేషన్ సాంకేతికతలను ప్రదర్శించాయి. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ రాష్ట్రాలు పెట్టుబడి అవకాశాలను వివరించాయి. రోడ్‌షోలో ప్రాజెక్టు ఫైనాన్సింగ్, సాంకేతిక భాగస్వామ్యం, బొగ్గు లభ్యత, పర్యావరణ అనుమతులు, మౌలిక సదుపాయాలపై చర్చలు జరిగాయి.

# ఆరోగ్యశాఖలో బదిలీలు పూర్తి

**హైదరాబాద్ జూన్11:**

రాష్ట్ర ఆరోగ్యశాఖలో 157 కేడర్లలో మొత్తం 4,869 మంది ఉద్యోగుల బదిలీల ప్రక్రియ విజయవంతంగా పూర్తయింది. వైద్య సేవలకు అంతరాయం కలగకుండా, ఎన్ఎంసీ ప్రమాణాలు మరియు ఆసుపత్రుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని బదిలీలు నిర్వహించారు. పబ్లిక్ హెల్త్ డైరెక్టరేట్ పరిధిలో అత్యధికంగా 2,258 మంది ఉద్యోగులు బదిలీ అయ్యారు. ఒకే స్టేషన్‌లో నాలుగేళ్లకు పైగా పనిచేసిన వారికే అవకాశం కల్పించగా, జిల్లాల్లో వైద్య సేవలను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ ప్రక్రియ చేపట్టింది.

# ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు




**మల్కాజిగిరి,జూన్11:**

వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించి ప్రమాదాల నివారణకు పోలీసులకు సహకరించాలని ఎస్ఐ శ్రీనివాస్ కోరారు. గురువారం తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ మరియు మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "అరైవ్ అలైవ్" రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం మల్కాజిగిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని వెంకటేశ్వర నగర్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి ఎస్ఐ శ్రీనివాస్‌తో పాటు పోలీస్ సిబ్బంది, స్థానిక యువకులు, ప్రజలు పాల్గొన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నిబంధనలపై ప్రజల్లో అవగాహన పెంపొందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని అధికారులు తెలిపారు ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనాల్లో సీట్‌బెల్ట్ వినియోగించాలని సూచించారు. అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, డ్రైవింగ్ చేస్తూ మొబైల్ ఫోన్ వినియోగించడం వంటి చర్యలు ప్రమాదాలకు ప్రధాన కారణమవుతున్నాయని తెలిపారు. డ్రైవింగ్ సమయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల వాహనదారులతో పాటు ఇతరుల ప్రాణాలకు కూడా ముప్పు వాటిల్లుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ట్రాఫిక్ మరియు ఆర్‌టీఏ నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం, మొబైల్ ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపడం చట్టవిరుద్ధమని పేర్కొంటూ, ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించి సురక్షిత ప్రయాణానికి సహకరించాలని ఎస్ఐ శ్రీనివాస్ పిలుపునిచ్చారు

# ఖమ్మం బాలికకు నిమ్స్‌లో ఉచిత చికిత్స: డైరెక్టర్ డాక్టర్ రాహుల్ దేవరాజ్

**హైదరాబాద్, జూన్ 11:**

ఖమ్మం జిల్లాకు చెందిన బాలికకు నిమ్స్ ఆస్పత్రిలో పూర్తిగా ఉచితంగా వైద్యం అందిస్తున్నామని నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాహుల్ దేవరాజ్ తెలిపారు. తీవ్రమైన ఆరోగ్య పరిస్థితిలో బాలిక నిమ్స్‌కు చేరుకోగా, వెంటనే ఆరోగ్యశ్రీ పథకం కింద చేర్పించి అవసరమైన చికిత్స ప్రారంభించామని చెప్పారు. సీటీ స్కాన్, ఎంఆర్ఐ స్కాన్, రక్త పరీక్షలు సహా అన్ని వైద్య పరీక్షలను ఆరోగ్యశ్రీ పరిధిలో ఉచితంగా నిర్వహించామని పేర్కొన్నారు. ప్రస్తుతం బాలిక ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, నిపుణులైన వైద్యుల బృందం నిరంతరం పర్యవేక్షిస్తూ చికిత్స అందిస్తోందన్నారు. బాలిక తల్లిదండ్రులకు వసతి కల్పించడంతో పాటు అవసరమైన అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశామని తెలిపారు. చికిత్స, మందులు, ఆహారం సహా అన్ని సేవలను ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా అందిస్తున్నామని డాక్టర్ రాహుల్ దేవరాజ్ వెల్లడించారు.



# భారీగా తగ్గిన బంగారం ధరలు!

**హైదరాబాద్, జూన్ 11:** అంతర్జాతీయ పరిణామాల ప్రభావంతో బంగారం ధరలు భారీగా తగ్గాయి. ప్రపంచ మార్కెట్లలో ముడి చమురు ధరలు, డాలర్ విలువ, అమెరికా ప్రభుత్వ బాండ్ల దిగుబడులు పెరగడంతో విలువైన లోహాలపై పెట్టుబడిదారుల ఆసక్తి తగ్గింది. దీంతో బంగారం ధరలు వరుసగా రెండో రోజు కూడా క్షీణించాయి. బుధవారం 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధరపై రూ.4,300 తగ్గుదల నమోదవగా, 22 క్యారెట్ల బంగారం ధర రూ.3,950 మేర తగ్గింది. గురువారం కూడా ఇదే ధోరణి కొనసాగింది. 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర మరో రూ.2,130 తగ్గగా, 22 క్యారెట్ల బంగారం ధర రూ.1,950 మేర క్షీణించింది. ప్రస్తుతం హైదరాబాద్ మార్కెట్‌లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,45,640 వద్ద కొనసాగుతోంది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,33,500గా ఉంది. అలాగే 18 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,09,230 వద్ద నమోదైంది. ఇక వెండి ధరల్లో మాత్రం ఎలాంటి మార్పు కనిపించలేదు. గత ధరల వద్దే వెండి కొనసాగుతోంది. బంగారం ధరలు భారీగా తగ్గడంతో కొనుగోలు చేయాలనుకుంటున్న వారికి ఇది అనుకూల సమయంగా మారిందని వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. అయితే బంగారం, వెండి ధరలు అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా ఎప్పటికప్పుడు మారుతూ ఉంటాయి. అందువల్ల కొనుగోలు చేసే ముందు స్థానిక మార్కెట్‌లో తాజా ధరలను ఒకసారి పరిశీలించడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

# ఎల్పీజీ వినియోగదారులకు కేంద్రం షాక్!

## తప్పనిసరిగా పీఎన్‌జీకి మారాలి

**ముంబై, జూన్ 11:** ఎల్పీజీ వినియోగదారులపై కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పైపుల ద్వారా సహజ వాయువు సరఫరా సౌకర్యం అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో నివసించే గృహ వినియోగదారులు తప్పనిసరిగా పీఎన్‌జీ కనెక్షన్‌కు మారాలని కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు ఆయిల్ మార్కెటింగ్ సంస్థలు, నగర గ్యాస్ పంపిణీ సంస్థలు అర్హులైన వినియోగదారులను గుర్తించి నోటీసులు ఇవ్వాలని సూచించింది. కేంద్ర పెట్రోలియం శాఖ కార్యదర్శి డాక్టర్ నీరజ్ మిట్టల్ అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు లేఖ రాసి ఈ విషయాన్ని స్పష్టం చేశారు. పీఎన్‌జీ సౌకర్యం ఉన్నప్పటికీ ఇంకా ఎల్పీజీ సిలిండర్లను వినియోగిస్తున్న కుటుంబాలను గుర్తించి మార్పు ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. ప్రభుత్వ నిర్ణయం ప్రకారం రెండు వర్గాల వినియోగదారులకు నోటీసులు జారీ చేయనున్నారు. ఇప్పటికే ఇంట్లో పీఎన్‌జీ కనెక్షన్ ఉన్నప్పటికీ ఎల్పీజీ కనెక్షన్ కొనసాగిస్తున్న కుటుంబాలు తమ సిలిండర్ కనెక్షన్‌ను తిరిగి అప్పగించాల్సి ఉంటుంది. అలాగే ఇంటి సమీపంలో పీఎన్‌జీ పైప్ లైన్ సౌకర్యం అందుబాటులో ఉన్నప్పటికీ ఇంకా ఎల్పీజీ సిలిండర్లను ఉపయోగిస్తున్న వారిని పీఎన్‌జీకి మారేలా ప్రోత్సహించనున్నారు. సిలిండర్ల అక్రమ విక్రయాలను అరికట్టడం, ఎల్పీజీ వినియోగాన్ని తగ్గించడం, సహజ వాయువు వినియోగాన్ని పెంచడం ఈ నిర్ణయం వెనుక ప్రధాన ఉద్దేశమని అధికారులు చెబుతున్నారు. దీంతో విలువైన ఎల్పీజీ నిల్వలను అవసరమైన ప్రాంతాలకు మళ్లించే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. ప్రస్తుతం అంతర్జాతీయ పరిస్థితుల కారణంగా ఇంధన సరఫరాలపై ఒత్తిడి పెరుగుతోంది. ముఖ్యంగా హోర్ముజ్ జలసంధి ప్రాంతంలో నెలకొన్న ఉద్రిక్తతల ప్రభావం ఇంధన దిగుమతులపై పడుతోంది. భారత్‌కు వచ్చే ఎల్పీజీ దిగుమతుల్లో అధిక భాగం ఈ మార్గం ద్వారానే చేరుతోంది. భారత్ తన మొత్తం ఎల్పీజీ అవసరాల్లో సుమారు 60 శాతం దిగుమతులపైనే ఆధారపడుతోంది. ఈ నేపథ్యంలో దిగుమతులపై ఆధారపడడాన్ని తగ్గించేందుకు దేశీయ ఉత్పత్తిని పెంచడంతో పాటు ప్రత్యామ్నాయ ఇంధనాల వినియోగాన్ని ప్రోత్సహించే చర్యలను కేంద్ర ప్రభుత్వం చేపడుతోంది. ఇంధన భద్రత, విదేశీ మారకద్రవ్య ఆదా, పర్యావరణ పరిరక్షణ లక్ష్యాలతో కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం రానున్న రోజుల్లో దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చే అవకాశం ఉంది.




# ఇథనాల్ పెట్రోల్‌కు భారీ ఊరట!

## కేంద్రం కీలక నిర్ణయం

**ముంబై, జూన్ 11:** ఇథనాల్ కలిపిన పెట్రోల్‌పై కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. 22 శాతం నుంచి 30 శాతం వరకు ఇథనాల్ మిశ్రమం కలిగిన పెట్రోల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని పూర్తిగా మినహాయిస్తూ అధికారిక ప్రకటన విడుదల చేసింది. భారత ప్రమాణాల సంస్థ నిర్దేశించిన నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉండే ఇంధనాలకు ఈ రాయితీ వర్తించనుంది. ముడి చమురు దిగుమతులపై ఆధారపడడాన్ని తగ్గించడం, దేశీయంగా లభించే జీవ ఇంధనాల వినియోగాన్ని ప్రోత్సహించడం లక్ష్యంగా కేంద్రం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ చర్యతో ఇథనాల్ ఆధారిత ఇంధనాల వినియోగం మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇథనాల్ మిశ్రమ ఇంధనాలకు పన్ను మినహాయింపు ఇవ్వడం వల్ల మార్కెట్‌లో వాటి లభ్యత పెరగడంతో పాటు భవిష్యత్తులో వాహనదారులపై ఇంధన ధరల భారం కొంత మేర తగ్గే అవకాశం ఉందని నిపుణులు భావిస్తున్నారు. అలాగే పెట్రోలియం ఉత్పత్తుల దిగుమతులపై విదేశీ మారక ద్రవ్య వ్యయం తగ్గడంతో పాటు చెరకు, మొక్కజొన్న వంటి పంటలు పండించే రైతులకు కూడా ప్రయోజనం చేకూరనుంది. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు పెరుగుతున్న నేపథ్యంలో కేంద్రం ఇప్పటికే గతంలో పెట్రోల్, డీజిల్‌పై



ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించిన విషయం తెలిసిందే. అయితే పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితుల కారణంగా ఇంధన సరఫరాలపై ఒత్తిడి పెరుగుతోంది. ఇటీవల హోర్ముజ్ జలసంధి ప్రాంతంలో చమురు ట్యాంకర్లపై దాడులు జరగడం, అంతర్జాతీయ స్థాయిలో ఉద్రిక్తతలు పెరగడం వల్ల ముడి చమురు ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ ఇంధనాల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు కేంద్రం తీసుకున్న తాజా నిర్ణయం కీలకంగా మారింది. ఇథనాల్ మిశ్రమ ఇంధనాల వినియోగం పెరగడం ద్వారా చమురు దిగుమతులపై ఆధారపడడం తగ్గడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా దోహదపడుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# నష్టాల్లో ముగిసిన సూచీలు



ముంబై, జూన్ 11: అంతర్జాతీయ ఉద్రిక్తతలు, ముడి చమురు ధరల పెరుగుదల ప్రభావంతో దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం నష్టాల్లో ముగిశాయి. ప్రపంచ మార్కెట్లలో నెలకొన్న అనిశ్చిత పరిస్థితులు, విదేశీ మదుపర్ల విక్రయాలు, రూపాయి బలహీనత వంటి అంశాలు మార్కెట్‌పై ప్రతికూల ప్రభావం చూపించాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు 1.7 శాతం పెరిగి బ్యారెల్‌కు 94.68 డాలర్లకు చేరుకున్నాయి. దీంతో డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ బలహీనపడి 95.76 వద్ద కొనసాగింది. ఇదే సమయంలో విదేశీ మదుపర్లు భారీగా షేర్ల విక్రయాలకు దిగడంతో మార్కెట్‌పై ఒత్తిడి పెరిగింది. బుధవారం ఒక్కరోజే విదేశీ మదుపర్లు రూ.2,124 కోట్ల విలువైన షేర్లను విక్రయించినట్లు సమాచారం. గత సెషన్ ముగింపుతో పోలిస్తే సెన్సెక్స్ ఉదయం ప్రారంభంలోనే దాదాపు 300 పాయింట్లు నష్టపోయింది. మధ్యాహ్నం సమయంలో కొంత కోలుకుని లాభాల్లోకి వచ్చినప్పటికీ, చివరి గంటలో అమ్మకాలు పెరగడంతో మళ్లీ నష్టాల్లోకి జారుకుంది. చివరకు సెన్సెక్స్ 150 పాయింట్లు క్షీణించి 73,832 వద్ద ముగిసింది. నిఫ్టీ కూడా ఇదే ధోరణిని అనుసరించింది. రోజంతా హెచ్చుతగ్గులకు లోనైన నిఫ్టీ చివరకు 53 పాయింట్లు నష్టపోయి 23,161 వద్ద స్థిరపడింది. వ్యక్తిగత షేర్ల పరంగా చూస్తే హ్యుందాయ్ మోటార్స్, టొరెంట్ ఫార్మా, వొడాఫోన్ ఐడియా, వేదాంత, ఐసీఐసీఐ బ్యాంక్ షేర్లు లాభాల్లో ముగిశాయి. మరోవైపు అదానీ ఎనర్జీ, అంబర్ ఎంటర్‌ప్రైజెస్, పవర్ ఫైనాన్స్, పేటీఎం, సమ్మన్ క్యాపిటల్ షేర్లు నష్టాలను చవిచూశాయి. అలాగే బ్యాంకింగ్ రంగ సూచీ కూడా ఒత్తిడికి లోనైంది. బ్యాంక్ నిఫ్టీ 76 పాయింట్లు తగ్గి ముగిసింది. అంతర్జాతీయ పరిస్థితులు, ముడి చమురు ధరల కదలికలు, విదేశీ మదుపర్ల పెట్టుబడి ధోరణి రానున్న రోజుల్లో మార్కెట్ దిశను నిర్ణయించే అవకాశముందని మార్కెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# భారత్‌లో కార్యకలాపాలకు గుడ్‌బై!

## 250 మందికి ఉద్యోగాల కోత

**న్యూఢిల్లీ, జూన్ 11:** అమెరికాకు చెందిన ప్రముఖ సాంకేతిక సంస్థ ఓపెన్‌డోర్ భారత్‌లో తన కార్యకలాపాలను నిలిపివేయాలని నిర్ణయించింది. సంస్థ తీసుకున్న ఈ నిర్ణయం రియల్ ఎస్టేట్ సాంకేతిక రంగంలో పెద్ద చర్చకు దారి తీసింది. అంతర్జాతీయ వ్యాపార వ్యూహంలో భాగంగానే ఈ మార్పులు చేపడుతున్నట్లు సంస్థ వెల్లడించింది. ఈ నిర్ణయంతో భారత్‌లో పనిచేస్తున్న సుమారు 250 మంది ఉద్యోగులు తమ ఉపాధిని కోల్పోనున్నారు. అకస్మాత్తుగా తీసుకున్న ఈ నిర్ణయం ఉద్యోగులతో పాటు పరిశ్రమ వర్గాలను కూడా ఆశ్చర్యానికి గురిచేసింది. సంస్థ ప్రతినిధులు తెలిపిన వివరాల ప్రకారం, ప్రపంచవ్యాప్తంగా తమ వ్యాపార కార్యకలాపాలను అమెరికాకే పరిమితం చేయాలనే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. కృత్రిమ మేధ సాంకేతికత వినియోగాన్ని మరింత విస్తరించడం, ఖర్చులను తగ్గించడం, కార్యకలాపాలను ఒకే కేంద్రం నుంచి నిర్వహించడం వంటి అంశాలు ప్రధాన కారణాలుగా పేర్కొన్నారు. ఉద్యోగుల పనితీరు కారణంగా ఈ నిర్ణయం తీసుకోలేదని సంస్థ స్పష్టం చేసింది. భవిష్యత్తులో లాభదాయకమైన వ్యాపార అవకాశాలపై పూర్తిస్థాయిలో దృష్టి సారించేందుకు సంస్థ పునర్వ్యవస్థీకరణ చేపడుతున్నట్లు వెల్లడించింది. ఉద్యోగాలు కోల్పోయిన సిబ్బందికి ఆర్థిక సహాయం




అందించనున్నట్లు సంస్థ ప్రకటించింది. అలాగే కొత్త ఉద్యోగ అవకాశాలు పొందేందుకు అవసరమైన మార్గదర్శకత్వం, వృత్తి సంబంధిత సహాయాన్ని కూడా అందించనున్నట్లు తెలిపింది. కష్టకాలంలో ఉద్యోగులకు అండగా నిలవడం తమ బాధ్యతగా భావిస్తున్నామని సంస్థ పేర్కొంది. మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా భవిష్యత్తులో మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రయత్నాలు కొనసాగిస్తామని హామీ ఇచ్చింది. ఓపెన్‌డోర్ తీసుకున్న ఈ నిర్ణయం ప్రపంచవ్యాప్తంగా సాంకేతిక సంస్థలు వ్యయ నియంత్రణ, కృత్రిమ మేధ ఆధారిత వ్యవస్థల వైపు వేగంగా అడుగులు వేస్తున్నాయనే విషయాన్ని మరోసారి స్పష్టం చేస్తోందని పరిశ్రమ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# దేశ తొలి బుల్లెట్ రైలుకు ముహూర్తం ఖరారు..! 2027లో ప్రారంభం

**ముంబై, జూన్ 11:** దేశంలో తొలి బుల్లెట్ రైలు ప్రారంభానికి కేంద్ర ప్రభుత్వం ముహూర్తం ఖరారు చేసింది. ముంబై--అహ్మదాబాద్ హైస్పీడ్ రైలు మార్గంలో తొలి బుల్లెట్ రైలును 2027 ఆగస్టు 15న ప్రారంభించనున్నట్లు రైల్వే శాఖ ప్రకటించింది. ఈ విషయాన్ని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ వెల్లడించారు. దేశవ్యాప్తంగా హైస్పీడ్ రైలు మార్గాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోంది. ఇప్పటికే పలు బుల్లెట్ రైలు మార్గాల కోసం సర్వేలు, భూసేకరణ, ప్రణాళికల తయారీ పనులు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో దేశ ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్న తొలి బుల్లెట్ రైలు ప్రారంభ తేదీపై స్పష్టత వచ్చింది. ముంబై--అహ్మదాబాద్ బుల్లెట్ రైలు మార్గం మొత్తం 508 కిలోమీటర్ల పొడవు కలిగి ఉంటుంది. ఈ ప్రాజెక్టు జపాన్‌కు చెందిన అత్యాధునిక సాంకేతికత ఆధారంగా నిర్మితమవుతోంది. రైలు గంటకు అత్యధిక వేగంతో ప్రయాణించేలా రూపకల్పన చేస్తున్నారు. ఈ మార్గంలో అహ్మదాబాద్, సబర్మతి, ఆనంద్, వడోదర, భరూచ్, సూరత్, బిలిమోరా, వాపి, బోయిసర్, థానే, ముంబై సహా మొత్తం 12 స్టేషన్లు ఉండనున్నాయి. ప్రాజెక్టు పూర్తయిన తర్వాత ముంబై నుంచి అహ్మదాబాద్‌కు ప్రయాణ సమయం రెండు గంటలలోపే పూర్తయ్యే అవకాశం ఉంది. దేశీయ సాంకేతికతతో రూపొందిస్తున్న బుల్లెట్ రైలు రేకులను భారతీయ సంస్థ తయారు చేస్తోంది. ఈ ప్రాజెక్టును దశలవారీగా పూర్తి చేయాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. పూర్తయిన మార్గాల్లో ముందుగా రైలు సేవలను ప్రారంభించి, అనంతరం మొత్తం కారిడార్‌ను అందుబాటులోకి తీసుకురానున్నారు. దేశ రవాణా రంగంలో ఇది చారిత్రాత్మక అడుగుగా నిలవనుందని, బుల్లెట్ రైలు ప్రారంభంతో ప్రయాణ రంగంలో కొత్త అధ్యాయం మొదలుకానుందని రైల్వే వర్గాలు పేర్కొంటున్నాయి.



# 350 పరుగుల లక్ష్యం!

## ఆఫ్ఘన్ ముందు భారత్ భారీ స్కోరు




ముక్కోణపు సిరీస్‌లో భాగంగా ఆఫ్ఘనిస్తాన్-ఏ జట్టుతో జరుగుతున్న మ్యాచ్‌లో భారత్-ఏ జట్టు భారీ స్కోరు నమోదు చేసింది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్-ఏ నిర్ణీత 49 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 349 పరుగులు చేసింది. దీంతో ఆఫ్ఘనిస్తాన్-ఏ జట్టు విజయానికి 350 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. టాస్ గెలిచిన ఆఫ్ఘనిస్తాన్-ఏ జట్టు ముందుగా భారత్‌ను బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. ఇన్నింగ్స్ ఆరంభం నుంచే యువ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ దూకుడుగా ఆడాడు. కేవలం 22 బంతుల్లోనే 44 పరుగులు చేసి ప్రత్యర్థి బౌలర్లపై ఎదురుదాడికి దిగాడు. భారీ ఇన్నింగ్స్ ఆడేలా కనిపించినప్పటికీ అనూహ్యంగా ఔటయ్యాడు. మరో ఓపెనర్ ప్రభుసిమ్రన్ సింగ్ అద్భుతంగా బ్యాటింగ్ చేసి 84 పరుగులు సాధించాడు. మధ్య వరుసలో రుతురాజ్ గైక్వాడ్, తిలక్ వర్మ కీలక ఇన్నింగ్స్ ఆడుతూ జట్టుకు బలమైన పునాది వేశారు. ఈ ఇద్దరూ నాలుగో వికెట్‌కు 78 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి జట్టు స్కోరును ముందుకు నడిపించారు. చివర్లో సూర్యాంశ్ షెడ్జ్ వేగంగా పరుగులు సాధించి భారత్‌కు భారీ స్కోరు అందించాడు. 27 బంతుల్లో 40 పరుగులు చేసి జట్టు స్కోరు బోర్డును పరుగెత్తించాడు. భారత్-ఏ తరఫున ప్రభుసిమ్రన్ సింగ్, రుతురాజ్ గైక్వాడ్, తిలక్ వర్మ అర్ధశతకాలతో మెరిశారు. ఆఫ్ఘనిస్తాన్-ఏ బౌలర్లలో అబ్దుల్లా అహ్మద్‌జాయ్ అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి 5 వికెట్లు పడగొట్టాడు. ఇప్పటికే శ్రీలంక-ఏపై జరిగిన తొలి మ్యాచ్‌లో విజయం సాధించిన భారత్-ఏ జట్టు, ఈ మ్యాచ్‌లో కూడా ఆధిపత్యం చాటేందుకు సిద్ధమవుతోంది. ఇక 350 పరుగుల భారీ లక్ష్యాన్ని ఆఫ్ఘనిస్తాన్-ఏ జట్టు ఎలా ఛేదిస్తుందో ఆసక్తికరంగా మారింది.

## ఆస్ట్రేలియా జట్టులో భారత క్రికెటర్..! 60 ఏళ్ల తర్వాత అరుదైన ఘనత

భారత సంతతికి చెందిన క్రికెటర్ నిఖిల్ చౌదరీ ఆస్ట్రేలియా జాతీయ జట్టులో చోటు దక్కించుకుని అరుదైన ఘనత సాధించాడు. బంగ్లాదేశ్‌తో జరగనున్న టీ20 సిరీస్‌కు ఎంపికైన నిఖిల్, తుది జట్టులో అవకాశం దక్కితే వచ్చే వారం అంతర్జాతీయ క్రికెట్‌లో ఆస్ట్రేలియా తరఫున అరంగేట్రం చేయనున్నాడు. దాదాపు ఆరు దశాబ్దాల తర్వాత భారత మూలాలు కలిగిన ఓ పురుష క్రికెటర్ ఆస్ట్రేలియా జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్న నేపథ్యంలో ఈ ఎంపికకు ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది. ప్రస్తుతం నిఖిల్ హోబార్ట్ హరికేన్స్ జట్టు తరఫున దేశీయ క్రికెట్ ఆడుతున్నాడు. ఇటీవల బెల్జియంలో జరుగుతున్న ఈయూ20 పోటీల్లో జేబీ బ్రూగ్స్ జట్టు తరఫున కూడా అతను ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. ఎడమచేతి స్పిన్ బౌలర్‌గా గుర్తింపు పొందిన నిఖిల్ అవసరమైన సమయంలో విలువైన పరుగులు చేయగల సమర్థుడైన బ్యాటర్ కూడా. బంగ్లాదేశ్‌తో జూన్ 17 నుంచి 21 వరకు జరిగే టీ20 సిరీస్‌లో మధ్యవరుస స్థానం కోసం జోయెల్ డేవిస్, ఆరన్ హార్డీతో నిఖిల్ పోటీ పడనున్నాడు. బిగ్ బాష్ లీగ్‌లో అతను కనబర్చిన అద్భుత ప్రదర్శనను దృష్టిలో ఉంచుకుని ఎంపిక చేసినట్లు ఆస్ట్రేలియా ఎంపిక కమిటీ వెల్లడించింది. గతంలో కూడా భారత సంతతికి చెందిన కొందరు ఆటగాళ్లు ఆస్ట్రేలియా తరఫున ఆడారు. అయితే వారిలో ఎక్కువ మంది 1960ల కంటే ముందు జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. చివరిసారిగా 1964లో భారత మూలాలు కలిగిన రెక్స్ సెల్లార్స్ ఆస్ట్రేలియా తరఫున ఆడినట్లు రికార్డులు చెబుతున్నాయి. 30 ఏళ్ల నిఖిల్ చౌదరీ ఢిల్లీలో జన్మించాడు. భారతదేశంలో పంజాబ్ తరఫున 14 జాబితా-ఏ మ్యాచ్‌లు ఆడిన అనుభవం అతనికి ఉంది. కరోనా కాలంలో ఆస్ట్రేలియాలోని తన బంధువుల వద్దకు వెళ్లిన నిఖిల్ అక్కడే క్రికెట్



కొనసాగించాడు. అనంతరం దేశీయ క్రికెట్‌లో మెరుగైన ప్రదర్శనతో గుర్తింపు తెచ్చుకున్నాడు.గత బిగ్ బాష్ సీజన్‌లో 307 పరుగులు చేసి హోబార్ట్ హరికేన్స్ జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించాడు. ఇప్పుడు ఆస్ట్రేలియా జాతీయ జట్టులో చోటు దక్కించుకోవడంతో అతని క్రికెట్ ప్రయాణం కొత్త మలుపు తిరిగింది. అభిమానులు అతని అరంగేట్రం కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## 350 పరుగుల లక్ష్యం..! ఆఫ్ఘన్ ముందు భారత్ భారీ స్కోరు

**న్యూఢిల్లీ, మే 23 :** ముక్కోణపు సిరీస్‌లో భాగంగా ఆఫ్ఘనిస్తాన్-ఏ జట్టుతో జరుగుతున్న మ్యాచ్‌లో భారత్-ఏ జట్టు భారీ స్కోరు నమోదు చేసింది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్-ఏ నిర్ణీత 49 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 349 పరుగులు చేసింది. దీంతో ఆఫ్ఘనిస్తాన్-ఏ జట్టు విజయానికి 350 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. టాస్ గెలిచిన ఆఫ్ఘనిస్తాన్-ఏ జట్టు ముందుగా భారత్‌ను బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. ఇన్నింగ్స్ ఆరంభం నుంచే యువ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ దూకుడుగా ఆడాడు. కేవలం 22 బంతుల్లోనే 44 పరుగులు చేసి ప్రత్యర్థి బౌలర్లపై ఎదురుదాడికి దిగాడు. భారీ ఇన్నింగ్స్ ఆడేలా కనిపించినప్పటికీ అనూహ్యంగా ఔటయ్యాడు. మరో ఓపెనర్ ప్రభుసిమ్రన్ సింగ్ అద్భుతంగా బ్యాటింగ్ చేసి 84 పరుగులు సాధించాడు. మధ్య వరుసలో రుతురాజ్ గైక్వాడ్, తిలక్ వర్మ కీలక ఇన్నింగ్స్ ఆడుతూ జట్టుకు బలమైన పునాది వేశారు. ఈ ఇద్దరూ నాలుగో వికెట్‌కు 78 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పి జట్టు స్కోరును ముందుకు నడిపించారు. చివర్లో సూర్యాంశ్ షెడ్జ్ వేగంగా పరుగులు సాధించి భారత్‌కు భారీ స్కోరు అందించాడు. 27 బంతుల్లో 40 పరుగులు చేసి జట్టు స్కోరు బోర్డును పరుగెత్తించాడు. భారత్-ఏ తరఫున ప్రభుసిమ్రన్ సింగ్, రుతురాజ్ గైక్వాడ్, తిలక్ వర్మ




అర్ధశతకాలతో మెరిశారు. ఆఫ్ఘనిస్తాన్-ఏ బౌలర్లలో అబ్దుల్లా అహ్మద్‌జాయ్ అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి 5 వికెట్లు పడగొట్టాడు. ఇప్పటికే శ్రీలంక-ఏపై జరిగిన తొలి మ్యాచ్‌లో విజయం సాధించిన భారత్-ఏ జట్టు, ఈ మ్యాచ్‌లో కూడా ఆధిపత్యం చాటేందుకు సిద్ధమవుతోంది. ఇక 350 పరుగుల భారీ లక్ష్యాన్ని ఆఫ్ఘనిస్తాన్-ఏ జట్టు ఎలా ఛేదిస్తుందో ఆసక్తికరంగా మారింది.

## ప్రపంచకప్‌కు వీడ్కోలు చెప్పనున్న దిగ్గజాలు..! ఇదే చివరి పోరు



ఫిఫా ప్రపంచకప్ 2026 ప్రారంభానికి రంగం సిద్ధమవుతున్న వేళ ప్రపంచ ఫుట్‌బాల్ అభిమానుల్లో ఉత్కంఠ నెలకొంది. ఈ మెగా టోర్నీ కేవలం ప్రపంచ విజేతను నిర్ణయించడమే కాకుండా ఓ స్వర్ణయుగానికి ముగింపు పలకనుంది. గత రెండు దశాబ్దాలుగా ప్రపంచ ఫుట్‌బాల్‌ను శాసించిన పలువురు దిగ్గజ ఆటగాళ్లకు ఇదే చివరి ప్రపంచకప్‌గా నిలిచే అవకాశం ఉంది. అర్జెంటీనా కెప్టెన్ లియోనెల్ మెస్సీ ఇప్పటికే ప్రపంచకప్ గెలిచి తన కలను సాకారం చేసుకున్నాడు. 2022లో జట్టుకు టైటిల్ అందించిన మెస్సీ, ఇప్పుడు వం-సగా రెండోసారి అర్జెంటీనాను విజేతగా నిలపాలనే లక్ష్యంతో బరిలోకి దిగనున్నాడు. ఫుట్‌బాల్ చరిత్రలో అత్యుత్తమ ఆటగాళ్లలో ఒకరిగా గుర్తింపు పొందిన మెస్సీకి ఇది చివరి ప్రపంచకప్ అయ్యే అవకాశం ఉందని భావిస్తున్నారు. పోర్చుగల్ స్టార్ క్రిస్టియానో రొనాల్డోకు మాత్రం ప్రపంచకప్ ఇంకా అందని కలగానే మిగిలిపోయింది. ఎన్నో రికార్డులు, ట్రోఫీలు గెలిచిన రొనాల్డో తన కెరీర్‌లో ప్రపంచకప్‌ను మాత్రమే అందుకోలేకపోయాడు. 41 ఏళ్ల వయసులో బరిలోకి దిగుతున్న అతనికి ఈ టోర్నీ చివరి అవకాశం కానుంది. క్రొయేషియా దిగ్గజం లూకా మోడ్రిచ్ కూడా తన చివరి ప్రపంచకప్ ఆడనున్నాడు. 2018లో జట్టును ఫైనల్‌కు చేర్చిన మోడ్రిచ్, ఇప్పటికీ క్రొయేషియా జట్టుకు కీలక శక్తిగా కొనసాగుతున్నాడు. ఈ టోర్నీతో అతని అద్భుతమైన అంతర్జాతీయ కెరీర్ ముగిసే అవకాశం ఉంది. జర్మనీ స్టార్ థామస్ ముల్లర్ కూడా చివరిసారి ప్రపంచకప్ వేదికపై కనిపించనున్నాడు. 2014లో జర్మనీ విజయంలో కీలక పాత్ర పోషించిన ముల్లర్, తన అనుభవంతో మరోసారి జట్టుకు సేవలందించేందుకు సిద్ధమయ్యాడు. బ్రెజిల్ స్టార్ నెయ్‌మార్ ఇప్పటికే 2026 ప్రపంచకప్ తన కెరీర్‌లో చివరిదని సంకేతాలు ఇచ్చాడు. బ్రెజిల్ తరఫున అత్యధిక గోల్స్ చేసిన ఆటగాడిగా నిలిచిన నెయ్‌మార్, ఆరో ప్రపంచకప్ టైటిల్‌ను దేశానికి అందించాలనే లక్ష్యంతో చివరిసారి బరిలోకి దిగనున్నాడు. మెస్సీ, రొనాల్డో, మోడ్రిచ్, ముల్లర్, నెయ్‌మార్ వంటి దిగ్గజాల కోసం ఈ ప్రపంచకప్ మరింత ప్రత్యేకంగా మారింది. ప్రపంచ విజేత ఎవరో తేలడమే కాకుండా, ఫుట్‌బాల్ చరిత్రలో ఓ గొప్ప తరం ఆటగాళ్లకు వీడ్కోలు పలికే వేదికగా కూడా ఈ టోర్నీ నిలవనుంది.

## 2027 ప్రపంచకప్‌కు రోహిత్, కోహ్లీ అవసరం!

### రైనా అభిప్రాయం

2027 వన్డే ప్రపంచకప్‌లో భారత జట్టుకు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ అనుభవం ఎంతో కీలకమని మాజీ క్రికెటర్ సురేశ్ రైనా అభిప్రాయపడ్డాడు. యువ కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కు ఈ ఇద్దరు సీనియర్ ఆటగాళ్లు అండగా ఉంటే జట్టు మరింత బలంగా మారుతుందని పేర్కొన్నాడు. పెద్ద టోర్నీల్లో అనుభవం అత్యంత ముఖ్యమని రైనా చెప్పాడు. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఇప్పటికే ఇరవై ఓవర్ల, టెస్టు క్రికెట్‌కు వీడ్కోలు పలికి ప్రస్తుతం వన్డేలపై దృష్టి సారించిన విషయం తెలిసిందే. ప్రపంచకప్‌లలో ఈ ఇద్దరికీ అద్భుతమైన రికార్డులు ఉన్నాయని గుర్తు చేశాడు 2019 ప్రపంచకప్‌లో రోహిత్ శర్మ అత్యధిక పరుగులు సాధించగా, 2023 ప్రపంచకప్‌లో విరాట్ కోహ్లీ టోర్నీ అత్యధిక పరుగుల వీరుడిగా నిలిచాడని రైనా వివరించాడు. అంతర్జాతీయ క్రికెట్ మండలి నిర్వహించే ప్రధాన టోర్నీల్లో విజయం సాధించిన అనుభవం వారికి ఉందని, కీలక నాకౌట్ మ్యాచ్‌ల ఒత్తిడిని ఎలా ఎదుర్కోవాలో వారికి బాగా తెలుసని చెప్పాడు. అలాంటి ఆటగాళ్లు జట్టులో ఉండటం యువ క్రికెటర్లకు కూడా ఎంతో ఉపయోగకరమని రైనా అభిప్రాయపడ్డాడు. శుభ్‌మన్ గిల్ తొలిసారి ప్రపంచకప్‌లో భారత జట్టుకు నాయకత్వం వహించే అవకాశం ఉన్న నేపథ్యంలో రోహిత్, కోహ్లీ సలహాలు అతడికి ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నాడు. ఇదే సమయంలో మాజీ కెప్టెన్ అనిల్ కుంబ్లే కూడా గిల్‌పై ప్రశంసలు కురిపించాడు. నాయకత్వ బాధ్యతలు వచ్చినప్పటికీ గిల్ బ్యాటింగ్‌పై ఎలాంటి ప్రభావం పడలేదని అన్నాడు. ఇటీవల జరిగిన లీగ్ పోటీల్లో కూడా అతడు ఒత్తిడిని సమర్థంగా ఎదుర్కొంటూ అద్భుత ప్రదర్శన చేశాడని కొనియాడాడు. గిల్‌కు అనుభవజ్ఞులైన ఆటగాళ్ల మద్దతు ఉండటం పెద్ద బలమని కుంబ్లే పేర్కొన్నాడు. రోహిత్, కోహ్లీ వంటి ఆటగాళ్లు మైదానంలో ఉండటం వల్ల ఫీల్డింగ్ అమరికలు, బౌలింగ్ మార్పులు, వ్యూహాత్మక నిర్ణయాల్లో యువ కెప్టెన్‌కు సహకారం అందుతుందని చెప్పాడు. అందువల్ల నాయకత్వ బాధ్యతల భారం పూర్తిగా గిల్‌పైనే పడదని, సీనియర్ల అనుభవం భారత జట్టుకు 2027 ప్రపంచకప్‌లో కీలకంగా మారే అవకాశం ఉందని క్రికెట్ వర్గాలు భావిస్తున్నాయి.


## వింబుల్డన్‌లో రికార్డు బహుమతి..! విజేతకు రూ.40 కోట్లు

ప్రపంచ ప్రఖ్యాత వింబుల్డన్ టెన్నిస్ టోర్నీలో ఈసారి రికార్డు స్థాయిలో బహుమతి నగదును ప్రకటించారు. పురుషుల, మహిళల సింగిల్స్ విజేతలకు 48 లక్షల డాలర్ల బహుమతి అందించనుండగా, ఇది భారత కరెన్సీలో సుమారు రూ.40 కోట్లకు సమానం. టోర్నీ తొలి రౌండ్‌లోనే ఓడిపోయిన ఆటగాళ్లకు కూడా కనీసంగా 80 వేల పౌండ్ల పారితోషికం అందించనున్నారు.




అర్హత పోటీల కోసం సుమారు 60 లక్షల పౌండ్లను కేటాయించిన నిర్వాహకులు, గత ఏడాదితో పోలిస్తే 25 శాతం పెంపు చేసినట్లు తెలిపారు. ఈ ఏడాది మొత్తం బహుమతి నగదు 64.2 మిలియన్ పౌండ్లకు చేరుకుంది. వింబుల్డన్ చరిత్రలోనే ఇదే అత్యధిక బహుమతి నగదని నిర్వాహకులు వెల్లడించారు. ఆల్ ఇంగ్లండ్ క్లబ్ చైర్ దెబోరా జీవన్స్ మాట్లాడుతూ ఆటగాళ్ల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని రౌండ్లలోనూ పారితోషికాలను పెంచినట్లు తెలిపారు. టోర్నీ ఆదాయంలో మరింత వాటా ఆటగాళ్లకు ఇవ్వాలన్న డిమాండ్లను కూడా పరిశీలిస్తున్నామని పేర్కొన్నారు. ఇటీవల ముగిసిన ఫ్రెంచ్ ఓపెన్‌లో బహుమతి నగదు 9.5 శాతం పెరిగినప్పటికీ, పలువురు ఆటగాళ్లు అసంతృప్తి వ్యక్తం చేశారు. కొందరు నిరసనలు కూడా చేపట్టారు. గత ఏడాది యూఎస్ ఓపెన్‌లో బహుమతి నగదు 20 శాతం పెంచగా, ఈ ఏడాది వివరాలను త్వరలో ప్రకటించనున్నారు. గత ఏడాది వింబుల్డన్ పురుషుల సింగిల్స్ విభాగంలో జానిక్ సిన్నర్ విజేతగా నిలిచాడు. మహిళల సింగిల్స్‌లో ఇగా స్వియాటెక్ టైటిల్ కైవసం చేసుకుంది. ఈసారి రికార్డు స్థాయి బహుమతులతో వింబుల్డన్ మరింత ఆసక్తికరంగా మారనుంది.

# ఎన్‌బీకే 111 గ్లింప్స్‌పై చర్చ!




## ఓజీ, సలార్ పోలికలు

నందమూరి బాలకృష్ణ పుట్టినరోజు సందర్భంగా విడుదలైన ఎన్‌బీకే111 తొలి గ్లింప్స్ ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. దర్శకుడు గోపీచంద్ మలినేని తెరకెక్కిస్తున్న ఈ భారీ యాక్షన్ చిత్రంలో బాలకృష్ణ సరికొత్త స్టైలిష్ అవతారంలో కనిపించడంతో అభిమానుల్లో ఉత్సాహం నెలకొంది. గ్లింప్స్ విడుదలైన కొద్ది గంటల్లోనే లక్షలాది వీక్షణలు సాధించి చిత్రంపై అంచనాలను మరింత పెంచింది. గ్లింప్స్ ప్రారంభంలో 1993 ముంబై నేపథ్యంలో కథ సాగనున్నట్లు సూచించే దృశ్యాలు ఆకట్టుకున్నాయి. నగర వీధులు, నేర ప్రపంచానికి సంబంధించిన వాతావరణాన్ని ప్రతిబింబించే సన్నివేశాలు ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచాయి. అయితే ఈ దృశ్యాలను చూసిన కొందరు ప్రేక్షకులు పవన్ కళ్యాణ్ నటిస్తున్న 'ఓజీ' చిత్రాన్ని గుర్తు చేస్తున్నాయని వ్యాఖ్యానిస్తున్నారు. ముఖ్యంగా వర్షంలో బాలకృష్ణ నడుచుకుంటూ వచ్చే సన్నివేశాలు, కాళ్లను మాత్రమే చూపించే దృశ్యాలు, ఆయుధంతో కనిపించే ఎలివేషన్ షాట్లు సామాజిక మాధ్యమాల్లో చర్చకు దారి తీశాయి. బైక్‌పై బాలకృష్ణ ప్రవేశించే దృశ్యం కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అయితే బాలకృష్ణ అభిమానులు మాత్రం ఈ పోలికలను పూర్తిగా ఖండిస్తున్నారు. గోపీచంద్ మలినేని తనదైన శైలిలో బాలకృష్ణను కొత్త కోణంలో చూపిస్తున్నారని, యాక్షన్ చిత్రాల్లో కనిపించే కొన్ని సాధారణ అంశాలను ఆధారంగా చేసుకుని పోలికలు తేవడం సరైంది కాదని అభిప్రాయపడుతున్నారు. గ్లింప్స్ చివర్లో భారీ యంత్రంపై బాలకృష్ణ నిలబడి కనిపించే దృశ్యం కూడా విశేషంగా ఆకట్టుకుంది. ఈ సన్నివేశం కొందరికి 'సలార్' చిత్రంలోని ఎలివేషన్ దృశ్యాలను గుర్తు చేస్తోందని వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. భారీ యాక్షన్, గంభీరమైన దృశ్య నిర్మాణం, శక్తివంతమైన ప్రదర్శన కారణంగా ఈ పోలికలు వస్తున్నాయని సినీ వర్గాలు భావిస్తున్నాయి. అయితే ఇది కేవలం తొలి గ్లింప్స్ మాత్రమే కావడంతో పూర్తి కథ, పాత్రల స్వభావం, చిత్ర కథనం గురించి ఇప్పుడే నిర్ణయానికి రావడం కష్టమని విశ్లేషకులు చెబుతున్నారు. మొత్తంగా గ్లింప్స్ మాత్రం ప్రేక్షకుల్లో భారీ ఆసక్తిని రేకెత్తించి, ఎన్‌బీకే111పై అంచనాలను మరింత పెంచింది.




# ఇరుముడితో అదృష్టం వెతుక్కుంటున్న ప్రియా భవానీ శంకర్

న్యూస్ ప్రజెంటర్ నుండి హీరోయిన్‌గా ఛేంజైన చెన్నై పొన్ను ప్రియా భవానీ శంకర్ అనతికాలంలోనే యాక్ట్రెస్‌గా ఐడెంటిటీని దక్కించుకుంది. సపోర్టింగ్ రోల్స్ చేసుకుంటూ.. సెల్ఫ్ మేడ్ హీరోయిన్‌గా మేకోవర్ అయ్యింది. కోలీవుడ్‌లో ప్రూవ్ చేసుకున్న ఈ బ్యూటీ.. టాలీవుడ్‌లో మాత్రం సక్సెస్ కోసం స్ట్రగుల్ ఫేస్ చేస్తోంది. తెలుగులో ఇప్పటి వరకు చేసిన త్రీ మూవీస్ ఫ్లాప్సే. సంతోష్ శోభన్ హీరోగా తెరకెక్కిన కళ్యాణం కమనీయంతో టాలీవుడ్ తెరంగేట్రం చేసింది ప్రియా భవానీ శంకర్. కానీ ఈ సినిమా వచ్చి పోయిన విషయం తెలియదు ఆడియన్స్‌కు. కానీ దూత వెబ్ సిరీతో చేరువైంది. ఇందులో నాగ చైతన్య భార్యగా కరెప్టెడ్ జర్నలిస్ట్‌గా నటించింది. ఈ సిరీస్.. గోపీచంద్‌తో భీమ, సత్య దేవ్ జీబ్రాలో నటించే తెచ్చిపెట్టింది కానీ, ఈరెండు బాక్సాఫీస్ దగ్గర బోల్తా పడటంతో టీటౌన్‌లో అవకాశాలు తగ్గాయి. కోలీవుడ్ ఆఫర్స్‌తో కాలం నెట్టుకొస్తున్న ప్రియాకు.. మరొక ఛాన్స్ ఇస్తోంది టాలీవుడ్. శివ నిర్వాణ- రవితేజ కాంబోలో తెరకెక్కుతోన్న ఇరుముడిలో నటిస్తోంది. రవితేజకు భార్యగా కావేరి పాత్రలో కనిపించబోతుంది. ఆగస్ట్ 21న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది ఫిల్మ్. షూటింగ్ కంప్లీట్ కావడంతో సెట్స్‌లోని పిక్స్ సోషల్ మీడియాలో పంచుకుంది ప్రియ. అలాగే దూత సీక్వెల్‌లోనూ కంటిన్యూ కాబోతుంది. రీసెంట్లీ ఈ ప్రాజెక్ట్ పట్టాలెక్కింది. ప్రియా ఎ÷-లాప్స్ పట్టించుకోకుండా టాలీవుడ్ ఆఫర్స్ ఇస్తోంది.. మరీ మేడమ్ వాటిని సద్వినియోగం చేసుకుంటుందో లేదో.

# వరలక్ష్మి సంచలన పోస్ట్!

## 'పోలీస్ కంప్లైంట్' వివాదమే కారణమా?



నటి వరలక్ష్మి శరత్‌కుమార్, దర్శకుడు సంజీవ్ మేగోటి మధ్య నెలకొన్న వివాదం ప్రస్తుతం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. విడుదలకు సిద్ధంగా ఉన్న 'పోలీస్ కంప్లైంట్' చిత్రం చుట్టూ ప్రారంభమైన ఈ వ్యవహారం సామాజిక మాధ్యమాల్లో పెద్ద ఎత్తున చర్చకు దారి తీసింది. సినిమా విడుదలకు ముందు నిర్వహించిన మీడియా సమావేశంలో దర్శకుడు సంజీవ్ మేగోటి చేసిన వ్యాఖ్యలు వివాదానికి కారణమయ్యాయి. అనంతరం వరలక్ష్మి శరత్‌కుమార్ తన సామాజిక మాధ్యమ ఖాతాలో చేసిన ఒక పోస్ట్ మరింత ఆసక్తిని రేకెత్తించింది. "మొరిగే కుక్కలు కరవవు.. కరిచే కుక్కలు మొరగవు.. నేను మొరగను.. కరుస్తాను" అంటూ ఆమె చేసిన వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి. ఈ పోస్ట్ ఎవరిని ఉద్దేశించి చేశారనే విషయంపై ఎలాంటి అధికారిక స్పష్టత లేకపోయినా, దర్శకుడి వ్యాఖ్యలకు ప్రతిస్పందనగానే ఈ సందేశం పెట్టినట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. జూన్ 12న విడుదల కానున్న 'పోలీస్ కంప్లైంట్' చిత్రంలో వరలక్ష్మి శరత్‌కుమార్, నవీన్ చంద్ర ప్రధాన పాత్రల్లో నటించారు. భయానక యాక్షన్ కథాంశంతో తెరకెక్కిన ఈ చిత్రంపై చిత్రబృందం భారీ ఆశలు పెట్టుకుంది. అయితే ప్రచార కార్యక్రమంలో దర్శకుడు మాట్లాడుతూ, సినిమా రెండో భాగానికి సంబంధించిన డబ్బింగ్ పూర్తి చేయడానికి వరలక్ష్మి మూడు నెలల సమయం తీసుకున్నారని ఆరోపించారు. ఆ సమయంలో ఇతర చిత్రాల్లో పనిచేసినప్పటికీ, ఈ చిత్రానికి సంబంధించిన కొన్ని బాధ్యతలను పూర్తి చేయలేదని పేర్కొన్నారు. అలాగే ప్రచార కార్యక్రమాలకు హాజరు కావాలని పలుమార్లు కోరినా స్పందించలేదని తెలిపారు. హీరో నవీన్ చంద్ర కూడా ప్రచార కార్యక్రమాలకు దూరంగా ఉన్నారని దర్శకుడు వెల్లడించారు. ఈ వ్యాఖ్యలు వెలుగులోకి వచ్చిన కొద్ది సేపటికే వరలక్ష్మి చేసిన పోస్ట్ వైరల్ కావడంతో వివాదం మరింత ముదిరింది. సినిమా విడుదలకు ముందు ప్రధాన నటీనటులు, దర్శకుడి మధ్య విభేదాలు బయటపడటం అరుదుగా జరుగుతుంటుంది. అందుకే ఈ వ్యవహారం ప్రస్తుతం పరిశ్రమలో హాట్ టాపిక్‌గా మారింది. అయితే దర్శకుడి ఆరోపణలపై వరలక్ష్మి ఇప్పటివరకు నేరుగా స్పందించలేదు. ప్రస్తుతం అభిమానులు, సినీ వర్గాలు ఆమె పోస్ట్‌ను వివిధ కోణాల్లో విశ్లేషిస్తున్నాయి. ఇదిలా ఉండగా, ప్రధాన నటీనటులు ప్రచార కార్యక్రమాలకు దూరంగా ఉండటం సినిమా ప్రారంభ వసూళ్లపై ప్రభావం చూపే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# హిట్లు వస్తున్నా స్టార్‌డమ్ దూరం!

## శాన్వి మేఘన కథ ఇదే



తెలుగు చిత్ర పరిశ్రమలో ప్రతిభ ఉన్నప్పటికీ ఆశించిన స్థాయిలో గుర్తింపు దక్కని నటీమణుల్లో శాన్వి మేఘన ఒకరు. వరుస విజయవంతమైన చిత్రాల్లో నటించినప్పటికీ ఆమెకు రావాల్సిన స్థాయిలో స్టార్‌డమ్ ఇంకా రాలేదనే అభిప్రాయం సినీ వర్గాల్లో వినిపిస్తోంది. హైదరాబాద్‌లో జన్మించిన శాన్వి మేఘన 2019లో విడుదలైన 'సైరా నరసింహారెడ్డి' చిత్రంతో సినీ ప్రయాణాన్ని ప్రారంభించారు. అనంతరం 'పిట్ట కథలు', 'బిలాల్‌పూర్ పోలీస్ స్టేషన్', 'పుష్పక విమానం', 'మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్' వంటి చిత్రాల్లో నటించి ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించారు. ముఖ్యంగా 'పుష్పక విమానం' చిత్రంలో ఆమె నటనకు మంచి గుర్తింపు లభించింది. తెలుగుతో పాటు తమిళ చిత్ర పరిశ్రమలో కూడా తన అదృష్టాన్ని పరీక్షించుకున్న శాన్వి, అక్కడ 'కుటుంబస్థాన్' చిత్రంతో విజయాన్ని అందుకున్నారు. ఇటీవల 'టుక్ టుక్' చిత్రంతో మరోసారి ప్రేక్షకులను పలకరించారు. ఆమె నటించిన పలు చిత్రాలు విజయవంతమైనప్పటికీ, వ్యక్తిగతంగా ఆమెకు పెద్ద స్థాయి గుర్తింపు మాత్రం ఇంకా దక్కలేదు. నటిగా మంచి ప్రతిభ కనబరుస్తున్నప్పటికీ, అగ్ర కథానాయికల సరసన నిలిచే అవకాశాలు ఇంకా రావాల్సి ఉందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. సినిమా పరిశ్రమలో విజయవంతమైన చిత్రాల్లో నటించడం మాత్రమే కాకుండా, ప్రేక్షకుల్లో ప్రత్యేకమైన అభిమాన వర్గాన్ని సంపాదించుకోవడం కూడా ఎంతో ముఖ్యమని చెబుతుంటారు. శాన్వి మేఘన విషయంలో అదే అంశం కొంత వెనుకబడినట్లు కనిపిస్తోంది. అయితే నటనపై ఆమెకున్న అంకితభావం, పాత్రల ఎంపికలో చూపుతున్న వైవిధ్యం చూస్తుంటే భవిష్యత్తులో మరిన్ని పెద్ద అవకాశాలు ఆమెను వెతుక్కుంటూ వచ్చే అవకాశం ఉందని అభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం పలు కొత్త ప్రాజెక్టులతో బిజీగా ఉన్న శాన్వి మేఘన, నటనతో పాటు గ్లామర్‌కు ప్రాధాన్యం ఉన్న విభిన్న కథలను ఎంపిక చేసుకుంటూ తన సినీ ప్రయాణాన్ని కొనసాగిస్తున్నారు.

# దురంధర్ బాగా నచ్చింది: పవన్ కల్యాణ్



ఈ మధ్య కాలంలో ఇండస్ట్రీలో సూపర్ హిట్ అందుకున్న చిత్రం 'ధురంధర్'పై ఇప్పటికే సినీ ప్రముఖులు ప్రశంసలు కురిపించగా.. తాజాగా దీని ఫ్యాన్స్ లిస్ట్‌లో అగ్ర కథానాయకుడు పవన్ చేరారు. ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన 'ధురంధర్', 'బారాముల్లా' చిత్రాల గురించి మాట్లాడారు. 'ధురంధర్' మొదటి భాగం తనకు నచ్చిందని పవన్ చెప్పారు. కథను చాలా ధైర్యంగా చూపించారని అన్నారు. దర్శకుడు ఇలాంటి గొప్ప కథను తెరకెక్కించిన విధానం ఆకట్టుకుందన్నారు. ముఖ్యంగా మేకింగ్ స్టైల్ బాగుందని ప్రశంసించారు. తాను బిజీగా ఉండడం వల్ల 'ధురంధర్ 2' చూడలేకపోయినట్లు వెల్లడించారు. ఇక తనకు హారర్ జానర్ సినిమాలంటే ఇష్టమని తెలిపిన పవన్ 'బారాముల్లా' గురించి ప్రస్తావించారు. 1980ల చివర్లో తాను షూటింగ్‌ల కోసం శ్రీనగర్ వెళ్లిన రోజులను గుర్తుచేసుకున్నారు. 'నాకు హారర్ సినిమాలు చూడడం అంటే ఆసక్తి. అవి మన మనసును కథలో పూర్తిగా లీనం చేస్తాయి. నాకు నిద్ర రానప్పుడు ఏదైనా హారర్ సినిమా చూస్తాను. కశ్మీర్ నేపథ్యంలో తెరకెక్కిన 'బారాముల్లా' నాకు పాత జ్ఞాపకాలను గుర్తుచేసింది. నేను 1987-1989లో షూటింగ్‌ల కోసం కశ్మీర్ వెళ్తుండేవాడిని. అప్పుడే అక్కడ గందరగోళాన్ని స్వయంగా చూశాను. కశ్మీరీ పండిట్లు పడిన బాధలను గమనించాను. ఎవరైనా గెట్‌అవుట్.. ఇక్కడినుంచి వెళ్లిపోండి అంటే నాకు నచ్చదు. దాన్ని భరించడం చాలా కష్టం. బహుశా 'బారాముల్లా'లో ఉన్న ఆ భావోద్వేగమే నాకు సినిమా నచ్చేలా చేసిందేమో' అని చెప్పారు.

This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com